
దేశంలో అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మా...

డిసెంబరు 12-1980
1980





సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి లీలావతి
రాఘవయ్య

డిసెంబర్ 1980

సంపుటి 8 సంచిక 11

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

కాశీయాత్ర

రచన : చెల్లూరి సీతారాజేశ్వరరావు

ముఖచిత్రం : జయసుధ ; చివరి అట్టమీద : దీప

జ్యోతి, 1-8-4/1/1 చిక్కడపల్లి, హైదరాబాదు 500 020
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో సహా) 50 రూపాయలు





తొలిమాట

రాష్ట్రావతరణ రజతోత్సవాలు!


ఆంధ్రప్రదేశ్ అవతరించి పాతికేళ్ళయింది. రాష్ట్రావతరణ రజతోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఇరవై అయిదు సంవత్సరాలలో మనం సాధించింది ఇబ్బడి ముబ్బడిగా లేకపోయినా, తెలుగు రాష్ట్రంగా యేర్పడి, సంఘటితంగా యేర్పడిన నాటి నుంచి నేటివరకు సాగిన గమనాన్ని సవ్యంగా సమీక్షించుకోడం సబబుగావుంటుంది: కానీ అటువంటి ప్రయత్నం జరుగుతున్న జాడ లేమీ కనిపించడంలేదు. అయిదు కోట్ల తెలుగువారిదైన ఆంధ్రప్రదేశ్ అవతరణ రజతోత్సవాలలో కనిపించవలసిన సంరంభంకానీ, సముత్సాహంకానీ కనిపించడంలేదేమోనని మా కనిపిస్తోంది. ప్రత్యేక రాష్ట్రసిద్ధికి పూర్వరంగంలో సుమారు నలభై సంవత్సరాలు మరిగిన ఆంధ్ర హృదయాన్ని, ఈ సందర్భంగా మనం ఆవిష్కరించుకోలేకపోయామేమోననికూడా అనిపిస్తోంది. ఆంధ్రరాష్ట్రంకోసం ఆనాడు జరిగిన పోరాటాన్ని, ఆంధ్ర మహానాయకుడు పొట్టి శ్రీరాములు నిర్వహించిన ఆత్మార్పణ యజ్ఞాన్ని రేఖామాత్రంగా ప్రదర్శించే ఒక వ్యాసాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.

○ ○ ○ ○ ○

జ్యోతి నవంబరు సంచిక ముద్రణ బాగుందని అభినందిస్తూ పాఠకులనుంచి ఉత్తరాలందాయి. జ్యోతి రూపకల్పనని మరింక మెరుగుపరచడానికి కృషి చేస్తామని మా పాఠకులకు మనవి చేస్తున్నాము.

○ ○ ○ ○ ○

జ్యోతి దీపావళి సంచిక చాలా బాగుందని అభినందన లేఖలు రాసిన పాఠకులందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాము. జ్యోతి కథల పోటీ ఫలితాలు వ్యవధి చాలక ఈ సంచికలో ప్రకటించలేకపోయాము. వచ్చే సంచికలో కథల పోటీ ఫలితాల ప్రకటన వుంటుంది.



ఇల్లుకట్టి చూడు - పెళ్ళిచేసి చూడు

రచన : మాదిరెడ్డి సులోచన   పే 327. వెల రు, 12-00

ప్రచురణ : పద్మావతీ పబ్లికేషన్స్, హైదరాబాద్-500 027.

ప్రధానంగా ఒక కుటుంబగాధ యీ నవల. బలరామయ్య, అతని కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, మనవలు, మనవరాళ్ళు వాళ్ళ ప్రేమలు పెళ్ళిళ్ళ ఆధారంగా సాగింది కథ. ఎక్కువభాగం కథావస్తువు బలరామయ్యగారి పెద్దకొడుకు నారాయణ, అతని భార్యా పిల్లల పరంగా నడిచింది.

బంధుత్వాలకి, మమతానురాగాలకి మించిన విలువని వ్యక్తిగత ప్రయోజనాలకి, చాలా వరకు తనకుటుంబం బాగుకి యిచ్చిన నారాయణరావు ప్రధాన ఆశయాలు రెండు. ప్రణాళిక ప్రకారం నడిచి పెద్దయిల్లు కట్టడం, పిల్లల్ని గొప్పస్థితికి (ఆర్థికంగా) తీసుకు వెళ్ళటం. అతని తొందరపాటు, అత్యాశ, అతిశయం. అతనిభార్య సత్యవతి అహంభావంతో పరిస్థితులు తారుమారై ఆ దంపతులు అన్ని రకాలుగా దిగజారి, సమిష్టి కుటుంబంలోని అభిమానపు విలువని, కన్నబిడ్డల పెంపకంపట్ల వుండాల్సిన వోర్పుని గ్రహించి మంచివారుగా మారటం కథ. ఈ కథకి అనుబంధంగా నడిచిన రకరకాల పాత్రలు, సంఘటనలు వివరాలు కొల్లలుగా వున్నాయి.

ఎన్నుకున్నది కుటుంబగాథే అయినా నిత్యజీవితానికి సంబంధించిన కొన్ని విషయాల్ని స్పృశిస్తూ, వ్యక్తుల వివిధరకాల మనస్తత్వాలని, వాటికి అనుగుణమైన కోపతాపాల్ని వివరిస్తూ, అనవసరమైన వివరాల జోలికి వెళ్ళకుండా సంఘటన వెనకే సంఘటనని పేరుస్తూ రచన సాగటంవల్ల యీ నవల సామాన్య పాఠకులు కుతూహలంగా చదువుకునేలావుంది.

'ఇల్లుకట్టటం, ఆడపిల్ల పెళ్ళిచెయ్యటం యీనాటి మధ్య తరగతి కుటుంబాలకి పెద్ద పరీక్షలు. ఈ సమస్యల ఆధారంగా వున్న యీ నవలా వస్తువుకి అనుగుణంగానే యించుమించు పాత్రలన్నీ వున్నాయి. అన్నీ సుగుణాలో లేక అన్నీ దుర్గుణాలో కాక రెండూ కలగలిసిన మనిషిగా రాజేశ్వరి పాత్ర మలచిన తీరు బావుంది.

భావపరంగా చూస్తే....

గోళ్ళుషేవ్ చేసుకుంటూ (పే. 134) చెల్లెండ్లు, తెలివిమంతుడు లాంటివి చదువుకోటానికి కొంచెం యిబ్బందిగా వున్నాయి.

వస్తుపరంగా చూస్తే....

నారాయణరావు యింజనీరు. అన్నిపనులు ప్రణాళిక ప్రకారం చెయ్యాలనుకునే వ్యక్తి. ఇల్లు కట్టడం విషయంలో అతని ప్రవర్తన, అతనికి ఎదురైన ఆటంకాలు అన్నీ చూస్తే...

యిల్లుకట్టటంలో వున్న అన్నిరకాల యిబ్బందులు అతనికే సంభవించినట్టు కనిపిస్తాయి. చాలాచోట్ల ఏ మాత్రం అనుభవం లేని మామూలు వ్యక్తిలా తప్ప యింజనీరుగా ప్రవర్తించడు. రచనా సౌలభ్యం కోసం యివన్నీ కొంచం మోతాదు మించి రాసుకున్నట్టు అనిపించే ప్రమాదం వుంది.

*కొన్నిచోట్ల ఒక సంఘటన నుంచి మరో సంఘటనకి కథ మారిపోయింది. (ఉదా.... పే. 129) 12 వ లైను వరకు నామకరణం గురించి రాసి 18 వ లైను నుంచి శరీఫ్, నారాయణరావుల విషయం (వేరే స్థలం, వేరే విషయం) రాయటం జరిగింది. సంఘటనే మారినప్పుడు, వేరే చాప్టర్‌గా డివైడ్ చేస్తే బావుండేది.

ఇటువంటి లోపాలులేకుండా, వుంటే మరింత వీలుగా పాఠకులు చదువుకో గలిగిన నవల ఇల్లుకట్టి చూడు-పెళ్ళిచేసి చూడు.

—— రామ్మోహనరావు

చందాధారులకు మనవి

"జ్యోతి" సంచికలు సక్రమంగా అందడం లేదని మా చందాదారులలో కొందరి నుంచి తరచు ఫిర్యాదులందుతున్నాయి. చందాదారులందరికీ "జ్యోతి" సంచికల్ని సర్టిఫికెట్ ఆఫ్ పోస్టింగులో పంపుతున్నాము. అయినా కాపీలు అందడం లేదనే ఆరోపణ అందుకోనక తప్పడలేదు మాకు. పోస్టులో తప్పిపోయిన కాపీలకి మేము బాధ్యత వహించలేమని మా చందాదారులకు సవినయంగా మనవిచేసుకొంటున్నాము ఈ విషయంలో ఇటు మాకు, అటు మీకూ సాయపడగలవారు తపాలా శాఖవారే. వారికి చేతులెత్తి నమస్కరించి వేడుకోవడం తప్ప మేము ఈ విషయంలో చేయగలిగిందేమీలేదని మా చందాదారులు గ్రహించగలరని ఆశిస్తున్నాము. ఇక ముందు చందాలు చెల్లించే వారు కూడా ఈ అంశాన్ని గమనించి తమ చందాలు పంపవలసిందిగా కోరుతున్నాము. అందని కాపీలకు పరిహారం చెల్లించడం కూడా సాధ్యపడదని మనవి చేసుకొంటున్నాము.

—మేనేజర్

సీరియల్



నాలుగు రోజులు గడిచి పోయినాయి.

శేఖరం రాలేదు. ఒక రోజు చూసిన కాంతమ్మగారు రాఘవరెడ్డికి కబురు చేసింది.

ఆతను వచ్చి "నాతో బెజవాడ వెడతానని చెప్పాడు. మీకు చెప్పలేదా?" అన్నాడు.

"నాకేం చెప్పలేదు. తెల్లారితే వెడతాడనగా రాత్రి మీరా ఇంటికని వెళ్ళి వాడు రాత్రి పదకొండు గంటలకి వచ్చేడు. తెల్లారగట్ట నన్ను లేపకుండానే వెళిపోయాడు. పోనీ రాత్రి చెప్పలేదు వూరు వెళుతున్నానని" అందావిడ.

"చెప్పి వెళ్ళడానికేం. ఇంట్లో కంగారు పడరూ" అన్నాడతను.

ఈ మాటలు మీరా చెవిని పడ్డాయి. నిర్లిప్తంగా వుండే ఆ మనసు మీద ఈ మాటలు ఏ ప్రభావాన్నీ చూపలేక పోయాయి.

అన్నపూర్ణమ్మ గారి దగ్గరి నుండి వుత్తరం వచ్చింది. స్వయంగా ఆవిడే శాంతమ్మ గారికి రాసింది. నెలలోపు అరుణనీ పాపనీ తీసుకెళ్ళమనీ పెద్దకోడల్ని అలాగే తీసుకొచ్చేననీ-కావాలంటే మళ్ళీ అయిదో నెలలో తీసుకెళ్ళి నెలరోజులుంచుకోమని రాసిందావిడ. మరోలా భావించకోవద్దని మరీ మరీ రాస్తూ కోడల్ని ఏ రోజు పంపాలో తేదీ రాసింది. మూర్తిని పంపుతానని రాసింది.

శాంతమ్మ గారు ఇంకేమనడానికి లేకపోయింది. శేఖరం రాలేదు. ప్రయాణానికీ వ్యవధి లేదు, ఎన్ని చూసుకోవాలి, ఎక్కడికెళ్ళాడో తెలియదు; ఎప్పుడొస్తాడో తెలియదు. అనుకుంటూ శాంతమ్మ గారు హడావిడి పడిపోయింది.

మొదట రెండు మూడు రోజులు ఏమీ అనిపించకపోయినా అరుణ ప్రయాణం గురించి ఉత్తరం వచ్చేకా - శాంతమ్మ గారి దిగులు చూశాకా మీరాకి ఏమిటోగా అన్పించింది.

ఆ సాయంత్రం మీరాకి పని అయిపోయింది. అరుణా, మీరా వరండాలో కూర్చున్నారు. శాంతమ్మగారు లోపలే వుంది.

కారు ఆగిన శబ్దానికి అరుణా మీరా తిరిగి చూశారు. శేఖరం వచ్చేడు. శేఖరం చూపులు మీరా చూపుతో క్షణంలో సగం పేపు కలిసి విడిపోయినాయి.

మీరా లోపలికెళ్ళిపోయింది.


శాంతమ్మ గారు లేచి వచ్చే లోపు శేఖరం లోపలికొచ్చేడు. గంగులు కారులోంచి పాకెట్లు తీసుకొచ్చేడు.

"ఎక్కడికెళ్ళావురా! చెప్పా పెట్టకుండా వెళ్ళావు...."

మధ్యలోనే అన్నాడు శేఖరం "సాయంత్రానికే వచ్చేద్దామనుకున్నా నమ్మా! నువు పడుకున్నావు లేపడమెందుకని లేపలేదు."

"ఎయ్యేవురా! అరుణని నెలలోపు పంపాలని రాసింది. నువ్వులేవు. ఏం చేయాలో తోచక కొట్టుకుంటున్నాను."

"బట్టలూ అవీ తీసుకొచ్చేను-ఇంకా ఏమేం తేవాలో చెప్పు, మూర్తికిమొన్న ఫోను చేశాను. ఇలా వుత్తరం రాశారని చెప్పాడు" అంటూ అతను బట్టల ప్యాకెట్లు వూడదీశాడు.



"అయితే ప్రయాణమని నీకు తెలుసన్నమాట! ఇదేం తెలియక నేను కంగారు పడుతున్నాను."

వాళ్ళు బట్టలు చూస్తోంటే మీరా టీ తీసుకొచ్చి అక్కడ పెట్టింది.

వద్దనుకుంటూనే శేఖరం కొద్దిగా కళ్ళెత్తి మీరాని చూశాడు. మామూలుగానే ఎప్పట్లానే వుంది. అసలు మీరా రావటం మానేస్తుందనుకున్నాడు. దీన్ని బట్టి ఆమె ఇంట్లో పరిస్థితులు ఎంత ఘోరంగా వున్నాయో అనుకున్నాడు.

మీరా అక్కడ నించి వెళ్ళిపోయింది. శాంతమ్మగారి చీరలు చూస్తూ వాటి ధరలు అడుగుతోంది. శేఖరం లెదర్ బాగ్ జిప్ లాగి చిన్న పెట్టె తీశాడు. మళ్ళీ జిప్ మూసి బాగ్‌ని ఒళ్ళోనే వుంచుకున్నాడు. చేతిలో పెట్టె తెరిచి తల్లికి ఇచ్చేడు. దాంట్లో ఒంటిపేట చిన్న గొలుసూ, మురుగులూ వున్నాయి.

శాంతమ్మగారి నగలు అలాగే వున్నాయి. ఓ గాజులజత చెరిపించి అరుణ కూతురికి గొలుసూ మురుగులూ చేయించాలనుకుంటోంది.

"నన్నింత కంగారు పెట్టి ఇన్ని పనులు చక్కబెట్టుకొచ్చేడు" వాత్సల్యంగా కొడుకుని చూస్తూ అంది శాంతమ్మగారు.

"నచ్చాయా? అయినా మనకి నచ్చితే ఏం లాభం ఏదీ నీ కూతుర్ని తీసుకురా చూసుకుంటుంది" అన్నాడు శేఖరం.

"దాన్ని చేసుకునేది నువ్వేగా! నీకు నచ్చితే చాల్లే!" అంది అరుణ.

వాటికేం బాగానే వున్నాయి కాని, ఇంట్లో బంగారం వుంది కదా వాటిని చెరి

పించి చేయద్దా మను కున్నాను" అంది శాంతమ్మగారు.

"అవి అలా వుండనీయమ్మా! మళ్ళీ పెళ్ళికి పెటకపోతే బాగుండదు, అప్పుడు. నేనేమీ చేయించలేక పోవచ్చు".

"ఏమోరా బాబూ! నీమాటలేం అర్థం కావటం లేదు. అందరి సంగతీ చూస్తావు నీ సంగతి వచ్చే సరికి మాట్లాడవు" బాధగా అందావిడ.

"ఈ సారి నేను అన్నయ్య పెళ్ళికే రావటం" అంది అరుణ కూతుర్ని శేఖరం ఒళ్ళో కూర్చొ పెటబోతూ.

"అయ్యో అలా మంచం మీద పడుకోబెట్టు ఇప్పుడు బట్టలన్నీ తడిపిందంటే-అయినా ఎత్తుకోవటం నాచేతగాదు."

"నేర్చుకో! ఇప్పటి నుంచీ అలవాటు చేసుకోవాలి. రేపు నీకు పిల్లలు పుడితే బట్టలు తడవకుండానే పెరుగుతారా?" అంది అరుణ

శేఖరం మాట్లాడ లేదు. ఒళ్ళో వున్న బాగ్‌ని చేత్తోతడిమాడు దాంట్లో-విజయ్‌కి గొలుసూ, వుంగరం, రెండు బేబీ సూట్లూ ఉన్నాయి. మీరా తీసు కుంటుందన్న నమ్మకం లేదతనికి. అయినాకి నకుండా ఉండలేక పోయాడు. అరుణ కూతురికి కొంటూ విజయ్‌కీ కొన్నాడు.

—తల్లీ అరుణ బట్టలు చూస్తోంటే విజయ్ వాళ్ళ చేతుల్లోంచి లాగేస్తున్నట్టు— పనిలో వున్న మీరా వచ్చి, బాబుని కళ్ళెర్రజేసి కొడతానన్నట్టు బెదిరించి చూస్తోన్నట్టు—బాబు తనవి పాడు చేయనీయలేదని — తల్లి తీసుకుపోతోందని ఏడుపు అందుకుంటే తను దగ్గరికి తీసుకోబోతున్నట్టు........

"పెళ్ళీ పిల్లలూ అనకు. మరి మాట్లాడు" తల్లి మాటతో ఉలిక్కిపడ్డాడు.

బాగ్ తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

మీరాకి మళ్ళీ వంట పని పడింది. శాంతమ్మగారిని ఏం చేయాలో అడిగి చేసింది అప్పటికే ఏడున్నర అవుతోంది. మీరా వెళ్తున్నానని చెప్పటానికి వచ్చినప్పుడు శేఖరం అక్కడే వున్నాడు. "అరుణ, మీరా! ఇలారా బట్టలు చూద్దువుగాని". అంది,

క్షణం సేపు తటపటాయించి, "రేపు చూస్తా అరుణా!" అంది నెమ్మదిగా

"గంగుల్ని పంపనా" అని అడిగింది శాంతమ్మగారు.

"వద్దమ్మా!....నేను వెళ్తున్నానండీ!" అంది గుమ్మం ఇవతలినించే.


"సరే" అందావిడ

మీరా అక్కడినుండి వెళ్ళిందని నిర్ధారించుకున్నాక నెమ్మదిగా అన్నాడు శేఖరం" అప్పుని గుడి వరకూ వెళ్ళమంటే సరి."

అన్నగారికేసి సాలోచనగా చూసింది అరుణ

"మీరా అంటే అభిమానం వుంది అన్నయ్యకి" అనుకుంది.

అప్పుని పిలిచి మీరాకి తోడు వెళ్ళమని చెప్పింది శాంతమ్మగారు,



"అన్నయ్యా! మీరా వుద్యోగం సంగతి గుర్తుందా? మర్చిపోయావా" అని అడిగింది.

నిజానికి శేఖరం అలాంటి ప్రయత్నం ఏమీ చేయలేదు. మీరా తన ఎదురుగా వుండదనీ-మీరాతో మాట్లాడ్డానికి వుండదనీ అనుకున్నాడు. అరుణ వచ్చేక అన్నీ సానుకూల పడతాయను కున్నాడు. అలాంటిదేం జరగనేలేదు. అరుణ ప్రయాణం కూడా వచ్చింది. మీరాకి తప్పకుండా తొందరలోనే ఏదో ఒక ఉద్యోగం చూడాలి దృఢంగా అను కున్నాడు.

"ఉద్యోగాలు దొరకటం అంత తేలికను కున్నావా?"అన్నాడు.

"బెజవాడలో టైపిస్టు ఉద్యోగం వుందన్నావు? మీరా పరీక్ష పాసయిందట."

"అయితే ఏం లాభం?"

"పోనీ ఇంకోటి ఏదేనా చూడు" అంది.

శేఖరం మాట్లాడలేదు

మరో నాలుగు రోజులు గడిచిపోయినాయి.

ఇంక అరుణ ప్రయాణం ఒక్క రోజులోకి వచ్చింది శాంతమ్మగారికి ఒకటే హడావిడి. మీరాకి కూడా వూపిరాడటం లేదు. అంజన్న అనే అతన్ని తీసుకొచ్చి మిఠాయి, చక్కిలాలు చేయించారు. ఎంత పనిమనిషిని పిలిచి చేయించినా ఆ మనిషికి అన్నీ అందించడం, ఇంకా చిన్న చిన్న పనులతో మీరాకి వూపిరాడటం లేదు.

మీరాతో విడిగా మాట్లాడాలంటే శేఖరానికి కుదరటమే లేదు. ఎప్పుడు వీలవుతుందో అన్నట్లు అతను గొలుసూ, ఉంగరం జేబులో పెట్టుకునే ఉంటున్నాడు.

అవి మీరా పుచ్చుకుంటుందన్న నమ్మకం అతనికి లేదు. మొన్న మీరా తన అభిప్రాయం అంత ఖచ్చితంగా చెప్పేయటంతో శేఖరం మనసు మూగబోయినట్టయిపోయింది. అతను స్తబ్దుగా వుండిపోతున్నాడు— మీరా కోపంగా సమాధానం చెప్తున్నా తనకి టీ కావాలన్నప్పుడు మీరాని టీ అడగటానికి సంకోచించేవాడు కాదు. అసలు మీరాతో మాట్లాడాలనే తల్లి ఏ దొడ్లోనో ఉన్నప్పుడు పనిగట్టుకుని వచ్చి "నాకు టీ కావాలి" అని అడిగేవాడు. అలాంటిది ఈ నాలుగు రోజులుగా అతను టీ కావాలని మీరానే కాదు తల్లికి కూడా చెప్పలేదు. తల్లి "ఏరా టీ పెట్టమంటావా" అని అడిగితే "ఊ" అంటాడు. అతను టీ అడగటంపోవడం మీరా గ్రహించింది. మొదటి రెండు రోజులు మామూలుగా అడిగితే పెట్టచ్చని వూరుకున్న మీరా తర్వాత అతను తల్లితో మాట్లాడుతూ భోజనాల గదిలో కూర్చున్నప్పుడు— బయటికెళ్ళి రాగానే— ఇంకా తేవలసిన వస్తువుల గురించి వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ కూర్చుండిపోయినప్పుడు మీరాయే టీ చేసి అక్కడ పెట్టేది. 'తనమీద కోపంతో తనని అడగటానికి ఇబ్బందిపడి ఈ నాల్రోజుల్లో అతను యిబ్బంది పడటం ఎందుకూ!' అనుకొంది.

'తను ఒక్కడు మినహాయించి మీరాకి అందరూ పనికి వస్తారు. అమ్మగారి కొడుకుననో— లేక ఆ ఇంటికొచ్చిన వాళ్ళలో ఒకడుగానో తనకి కూడా వండి— వడ్డించడానికి అసహ్యం లేకపోవచ్చు— అలాగే అమ్మగారు మరోసారి చెప్పక్కర లేకుండా టీ చేసిస్తోంది' అరుణ ప్రయాణపు పనులతో వూపిరాడనంతగా హడావిడిగా తిరుగుతూ మధ్యలో తనకి టీ ఇచ్చి వెళ్ళినప్పుడు అనుకునేవాడు శేఖరం.

కాంతమ్మగారు నాలుగు రోజుల క్రితమే మీరాతో అంది "ఈ నాలుగు రోజులూ కాస్త ఆలస్యం అయినా బెంగారు పడదని మీ అమ్మగారితో చెప్పిరా. గంగుల్ని సాయం పంపుతాను" అని. మీరా తల్లితో చెప్పింది "అరుణ నాలుగు రోజుల్లో వెళ్ళిపోతుందమ్మా! కాస్త ఆలస్యం అయినా బెంగారు పడకు, వాళ్ళ పనిమనిషిని సాయం తీసుకొస్తాను. అసలు ఈ నాలుగు రోజులూ సర్దాగా తనతో వుండిపోమని పట్టుబట్టింది అరుణ. అమ్మగారు కూడా చెప్పేరు."

"పొద్దున్ననగా వెళ్ళిన దానికి సాయంత్రం వరకక్కడే వుంటున్నావుగా! మధ్యలో ఓ గంటసేపు ఇంటో వుంటున్నావు" అంది కాంతమ్మ.

"వాళ్ళంత ఇదిగా చెప్తుంటే ఏ మనను! పోనీలే ఎలాగూ మానేస్తున్నాగా!" అంది మీరా. కాంతమ్మ మాట్లాడ లేదు.

తెల్లారితే ప్రయాణ మనగా మూర్తి వచ్చేడు! చంటి పిల్లతో ప్రయాణం అవస్త అవుతుందని, మూర్తి, వాళ్ళ మేనమామ కారు అడిగి దాంట్లో వచ్చేడు.

వంట అయిపోయినా మీరా వెడతానని అడగలేదు. భోజనాలు వడ్డించి వెళ్ళాలేమోనని!.

రాత్రి ఏడున్నర దాటింది. కాంతమ్మగారు మీరాని వెళ్ళిపొమ్మంది. రాత్రి

తొమ్మిది దాటితేగాని వాళ్ళు ఎలాగూ భోజనాలు చేయరు అనుకుందావిడ.

"పొద్దున్న తొందరగా వచ్చేయి" అంది. "అలాగే" అంది మీరా.

"దేవంతా అసలే ఒదరదు. కొట్లు కట్టేస్తారేమో ఎలాగా" అని బెంగగా వస్తోంది మీరా. అరుణ కూతురుకి గౌనులు కొనాలని. మొదట బజారులో బట్ట తీసుకొచ్చి తనే కుట్టాలను కొంది. కాని అసలు తీరుబాటే వుండటం లేదు. తల్లిని కుట్టమనాలని పించలేదు. ఇంట్లో తనవీ ఆవిడవే కుట్టడంలేదు. తనే తీరుబాటు చేసుకుని కుడుతోంది. ఆవిడ కసలు ఏపనిలోనూ ఉత్సాహం ఉండటంలేదు.

కాంతమ్మగారు అప్పుని పంపిస్తానంటే అక్కరలేదని వచ్చేసింది.

మీరా ఓ కొట్లోకి వెళ్ళింది. ఆకొట్లోనే రెడీమేడ్ దుస్తులు బాగుంటాయి.

మీరా వెళ్ళిన బట్టల కొట్టుకి నాలుగు కొట్ల ఇవతల ఓ కిళ్ళీబడ్డీ దగ్గర నిలబడ్డ శేఖరం మీరా కొట్లోకి వెళ్ళడం చూశాడు. శేఖరాన్ని మీరా చూడలేదు. అయిదారు నిముషాలు ఆగిన శేఖరం నెమ్మదిగా తనూ ఆ కొట్లోకి వెళ్ళేడు.

కొట్లో మీరా కాక మరో ఇదరు ఆడవాళ్ళు వున్నారు. మీరా చేతిలోగౌనులు అక్కడ బల్లమీద పెట్టి విజయ్‌కి పాపకి తీసుకున్న గౌన్ల కలర్‌లో రెండు చొక్కాలు తీసుకుంది.

శేఖరం వెనక్కి వచ్చేశాడు. కొట్టు అతను "వెళ్ళిపోతున్నారేమండీ" అన్నాడు.

"మళ్ళీ వస్తాను" నెమ్మదిగా అని వచ్చేశాడు.

పక్కవాళ్ళ మాటల్లో కొట్టు అతను అడగడం కాని శేఖరం సమాధానం కాని మీరాకి వినపడలేదు. కొట్లో డబ్బు చెల్లించి బట్టల ప్యాకెట్టు తీసుకుని బయట కొచ్చేసింది. రెండు గౌనులూ ఇరవై రూపాయలు పెట్టి కొంది. విజయ్‌కి బామ్మగారు చేయించిన రెండు ఉంగరాల్లో - ఓ వుంగరం ఆ గౌనులు అరుణ కూతురికి యివ్వాలని మీరా అభిప్రాయం. అరుణకి కూడా ఏదేనా యివ్వాలని వున్నా ఆ కోరికని చంపుకుంది. అరుణ పుచ్చుకోదు, గొడవ చేస్తుందని.

"మీరా!"

ఉలిక్కిపడింది మీరా. అడుగు ముందుకి పడలేదు —

"మీరా!" శేఖరం దగ్గర కొచ్చేడు. అంత వరకూ అరుణని గురించిన ఆలోచనలతో ప్రసన్నంగా వున్న మీరా ముఖం ముడుచుకుపోయింది.

"నువ్వేమీ అనుకోకపోతే.... ఒక మాట!" అన్నాడు పాంటు జేబులోకి చెయి పోనిస్తూ. మీరా మాట్లాడలేదు. వెళ్ళి పోదామని ముందుకి అడుగు వేయబోయింది.

"మీరా, ఉండు" అని పేంటు జేబులోంచి చిన్న పొట్లం తీసి, "ఇదిగో మీరా! ఇది తీసుకో! దీని కోసమే పిలిచేను" అంటూ అందివ్వబోయాడు.

(సశేషం)



శాంతి సిల్క్ రీలింగ్ అండ్ ట్విస్టింగ్ యార్న్ మాన్యుఫాక్చరర్స్ వారి సభావేదికపై శ్రీమతి కె. రాఘవమ్మ, శ్రీ ఎ. ఎమ్. థామస్, శ్రీ రామసుబ్బారెడ్డి

మహిళల సంక్షేమ దృష్టితో పట్టుపరిశ్రమ శిక్షణ కేంద్రాలు!

శ్రీమతి రాఘవమ్మ కృషి!

ఆంధ్ర మహిళలు అన్ని రంగాలలోనూ ముందుకు చొచ్చుకు వస్తున్న మహత్తరమైన తరుణం యిది. మంత్రి పదవుల నిర్వహణ నుంచి మానవ సేవ వరకు, పత్రికా నిర్వహణ నుంచి పతిహీన స్త్రీ జనోద్ధరణ వరకు ప్రతి రంగంలోనూ నేటి తెలుగు వనిత తన తెలివి తేటలతో, చొరవతో ముందంజవేస్తోంది. శ్రీమతి కె. రాఘవమ్మ సాంఘిక సేవా రంగంలో తొలుత కార్యకర్తగా, తరువాత మార్గదర్శిగా నలుగురికీ తలలో నాలుకగా మసలిన వ్యక్తి.

శ్రీమతి రాఘవమ్మ 1973 లో పట్టుపురుగులు పెంచే కార్యక్రమం చేపట్టి, పట్టినపట్టు విడవకుండా, ఆరు బేసిన్ల యూనిట్ ఒకటి నెలకొలిపి అందులో పన్నెండు మందికి జీవనోపాధి కల్పించారు. రాఘవమ్మ గారి ఈ ప్రయత్నం ఫలించడానికి తొలి దశలో ఒక బ్యాంక్ వారు, తరువాత అఖిల భారత ఖాదీ కమిషన్ వారు, రాష్ట్ర ఖాదీ బోర్డు వారు ఆర్థికంగా చేయూత యిచ్చారు. పట్టు దారం తీసే స్థాయి నుంచి యిప్పుడు వీరి 'శాంతి సిల్క్ రీలింగ్ అండ్ ట్విస్టింగ్ యార్న్ మాన్యుఫాక్చరర్స్' సంస్థ పట్టు వస్త్రం నేసే స్థాయికి యెదిగింది. 1980, నవంబరు 8 న అఖిల భారత ఖాదీ కమిషన్ అధ్యక్షులు శ్రీ ఎ. ఎమ్. థామస్ పదహారు బేసిన్‌లు, పది మగ్గాలూ వున్న యూనిట్‌కు ప్రారంభోత్సవం జరిపారు.

చెప్పుకోదగ్గ విషయమేమిటంటే, ఇప్పుడు శ్రీమతి రాఘవమ్మ తమ సంస్థ తరఫున రెండు శిక్షణ కేంద్రాలను ప్రారంభించబోతున్నారు. ఈ కేంద్రాలకు ఖాదీ కమిషన్ వారి గుర్తింపు, ఆర్థిక సహాయం వుంటుంది.

ఈ శిక్షణ కేంద్రాలలో వితంతువులకీ, కారణాంతరాల వలన భర్తల నుంచి విడిపోయిన స్త్రీలకీ అనాథ స్త్రీలకీ జీవనాధారం కల్పించే సదుద్దేశంతో శిక్షణ యివ్వాలని శ్రీమతి రాఘవమ్మ సంకల్పం. ఈ శిక్షణ కాలం సుమారు మూడు నెలలుంటుంది. శిక్షణ కాలంలో నెలకి తొంభై రూపాయలు స్టయిఫండ్ లభిస్తుంది. శిక్షణానంతరం నెలకి నూట యాభై రూపాయల కనీస వేతనంతో శిక్షణ యిచ్చిన సంస్థలోనే ఉద్యోగం లభిస్తుంది. శిక్షణ పొందిన వారు కనీసం రెండు సంవత్సరాలు 'శాంతి సిల్క్ రీలింగ్ అండ్ ట్విస్టింగ్ యార్న్ మాన్యుఫాక్చరర్స్'లోనే పని చేయవలసి వుంటుంది. శిక్షణ తరగతులు 1980 డిసెంబర్ చివరి వారంలో ప్రారంభమవుతాయి.

మహిళా సంక్షేమ దృష్టితో ప్రారంభిస్తున్న యీ కార్యక్రమానికి మన నాయకుల నుంచీ, ఖాదీ కమిషన్, ఖాదీ బోర్డు వంటి సంస్థల నుంచీ సంపూర్ణమైన సహాయ సహకారాలు లభిస్తాయని శ్రీమతి రాఘవమ్మ ఆశిస్తున్నారు. తమ సంస్థలో తయారవుతున్న పట్టుకి గోల్కొండ పట్టుగా ప్రపంచ ప్రఖ్యాతి తీసుకు వచ్చి, తద్వారా ఆంధ్రప్రదేశ్ పేరు ప్రఖ్యాతులను యినుమడింప చేయాలన్న రాఘవమ్మ గారి సత్సంకల్పం సిద్ధించాలని కోరుకుందాము.

ఈ శిక్షణ కేంద్రాలలో చేరదల్చుకొన్న మహిళలు తమ వివరాలు శ్రీమతి రాఘవమ్మ గారికి తెలియజేస్తూ దరఖాస్తులు పంపించ వచ్చు. చిరునామా: శ్రీమతి కె. రాఘవమ్మ, శాంతి సిల్క్ రీలింగ్ అండ్ ట్విస్టింగ్ యార్న్ మాన్యుఫాక్చరర్స్, గోల్కొండ పోర్టు, బడా బజార్, హైదరాబాద్ 500 008.

మతి భ్రమించినదెవరికి?

కల్పవల్లి

"అన్నూ, ఆ పుస్తకమైతే గాని పడుకోవా?

"అలిసి పోయి గుండు ఆలిగేస్తాడు."

"ఏ గుండు?" అడిగింది అనుపమ, యింత చదవ నివ్వడనుకుంటూ. ఛేతి వేలిని ఆమె వేపు తిప్పాడు.

"ఛీహా... గుండు సీనియర్, గుండు జూనియర్... పుట్టకుండానే నామకరణం చేసేసారు గాని అబ్బాయే అవుతాడని మీకెలా తెలుసు?"

"నా సిక్స్త్ సెన్స్, అదే అంతరాత్మ చెప్పింది."

"అంతరాత్మ ఆ అబ్బాయికి నాన్నగారి పోలిక వచ్చి చక్కటి గుండుతో పుడతాడని కూడా చెప్పిందా?"

"నేనేమీ గుండుతో పుట్టలేదు. నీలాంటి వాళ్ల చేతుల్లో..."

"అబద్ధం.... నన్ను కలిసి నప్పటికే... ముందింకెవరితోనో పీకించు...."

"హే భగవంతుడా... ఏం కలియుగం సృష్టించేవు... పాతివ్రత్యం అటుంచి ఈ కాలం ఆడవాళ్ళు..." ఆమె నవ్వకుండా ఉండలేక పోయింది. అంతవరకు నొక్కిపెట్టిన అతని నవ్వు కూడా మరి ఆగనంది.

"ఉండుండా మీ భగవంతుడితో పిర్యాదు..."

"ధన్... ధన్... ధన్ ధన్..."

నవ్వుతున్న ప్రశాంత్, అనుపమ ఒక్క సారి నవ్వాపి. ఒకరి కొకరు చూసుకొని "పక్కింట్లో" అని నిర్ణయించుకున్నారు.

"పక్కింట్లో మహాభారతం మొదలైనది. ఆ రాపుస్తావా?"

"అతనెందుకు ఆపుతాడు? మీ ఆడవాళ్లున్నారే..."

"ఆడవాళ్ళనంటే ఒప్పుకోను," అనుపమ గొంతు హెచ్చింది.

"మనింట్లో ప్లాసీ యుద్ధం మొదలవకుండా పడుకుందామా?"

ప్రశాంత్‌కి వెంటనే నిద్ర పట్టేసింది. పక్కింటి చప్పుళ్లు వింటూ అనుపమ అటు, యిటు దొర్ల సాగింది. రావుగారు, భార్య తరుచు గట్టి గట్టిగా అరుచుకుంటూ, తిట్టుకొంటూంటారు. మరొకప్పుడు మళ్లీ చేతిలో చెయ్యి వేసుకొని పొత్తుగు నెలల పిల్లాడిని తన దగ్గిర వదిలేసి షికారీ, సినిమా కెళ్లి పోతుంటారు. ఇవాళ తగువు పెట్టుకోడం వరకు వచ్చిందా? అతని కావిడమీదనుమానం, ఆవిడ కతని మీద నమ్మకం లేదు.... ఈ చప్పుళ్లు...తన కెందుకు వాళ్ల బాధ? ప్రశాంత్ లాగ తనకి కూడా నిద్ర పట్టేస్తే ఎందుకు రాదు? నిద్ర రాక ఆలోచనల కొత్తు కోడానికి మనస్సనే మైదానం దొరగ్గానే గతం కళ్ల ముందుకొచ్చింది.

సాయంత్రం యింటికి వచ్చిన తను అలవాటు ప్రకారం ఆ యింటివేపు ఒకసారి చూసి "అరుణ్ వాళ్ళు లేరుగా" అనుకుంటూ గేటు తోసింది. తలుపు కొట్టి మళ్లీ అటు చూసింది. ఎవరో అటు, ఇటు తిరుగుతున్నారు. కొత్త వాళ్లెవరో దిగిపోయి నట్లుంది. వీళ్లకి కూడా అరుణ్ లాంటబ్బాయి ఉన్నాడో, లేడో... తనాలోచనకి నవ్వొచ్చింది. అరుణ్ ఉంటే ఈ పాటికి పరిగెట్టు కొచ్చేవాడు. ఈ గవర్నమెంటు ఉద్యోగాలు... ట్రాన్స్‌ఫర్‌లు...నిన్నరాత్రే మొన్నో దిగినట్లుంది. అప్పుడే వెళ్లిపోయారు. వాళ్లొచ్చిన కొత్తల్లో ఒకరోజు.



...తానతో పచార్లు చేస్తూ తనకే అప్రయత్నంగా అటు చూసింది. గేటు దగ్గర నిలబడి ఒకాయన తన కోసం కాబోలు ఎదురు చూస్తున్నది. ఆమె కొంగు పట్టుకొన్న కొడుకు తనని చూస్తున్నాడు. తనకి పెళ్లై తర్వాత ప్రత్యేకాకర్షణ అప్పట్లో లేదుగాని ముద్దులు మూటగట్టే పసివాడు నవ్వుతూంటే పలకరించాలనెవరికుండదు? "ఏయ్ గుండూ నీ పేరేమిటి?"

"...పేరేటి..."

అంటూ నవ్వటం మరచిపోయినతను నవ్వుతూ వాళ్ల గుమ్మం దాకా వెళ్లింది. నా పేరుగుండు కాదు, అని వాడంటే "అరుణ్‌కి ఈ మధ్యే తిరుపతి ముక్కు చెల్లించాము," అంది వాళ్లమ్మ. ఆ విధంగా మొదలైన పరిచయం త్వరలోనే స్నేహంగా మారింది. అరుణ్‌కైతే తన దగ్గిరే తన చేతికెత్తి పెడితే. మమతలు పెంచుకోకూడ దను కుంటూనే తను అమ్మ తలుపు తియ్యడంతో

ఈ లోకంలో పడింది పలికెళూ ఆ యిం టిని మరొకసారి చూసింది.

ఆదివారం సాయంత్రం .. లాన్ లో కూర్చున్నారు ఉన్నట్టుండి నాన్నగారు పనుందంటూ వీధిలోకెళ్లారు అమ్మకూడా వంటింట్లో కెళ్లగానే తన నోట్సు వ్రాసు కుందామని పుస్తకాలు, కాగితాలు తెచ్చిపెట్టుకుంది గాని చదవాలనిపించలేదు. దూరంగా రెండు మోడు వారిన చెట్లు కనిపించేయి.. ఎంత అందంగా ఉన్నాయి? గబగబా కలం తీసింది... ఆ రెండు మోడు వారిన వృక్షాలు... ప్రకృతి మలచిన శిల్పాల్లాగ....భగవంతుడి సృష్టి ఒక ఆర్ట్ గేలరీ అయితే, అవి రెండు మాస్టర్ పీసెస్ లాగ.... కాదు ఆశలు, కోరికలులేని విరాగినలలాగ.... కలం ఆగిపోయింది. ఆ రెండు చెట్లు తనలాగ ఆశలు కోరికలు లేకుండా....అప్పుడే వీచిన గాలికి కాగితా లెగిరి పోయాయి. లేచి తియ్యాలను కుంటూాండే ఎవరో ఎత్తినట్లు చప్పుడయింది.

"ఏయ్ గుండూ, కాగితాలు ముట్టుకోకు," అంటూ తిరిగిన తను ఎదురుగా అపరచిత వ్యక్తిని చూడగానే తెల్లబోయింది.

అతను కూడా నోట మాట రాక నిలబడ్డాడు. ఏదో ఆలోచిస్తున్న తను అరుణ్ వచ్చేడనుకుంది. జుట్టు వచ్చిన తరువాతకూడా వాడి నేడిపించడానికి "గుండూ" అనడం .... అరె యితని తల మీద .... ఖాళీ మైదానంలో అక్కడక్కడ మొలచిన గడ్డిపరకల్లాగ వెంట్రుకలు ... కంపేరిజన్ చాల బాగుంది గాని, అతన్ని వెక్కిరించడాని కందను కున్నాడేమొ.

"అయామ్ సారి, నేను అరుణ్ వచ్చేడను కున్నాను. నాన్నగారింట్లో లేరు. మీరు ..." నిలబడుతూ అంది.

"నేనా యింట్లో కొత్తగా దిగేను. మీతో పరిచయం ...."

"అరుణ్ వాళ్ళింట్లోకి మీరే వచ్చారన్న మాట".

అరుణ్ అనబడే "గుండు" కూడా ఆ యింట్లోనే వుండేవాడన్న మాట", తల మీద చెయ్యివేసి తిరిగి అన్నాడు, "అందుకేనా మీరు వస్తూ, పోతూ ఆ యింటి వేపు చూయీ గుండు కనిపించగానే డిస్సాయింట్ అవుతారు ?".

ఇంతసేపటికి తన మూడ్ పాడు చెయ్యడానికి తగలుకున్నాడు .... ఎక్కడ అర్ధగేలరీ ఎక్కడ ఈ ...

"ఎవరితో మాట్లాడతున్నావు, అనూ?" అంటూ అమ్మ వచ్చింది.

"నమస్కారమండీ నన్ను ప్రశాంత్ అంటారు" యూనివర్సిటీ సైకాలజీ డిపార్టుమెంటులో పని చేస్తున్నాన. ఆ కనిపిస్తున్న యింట్లో ....

"అరుణ్ వాళ్లు ఖాళీ చేసినింట్లో మీరే దిగేరా ?" అమ్మ సగంలోనే అందుకుంది. "అదేమిటి నిలబడే వున్నారు, కూర్చోమని చెప్పాలని కూడా మా అమ్మాయికి తెలియదు, అందులో ఆలోచనల్లో పడిందంటే.... ఫేమిలీ నింకా తెచ్చినట్టు లేదే ?" అమ్మ కూడా నిలబెట్టే మాట్లాడతూాండే మెల్లిగా కుర్చీలు వాళ్ళ దగ్గిరకి తోసి యింట్లోకెళ్దామని రెండడుగులు వేసింది.

"ఒక్కడినే వుంటున్నాను. ఫేమిలీ యింకా ...."

"అన్నీ సర్దుకొని తెచ్చుకోవచ్చు ... అమ్మా అనూ, లోపలి కెళ్తున్నట్టున్నావు, పొయ్యి మీద పాలు పెట్టేను. పొంగు వస్తే కాఫీ నీళ్ళపడేయి", అని మళ్ళీ అతన్నడిగింది "ఇంతకీ పిల్లలెంత మందన్నారు ?".

"నాకింకా పెళ్ళి కాలేదండీ...."నవ్వుతూ అన్నాడు.

ఈ ప్రబుద్ధుడికింకా పెళ్ళి కాలేదా? ఎందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది. బాగుండదని చక చకా వెళ్ళి పోయింది గాని అమ్మ గొంతుక వంటింటి దాక వినిపిస్తూనే ఉంది అతనింటి పేరు, ఊరు తెలుసు కొని దూపు చుట్టరికం గబగబా కలిపింది....'ఎలిజబుల్ బాచలర్,' కదా....ఆ మధ్య చూసిన సినిమాలో లాగ....కాఫీ పట్టుకొచ్చే సరికి నాన్నగారు కూడా వచ్చేరు.

"మా అఖరమ్మాయి, అనుపమ, ఎమ్.ఎ. చేస్తున్నాది. వీరు..."

"పరిచయాలయాయి...," తను కొక్కరికే కనిపించేలాగ చిలిపిగా చేతితో రాసుకొని నవ్వుతూ అ గేను," ఏం కాలేజి లేటుగా వదులు తారేమిటండీ?"

"నేను ప్రైవేటుగా పరీక్షిస్తున్నాను. ఆఫీసు కని లైబ్రరీకెళ్ళి పుస్తకాలు చూసుకొచ్చేసరికి లేటయి పోతుంది "

"ఏం చదువులో న్యాయనా.. వానికి వాళ్ళ నాన్నగారు తోడు...బి.ఏ. అయిపోయింది, పెళ్ళి చెయ్యమంటే నా కూతుర్ని లాయరు చేస్తానంటూ "లా కాలేజిలో చేర్పించారు. ఈ ఊరు రావడంతో ఆ చదువు పూర్తి కాలేదు. ఇప్పుడిది పెళ్ళి చేసుకోను....ఎమ్. ఎ. అయ్యాక ఐ. ఎ. ఎస్ కి కడతాను..."

అమ్మ టేపు రికార్డరు విప్పిందంటే మరి కట్టదు. నాన్నగారు కూడా తనకి పెళ్ళి చేసేద్దామని బుద్ధిపుట్టి వద్దన్నా వినకుండా సంబంధాలు చూస్తున్నారు. పెద్ద వాళ్ళిద్దరూ సెటిలై పోయారు. తనుకూడా ఒకరింటిదైతే....వాళ్ళ ఆశ్రుత నర్థం చేసుకోగలదు గాని.... ఉన్నట్టుండి ఒకటి రెండు సార్లు జరిగిన పెళ్ళి చూపులు జ్ఞాపకం వచ్చాయి. అప్పుడు కూడా యిలాగే ముళ్ళ మీద కూర్చున్నట్లనిపించింది. తలొంచుకుందిగాని అతని చిలిపి కళ్ళు తనని పరికిస్తున్నాయని అనుమానంగా ఉంది. ఇవేమి పెళ్ళి చూపులు కావు కదా, అలాగ చూసే హక్కెవరిచ్చారు తను లేటుగా వచ్చే సంగతి. ఆ యింటివేపు చూడటం కొంపదీసి అతన్ని చూసు కన్నాననుకున్నాడా? ఇతనికేమి పని లేదా? ఇంకా ఎంత సేపు కూర్చుంటాడు?

○ ○ ○ ○

అనుపమ పక్కకి తిరిగి చూసింది. "ఇంకా ఎంతసేపు కూర్చుంటాడు: అని విసుక్కున్న తన తనికి హృదయంలో స్థానం యిస్తుందని .... ఈ గుండు సీనియర్"కి అరుణ్ లాంటబ్బాయి .... హాయిగా నవ్వుకొని నిద్ర కుపక్రమించింది. పక్కింట్లో సందడి కా అణగ లేదు.

ఎవరో తలుపు కొడుతున్నారు. బలవంతాన కళ్ళు విప్పింది. బాగా పొద్దెక్కింది. ఆవలిస్తూ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పుల్లాడి నెత్తుకొని రావు బయట టాక్సీ వుంది .. వెనకసీట్లో మిసెస్ రావు పడుకోనుంది.

"వీడిని కొంచెం సేపుంచుకుంటారా ? మేము హాస్పిటలు కెళ్ళాలి", అంటూ పిల్లడినందించి, ఏమైందన్న ఆమె ప్రశ్నకి జవాబు చెప్పకుండా టాక్సీ ఎక్కిపోయాడు.

"మళ్ళీ పిల్లడింట గట్టేరా ? వేళాపాళా లేదా", విసుక్కుంటూ లేచేడు ప్రశాంత్.

"హాస్పిటలు కెళ్ళారు మిసెస్ రావుకి వంట్లో బాగున్నట్టు లేదు".

"రాత్రి తల్లి వార్లు తందనాలాడేరు .. ఇప్పుడీ తద్దినం మనకి .".

"పాపం వీడినేం చెంటాగ? పిల్లలు

కవితకి కార్టూన్ :



గగన సీమాన్ని గాలి
పొరలు పొరలుగ చీల్చుతుంది.
రెండూ అదృశ్యములే
దిక్కులు ఊహా జనితాలు
డక్కులు లేవు.

— వేగుంట మోహనప్రసాద్

దేవుడితో సమానం".

"పిల్లలు... పిల్లలు... అని సరిపడి పోతావు ఇది వరకంతా "అరుణ్" "అరుణ్" అంటూ బోరుకొట్టేది దానికి ఇప్పుడీ బేబీ సిట్టింగ్ ...."

"అవసర మొచ్చినప్పుడు కాకపోతే యిరుగు - పొరుగు ఎందుకండీ?"

"వేటగాడు మెత్తనైతే లేడి మూడు కాళ్ళ మీదే నడిచిందట."

"పోనిద్దురూ. వీడి నొక్కసారి ఎత్తుకుంటే కాఫీ తెస్తాను."

"నాక్కూడా నా పనిష్మెంట్?" అంటూనే అందుకున్నాడు ఎర్రగా బొద్దుగా వున్నవాడి నెత్తుకోగానే కోపం కరిగిపోయినట్లుంది... వాడిని ముద్దాడుతూ ఒక చిటిక ఆమె బుగ్గ మీద కూడా వేసి అన్నాడు", ఎంత వు పిల్లడినే ఎత్తుకు మోయిస్తున్నావు, అసలు వాడొచ్చాక .."

"అందుకే ట్రైనింగ్" నవ్వుతూ వంటి ట్లో కెళ్ళిపోయింది.

సాయంత్రం ప్రశాంత్ యింటి కొచ్చే సరికి కూడా రావు రాలేదు. అసలే అనుపమ గాభరా పడుతూంటే పుండు మీద కారం జల్లుతూ ప్రశాంత్ దెప్పడం మొదలు పెట్టగానే ఆమెకి ఎటూ తోచ లేదు. ఇంతలో రావు బావమరిది నలుగురైదుగురు మగవారితో పిల్లడి తీసి కెళ్ళటానికి వచ్చాడు.

"మిసెస్ రావుకేమైంది?"

"అతనెందుకు రాలేదు?"

అనుపమ, ప్రశాంత్‌ల ప్రశ్నలకి సమాధానం చాల తీవ్రంగా వచ్చింది "మా చెల్లెలు కేమైందా? ఆ త్రాష్టుడు కొట్టి కొట్టి ఆస్పత్రిలో పడేసాడు...వెన్నముక మీద దెబ్బ తగిలిందంటాడు డాక్టరు మేము కూడా వాడిని వదిలి పెట్టలేదు. చితుగా కొట్టి వాడిని బెడ్ ఎక్కించాము దానికి తెలివి రాగానే డైవర్సుకి పెట్టిస్తాము."

పదిరోజుల్లో ఆ సంపతి నుండి వచ్చిన రావు ఊర్లో తలెత్తుకోలేక సెలవు పెట్టి వెళ్ళిపోయాడు. మిసెస్ రావు రెండు మూడు నెలలు హాస్పిటల్లో ఉంది అక్కడుండగానే డైవర్సుకి పెట్టడంతో పాటు ఆమె మీద చెయ్యి చేసుకున్నందుకు నష్ట పరిహారంగా యాభై అరవై వేలు బాకా యివ్వాలని పెట్టింది. అతను ఫేమస్ లాయరుని పెట్టుకొని అన్నదమ్ముల సహాయంతో తన ఊరినుండే కేసు నడిపించ సాగాడు. కాని న్యాయం మాత్రం అతని వేపు మొగ్గే సూచనలు కనిపించటం లేదు ఈ వార్త చిలవలు పలవలుగా అల్లి లోకల్ పేపర్లు, పత్రికలు ప్రచురించడమే కాక రావుదే తప్పని ఉద్ఘోషించటంతో అతని ఉద్యోగానికి కూడా ముప్పు వాటిల్లే స్థితి ఏర్పడింది.

ఒకరోజు చీకటి, చీకటి వేళ రావు వచ్చేడు సెలవై పోయిందిట కేసు సంగతి అడుగుతే ఏమను కుంటాడో అని ప్రశాంత్ సంశయిస్తూ౦టే అతనే ఆ విషయం ఎత్తేడు.

"నాకు స్వాతంత్ర్యం దొరికింది ప్రశాంత్ గారూ,"

"అహ. ." ప్రశాంత్ కేమనాలో తెలియ లేదు.

"నేను లక్ష్మి వేరై పోయాము.

"అరవై వేలిచ్చారా? ఆశ్చర్యంగా అడిగేడు.

"అరవై వేలా. .అహహ .. నేనంత తెలివి తక్కువవాడి ననుకున్నారా? మా లాయరు మంచి ప్లాన్ చెప్పేడు . వాళ్ళు కేసు విత్‌డ్రా చేసు కోవడమే కాక తప్పు ఆమెది కూడా ఉండటం వలన "లీగల్ సెపరేషన్ విత్ఔట్ కండిషన్" యివ్వడానికి ఒప్పించడని కాంప్రొమైజు కొచ్చారు కోర్టులో...కోర్టు వాళ్ళ కేమి. వెంటనే యిచ్చేసారు." తాపీగా చెప్పేడు కాఫీకప్పందుకుంటూ

"కాంప్రొమైజు కెలాగొచ్చారు?" అనుపమ అడిగింది.

"రాకేం చేస్తారు? తగవైన రోజు లక్ష్మి మతిస్థిమితంగా లేదని, నన్ను రక్షించుకునే ప్రయత్నంలో చెయ్యి తగలని వచ్చిందని మా లాయరు ప్రూవ్ చేస్తానన్నాడు అసలు వాళ్ళ వంశంలోనే "పిచ్చి" వుందని, ఆమెకి కూడా ట్రీట్‌మెంట్ చేయించారని డాక్టరు సర్టిఫికెట్ తెస్తే ఆమె గర్వపడుతున్న ఉద్యోగం ఊడి పోతుందని బెదిరించగానే... దెబ్బకు దెయ్యం దడిసింది. పిల్లాడిని కూడా కావాలంటేనేనుంచుకోవచ్చునన్నారు ..., పెద్దయాక తీసికో వచ్చని తల్లి దగ్గిరే వుంచాను. పెళ్ళైన కొత్తల్లో లక్ష్మి అక్కకి హిస్టీరియా వస్తే ట్రీట్‌మెంట్ చేయించారని, తనని కూడా ... ఈ విషయం లాయరుకి చెప్పగానే... పాపం లక్ష్మి మతిస్థిమితం వున్నప్పుడు చాల మంచిగా వుండేది. జీవితమంతా ఎలా గడుపుతుందో ..., ఉద్యోగం వున్నా . . మీకు చెప్పేనా, లక్ష్మికి వాళ్ళ ఊరి కాలేజీలో లెక్చరరుగా టెంపరరీ అపాయింట్‌మెంట్ దొరికింది... పర్మనెంటు పోతుందనుకోండి-కానీ... ఈ దేశంలో మొగుడు వదిలి పెట్టిన ఆడది... కామా, ఫుల్‌స్టాపులు లేకుండా చెప్పుకుపోతున్న అతన్ని చూస్తుంటే ఆ పిచ్చేదో అతనికే ఎక్కినట్లుంది.

"వదిలేసిన తరువాత పెళ్ళాం ఏమవుతే నేమి? అంత ప్రేమ ఒలికి పోతూంటే ఏలుకోలేక పోయావా?" అనడుగుదామనుకొని, ఈ మతిచలించిన వాడితో తన కెందుకని ఊరుకున్నాడు ప్రశాంత్. మరి కొంత సేపు వాగి రావు వెళ్తానంటూ లేచాడు. అతన్ని గుమ్మందాకా సాగనంపి ప్రశాంతన్నాడు, "అప్రాచ్యుడు .. డబ్బు కోసం ఎంత నీచానికి కొడిగట్టేడు? ఆమెకి పిచ్చిఅంట గడతాడా? ఆమె సంతక మెందుకు పెట్టింది? వాడితో కాపరం ఎలాగా సాగదు, అనవసరంగా ఉద్యోగం పోగొట్టుకుంటే ... ఈ రోజుల్లో డాక్టరు సర్టిఫికెట్ సంపాదించడం వీడికి కష్ట మవదనుకొని వుంటుంది".

కోపం వెళ్ళగక్కేక తీరుబాటుగా అనుపమ వేపు చూసాడు. రావు మాటలు తనకే షాకింగ్ ఉంటే...ఆమె మొహం వెల్ల వేసిన తెల్లగోడలాగుంది. నెలలు నిండుతూంటే కొత్త కళతో ప్రకాశిస్తున్న ఆమె ఒక్కసారి కళా విహీనంగా కనిపించినా, డిన్నరప్పుడు సీరియస్‌గా ఉన్నా గదిలో కొచ్చేక కూడా మాట్లాడకుండా మంచ మెక్కినా మర్నాటి లెక్చరు

కవితకి కార్టూన్ :



"శూన్యలోకముదాటి శుష్కదేహము దాటి
యన్యోన్య నిబిడ నిత్యాశ్లేష కాంక్షతో
ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా!"

— ... కృష్ణశాస్త్రి

ప్రిపేరు చేసుకోవాలన్న తొందరలో పట్టించుకోలేదు.

"మీరింత డ్రామా చెయ్యరు కదండీ!" ఆమె ఉన్నట్టుండి అనగ్గానే అర్థం కాక చూసాడు. "మీకు వేరవుదా మనిపించి నప్పుడు నాకు ముందుగా చెప్పండి. నేను రాసిచ్చేస్తాను... పెళ్ళికి ముందే మెంటల్లీ అప్‌సెట్" అని... ఏమంటున్నావు, అనూ?"

"మీకు ఎప్పుడు డైవోర్సు కావాలంటే అప్పుడు నా "కన్‌సెంట్" తీసికోవచ్చంటున్నాను.కోర్టు కెళ్ళక్కరలేకుండా...వకీలుఖర్చు లేకుండా...," ఆమె గొంతుక బొంగురు పోయింది.

"అనూ, నీకేమైంది? నేను డైవర్సు కోరడమేమిటి? సరదా కంటున్నావో, లేక నేనుతప్పు వింటున్నానో"

"కాని ఒక్క రిక్వెస్టు...బాబుని మాత్రం నాకివ్వండి...అదీ మీ కిష్టమైతే...మీకు పిల్లలు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే..."

"అనూ, తెలివుండే అంటున్నావా? నువ్వు

ప్రజా సేవలో...



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

- ✻ నిజమైన ప్రజల ప్రభుత్వం
- ✻ స్వచ్ఛమైన సమర్థవంతమైన పరిపాలన
- ✻ ఏ స్థాయిలోనూ అవినీతికి ఆస్కారం ఉండదు
- ✻ రైతులకు, పారిశ్రామిక కార్మికులకు న్యాయం
- ✻ బలహీన వర్గాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత

ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఫలవంతమైన, సత్వర ఫలితాలు ఇచ్చే, పనిచేసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బహుముఖ కృషిని ప్రారంభించింది.

అవినీతిపై పోరాటం

ఉన్నత పదవులలో ఉన్న ప్రజానాయకులపై వచ్చే ఆరోపణలను విచారించడానికి లోక్ ఆయుక్త, ఉపలోకాయుక్తలను ఏర్పాటుచేస్తారు. ఇందుకోసం వచ్చే రాష్ట్ర శాసనసభ సమావేశంలో ఒక శాసనాన్ని ప్రవేశపెడతారు. అవినీతిని కనుగొనడానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తారు.

ఉజ్జ్వల భవిష్యత్తులోకి

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని, సంజయ్‌గాంధీ ఐదు సూత్రాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అత్యంత వేగంగా అమలు జరపడానికి వీలుగా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తారు.

బలహీన వర్గాలకు చేయూత

ఒక సంవత్సరానికి పైగా ప్రభుత్వ భూములలో ఉన్న గుడిసె వాసులను తొలగించరు. ఈ భూములు ప్రభుత్వ ఉపయోగానికి అవసరమైన పక్షంలో ప్రత్యామ్నాయ వసతి కల్పిస్తారు. ప్రతి కార్మికుడు ఉద్యోగ విరమణ చేయగానే ఒక స్వంత ఇల్లు పొందే విధంగా తోడ్పడడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

ఆపదలో వున్నవారికి సహాయం

కరువు నివారణ సహాయక చర్యల నిమిత్తం రు. 7.6 కోట్ల మొత్తాన్ని మంజూరు చేశారు. శ్రీకాకుళ జిల్లాలోని వరద బాధిత ప్రజలకు సహాయం అందజేయడానికి వీలుగా రు 16 కోట్లు కేంద్ర సహాయాన్ని కోరారు

ధరల అదుపు

ధరల పరిస్థితిని సునిశితంగా పరిశీలిస్తూ పరిస్థితిని వినియోగించుకుని వ్యాపారస్తులుగానీ, హోటళ్ల వారుగానీ పేద ప్రజలను, మధ్యతరగతి ప్రజలను దోపిడీ చేయకుండా చర్యలు తీసుకుంటాము.

ఆంధ్రప్రదేశ్ మహత్తర విజయాల సాధనకు కొత్త శకంలో అడుగుపెడుతోంది. ప్రజలు ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తువైపు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ రజతోత్సవ సంవత్సరంలో అడుగిడుతోంది.

సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

నేను వేరవక మేమిటి? నేనింకో పెళ్ళి చేసుకోడమేమిటి? నువ్వు పక్కనె టుగా యిక్కడ చోటు చేసుకొనుంటే..," అంటూ ఆమెని హృదయాని కద్దుకున్నాడు.

"అది కాదండీ...," తల అతని గుండెల గుండెల మీద వాల్చి ఏదేదో అంది. ఓదార్చిన కొద్దీ ఆమె దుఃఖం ఎక్కువవుతూంటే అతనికేం చెయ్యాలో పాలు పోలేదు. ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి, అలాగే కళ్లు మూసింది. అతనే మాత్రం కదిలినా ,చంటి పిల్లలాగ కరుచుకుపోయి, "నన్ను దూరం చెయ్యకండి." అనో, "బాబుని నాకువదిలేస్తారుకదూ. "అనో అంటున్నది. డాక్టరు దగ్గిర కెళ్ళాలేమో ..పసిపాటు లేకుండా ఈ రావొకడు...తనమీదామెకి ఆ మాత్రం నమ్మంలెక లేదా?

○ ○ ○ ○

"అనూ, నా మీదింకా నమ్మకం లేదా ?"

ప్రశాంత్ ఆమె ముంగురులు సవరిస్తూ అన్నాడు గాని ఆమె వినే స్థితిలో లేదు. అతని గుండెల మీద తలపెట్టుకొని సగం నిద్రలో వుంది. ఏ మాత్రం కదిలినా.... ఆ రావు గాడు వచ్చి వెళ్ళిన్నాటి నుండి యిదే వరుస. హఠాత్తుగా ఆమెకి "షాక్" రావడానికి కారణం తెలుసుకున్న డాక్టరు శర్మ, మిసెస్ శర్మ ఒక్కటే అన్నారు. "ఇప్పట్లో ఆమెకి స్ట్రాంగ్ మెడిసన్స్ యివ్వడానికి వీల్లేదు, ఫోర్స్‌డ్ డెలివరీ చేస్తే కూడా బిడ్డకు హాని కలుగ వచ్చును. దానినామె అసలు తట్టుకోలేక పోవచ్చును. మరొక పది హేను, యిరవై రోజులైతే...."

"ఇరవై రోజులా ... మూడు రోజులే యుగాల్లాగ".

"తప్పదు ప్రశాంత్... అప్పుడు కూడా బిడ్డ బతికే ఛాన్స్ ..."

ఆమెని, వాళ్ళ వాళ్ళింటికి పంపిద్దామనుకున్నాడు గాని తను దగ్గరగా వుండటం చాల ముఖ్యమని డాక్టరు శర్మ మరీమరీ చెప్పడంతో అత్తగారిని తీసుకొచ్చాడు తనెంత ప్రయత్నించినా ఆవేదన ఎక్కువవుతున్నాదేని.... శర్మన్నట్టు యిది తన ఓర్పుకి పరీక్షలా— గుంది ... "ప్రశాంత్ నువ్వెంత ప్రశాంత మూర్తివో చూపించాలి". అతని మాటలు రింగుమన్నాయి ... పదిహేను రోజులైంది కంటి మీద కునుకొచ్చి ... ఇంకా ఎన్నాళ్ళో? రేపు శర్మని కలిసి బిడ్డకైనా ఫరవాలేదు, తల్లి బతుకుతుందంటే తనకు కావలసింది అనుపమ గాని ... ఆమె నుదుటి మీద పెదవులతో స్పృశించి, మొదటి సారి ఆమెని చూడటం గుర్తుకు రావడంతో గత లోకి జారుకొన్నాడు.

○ ○ ○

ఆ యిట్లో దిగిన రోజు, సామానంతా సర్దుకొని సాయంత్రం తీరికగా వీధి వాకిట్లో తిరుగుతూంటే ఎదుటి వరసలో నాలుగిళ్ళవతల గేటు దగ్గిరమ్మాయి తననే చూస్తున్నట్టనిపించింది భ్రమేమో అనుకుంటే వెనక్కి తిరిగి చూసి నవ్వుకుంటూ వెళ్ళి పోయింది. మూడు పదులైనా నిండకుండా రాలిపోతున్న తన వెంట్రుకలను చూసి నవ్వొందనుకొని పట్టించుకో దలుచుకోలేదు. కాని వారమంతా యిలాగే జరుగుతుంటే సంగతేమిటో తేల్చుకుందామని ఆదివారం వాళ్ళింటికి కెళ్ళేడు. తనని పోల్చుకోనేలేదు. అసలు చూసినట్లే గుర్తు లేదండి. మాటల్లో ఆమె "అరుణ్" అనే అబ్బాయికోసం చూస్తుందని, తనకోసం కాదని తెలిసింది. ఒక మగవాడి కంతకంటే ఇన్సల్టింకేముంటుంది? అయితే ఆ అరుణ్ అందమైన ఆరడుగుల అబ్బాయికాదని, అయిదేళ్ళ అల్లరి వాడని తెలుసుకున్నాక సర్దుకున్నాడు.

ఆమె మొదటిరోజే తననాకట్టుకుంది. స్నేహమయాక ఆకర్షణ ఆరాధనలోకి మారడానికెక్కువ రోజులు పట్టలేదు. ఆమెతో మాట్లాడుతూంటే గంటలు క్షణాల్లాగ గడిచిపోయేవి ఆమెని పొందే వాడ దృష్టవంతుడవుతాడని పించేది. ఆ అదృష్టవంతుడు తనే ఎందుకు కాకూడదు? తనకామెకి తగిన సామాన్యార్హతలు—యూనివర్సిటీలో మంచి ఉద్యోగం, బోలెడన్ని ఆశయాలు, కొంచెం ఆస్తి, బట్టతల మినహాయిస్తే చూడదగ్గ రూపు.. కాని ఆమెతో ఈ విషయం కదపడమెలా? సంగీతమైనా, సాహిత్యమైనా. పెయింటింగైనా, పామిస్ట్రీ అయినా గంటల కొద్దీ చర్చిస్తుంది కాని ప్రేమ, పెళ్ళి టాపిక్ వస్తే మాత్రం నేర్పుగా తప్పించేస్తుంది. ఈ విముఖతకి కారణం వెతుకుతూంటే...

ఆ రోజు..ఇంట్లో ఎక్కడా సందడి లేకపోతే తిన్నగా పెరట్లో కెళ్లాడు. అనుపమ తోటలో కూర్చొని ఏదో రాసుకుంటున్నది. తనకోసమే అన్నట్టు వేసి ఉంచిన కుర్చీలాక్కొని కూర్చున్నాడు. ఈ మధ్య తరచు రావడంతో తను ఆ యింటి మనిషిలాగై పోయాడు. అందుకే తనకోసం కెటిల్‌లో టీ రెడీగా ఉంది....ఆమె కూడా తాగినట్లు లేదు. అమ్మ, నాన్నగారు మార్కెట్ కెళ్ళారుట. టీ రెండు కప్పుల్లో పోసి, ఒకటామె కందించి, ఒకటి తీసుకుని టేబిలు మీదున్న వీక్లీ పేజీలు తిప్పసాగాడు. ఆమెందుకో అన్యమనస్కంగా ఉందని పించింది టీ కప్పు ఖాళీ చేసేసి తన రాతలో నిమగ్నమైపోయింది. తనదృష్టి చేతిలోని మేగజైను నుండి ఆమెవేపు మళ్ళింది.


అస్తమిస్తున్న సూర్యుడి కాంతిలో అందంగాకనిపిస్తున్నది. దబ్బపండురంగు చీర, అదే రంగు జాకెట్టు, తలంటు కొని, జడవదులుగావేసుకుందేమో, నుదుటి మీద నాట్యం చేస్తున్న నల్లని కురులు, గుండ్రంగా తీర్చిదిద్దిన ఎర్రని బొట్టు.. తన కంటి కామె అందమైన ప్రకృతి వాడితో తలదాచుకున్న ప్రకృతి కన్యలాగుంది. కొంచెం రంగు తక్కువైనా. మిలమిల మెరిసే కళ్ళు, పెదవులపై చిరవాసం చేసుకొన్న చిరుదరహాసం...తన అవలోకనాగి పోయింది. ఆ అందమైన చిరునవ్వు అతికించినట్లు ఆర్టిఫిషియల్‌గా...మనస్సులో పొంగుతున్న భావోద్రేకాన్ని పెదవులు దాటనివ్వని చెలియలి కట్టలాగ ..ఆమె తలెత్తింది.

"సీరియస్‌గా వ్రాస్తున్నారు, క్లాసు నోట్సా, కవిత్వమా ?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగేడు.

"ఏదనుకుంటే అదే", కాగితాలందించింది

ఇంగ్లీషులో నోట్సు, కింద, మీద మార్జిన్‌లో తెలుగులో ఏమిటేమిటో వుంది. ఆమె కాగితాల మీద తరచు యిలాంటివి కని

కవితకి కార్టూన్ :



న-న-న-న త్తి మాటలు కూడా
మ-మ-మ-మన కవిత్వంలో ఉండొచ్చు !!

— శ్రీశ్రీ

పిస్తూ వుంటాయి. "దేనికేనా పంపిచకూడదా" అంటే నవ్వి, "ఊసుపోక వ్రాసినవండీ" అంటుంది.

"దూరంగా రెండు మోడువారిన వృక్షాలు, ప్రకృతి మలచిన శిల్పాల్లాగ ... చెట్లు మోడు వారినవే ఎందుకవాలి? మిమ్మలొక విషయం అడగాలనుకుంటున్నాను, మీరేమి అనుకోకపోతే".

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరెప్పుడూ విషాద భరితమైన కవిత్వం లేక ప్రకృతి వర్ణన ... అదీ పెసిమిస్టిక్‌గానే .. ఎందుకు వ్రాస్తారు?"

"నేను 'బోర్న్ పెసిమిస్ట్‌ని' ..." వెంటనే వచ్చిన జవాబుని ఆపేసి తన వేపు చూసి తను వినలేదని తృప్తిపడి మాట మార్చింది. "కవిత్వం విషాదంతో కూడినప్పుడే సహజంగా, అందంగా వస్తుందని పెద్ద పెద్ద కవులన్నారు ... వాళ్ళ అడుగు జాడల్లో..."

"ప్రసిద్ధ కవుల అడుగు జాడల్లో నడవడానికి జీవితమంతా వుంది. ఇప్పటి నుండే యీ ఉదాసీనత ... మీ జీవితం కానట్లు ... మీ శరీరం కానట్లు ... ప్రపంచంతో మీకు

సంబంధంలేనట్లు . . ఈ వైరాగ్యం . . ".

"నాకు వైరాగ్యమేమిటి? చుట్టూ వున్న వాళ్ళని ద్వేషించుకోక పోవడమేమిటి?" విరగబడి నవ్వుతూ అంది. కాని ఆమె నవ్వు మాత్రం అసహజంగా వినిపించింది

"మరైతే వివాహమంటే విముఖతెందుకు చూపిస్తారు?".

"అలాగని ఎవరు చెప్పారు?" మొహంలో మారిన రంగులు కనిపించకుండా ప్రయత్నించింది.

"ఒకరు చెప్పాలేమిటి? పరిచయమైనప్పటి నుండి చూస్తున్నాను, అన్ని విషయాలు అరమరికలంగా చర్చించే మీరు పెళ్ళి మాటెత్తగానే ....".

"ప్రశాంత్, నా స్వవిషయాలలో ఎందుకు జోక్యం కలుగ జేసుకుంటున్నారు?" ఆమె గొంతుక తీవ్రంగా వచ్చింది.

"ఎందుకంటే ... , అతను తడబడ్డాడు. మొహం మీద, తల మీద పట్టిన చెమటను రుమాలుతో ఒత్తుకుంటూ మెల్లిగా అన్నాడు, "నేను నీ వ్యక్తిత్వానికి ఆకర్షించబడ్డాను... నిన్ను నేను ... అనూ ... నిన్ను నేను ... ప్రేమిస్తున్నాను, అనూ".

నత్తి నత్తిగా వచ్చిన తనమాటలు, ఏకవచన సంబోధన తనకే అదోలాగనిపించింది .. ఆమె ముందు చూపిన కోపం కాదుగదా కనీసం ఆశ్చర్యమైనా కనబడలేదు. ఆమెలో ఎప్పటికీ చలనం లేక పోయేసరికి ధైర్యం చేసి అన్నాడు, "నేనంటే నువ్వుకూడా ఒక అభిప్రాయ మేర్పరచుకునుంటావు. నేను తగినవాడిననిపిస్తే పెద్దలతో చెప్పి...."

"నాకు పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేదు. జీవితమంతా స్వేచ్ఛగా గడిపేయాలనుంది. మనిషికి పెళ్ళొక్కటే ముఖ్యం కాదు...అసలు నాకే బంధంలో చిక్కుకోడం యిష్టంలేదు." ఆమె మాటలు ఇన్‌కొహెరెంట్‌గా వచ్చాయి గాని చాలా దృఢంగా ఉన్నాయి. ఈ అనుకోని జవాబు వచ్చేసరికి సమాధానం కోసం తడుముకోవలసి వచ్చింది.

"మనిషికి పెళ్ళొక్కటే ముఖ్యం కాకపోయినా అది కూడా ముఖ్యమే. వివాహం ఒక పవిత్ర బంధం. అదిటు ఆడవారి స్వాతంత్ర్యానికి అడ్డుకాదు, అటు మగవారి స్వేచ్ఛకి ప్రతిబంధం కాదు. నేను కాకపోతే మరొకరు .. మీకు నచ్చిన వ్యక్తిని..." మనస్సులోని అనుమానం మాటల్లో వ్యక్తమైపోయింది. ఆమె స్నేహాన్ని తను తప్పుగా అర్థం చేసుకున్నాడా? తను తొందర పడ్డాడా? తనామెకి నచ్చుతాడనెందుకనుకున్నాడు? తన... అలవాటు ప్రకారం తల మీదికి చెయ్యి వెళ్ళి మనస్సు మలినమైంది.

"మీరు చెప్పినవన్నీ నిజమేనని నేను ఒప్పుకుంటాను, కాని.. నాకు వివాహం యిష్టంలేదన్నాను గాని.. మీరు నచ్చలేదని..."

"ప్రాముఖ్యత తెలుసంటూ వివాహం వద్దంటున్నారంటే .... ప్రేమలో ఓడిపోయారా? విరహగీతాలు వ్రాసే మీరు నేను అనుమానించినట్లు భగ్న ప్రేమికులా? లేకపోతే తీరికూర్చుని అందమైన ఆడపిల ...జీవితంలో ఎంతో మంది కలుస్తారు, ఎన్నోరకాల పరిస్థితు లెదురవుతాయి...కొన్ని సంఘటనలతో విరక్తి పుట్టవచ్చును. అలాగని గతాన్ని తలుచుకుంటూ బాధ పడుతూ భవిష్యత్తుని పాడు చేసుకుంటారా?" ఒకమాదిరి తెక్చరిచ్చి ఆమెను చూసాడు.

"మీతో నేనూ ఏకీభవిస్తానండి...గతాన్ని తలుచుకుంటూ బాధ పడటం వ్యర్థమని...కాని .. భగ్నమవడానికి నేనిప్పటికి వరకు ఎవరినీ ప్రేమించ లేదండి. "నవ్వుతూ తేలికగా అన్న తరవాత కొంత సేపు మౌనంగా ఉండి, తాపీగా మళ్ళీ అంది." మీ సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు యింతే. పిడుక్కీ బియ్యానికి ఒకటే...ప్రతీహ్యూమన్ ఏక్టివిటీని.. డాక్టరూ అంతే... నా నెర్వస్ బ్రేక్‌డౌన్‌కి కారణం... అమ్మా వాళ్ళకి కూడా చెప్పినట్టున్నాడు.... "నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పు తల్లీ," అని అడుగుతూంటారు."

"నెర్వస్ బ్రేక్‌డౌనే..కాదు. కాదు. ఎక్జాక్ట్‌గా చెప్పాలంటే మెంటల్ అప్‌సెట్....ఈ ఊరు రావడానికి ముందు...అందుకే చదువు

డిస్‌కంటిన్యూ చెయ్యవలసి వచ్చింది. లేకపోతే నాన్నగారు రెండేళ్ళ ఎక్స్‌టెన్షన్ తీసుకొని అక్కడే ..ఆయనకి నేను లాయరు కావాలని ఎంత కోరికుండేదంటే...మగ పిల్లలు లేని లోటు నేను తీర్చాలనేవారు. కాని... మెంటల్ డిప్రెషన్ తగ్గటం కోసం నాకి ఊర్లో సైకియాట్రిక్ ట్రీట్‌మెంటు కూడా చేయించారు. నా ఉదాసీనతకి కారణం..."

డాక్టరు వివాహం చేసుకో వద్దన్నాడా?

"లేదు ..వివాహం జరుగుతే నాలో పూర్వపు చలాకీతనం రావచ్చునన్న అభిప్రాయం కూడా వ్యక్తం చేసేడు. కాని నాకే యిష్టంలేదు. తరువాతేమైనా జరిగితే తట్టుకోలేనేమో.. అవివాహితగా నిష్కళంకంగా ఉండటమే మేలని ఈ విషయమంతా చెప్పి చేసుకుంటానంటే మా వాళ్ళే కాక డాక్టరు కూడా...అనవసరంగా మరొక వ్యక్తిని బాధించడం నాకిష్టంలేదు. ఇప్పుడు నాకేమిటి తక్కువ. మళ్ళీ చదవటానికికూడా ప్రయత్నిస్తున్నాను. ఈ చదువుతో జీవనోపాధి దొరక్కపోదు "కొంచెమాగి వినీవినిపించకుండా అంది. "నా చుట్టూ ఏర్పరచుకున్న పరిధిని చీల్చుకుంటూ ముందు అరుణ్ చేరికయ్యాడు. ఇప్పుడు వద్దన్నా మీరు దగ్గిర."

"దగిరయాను. నన్ను వద్దనడానికి దొక్కటే అభ్యంతరమా లేక....,"తల మీదికి చెయ్యి పోనిచ్చాడు.


తన ఉద్దేశం గ్రహించి ఆమె మెల్లిగా అంది. "మీరు ఆలోచించకుండా నిర్ణయం తీసుకుంటున్నారు."

తను ఆమె దగ్గిరగా వెళ్ళి భుజాల మీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తూ అన్నాడు. "ఆలోచించడానికేముంది? ఇంత నిర్మలమైన మనస్సున్న ఈ అను...పమను నా దాన్ని చేసుకోడానికి...మరొక వ్యక్తిని బాధ పెట్టకూడదనుకొని తన స్వార్థాన్ని చూసుకోని వాళ్ళీ ప్రపంచంలో ఎంతమందుంటారు?"

అప్పుడే వీచిన గాలికి ఎగిరిపోయిన కాగితాలని పట్టుకునే నెపంతో తన చేతులు విడిపించుకుంటూ ఆమె లేచింది. మరి నిగ్రహించుకోలేని తను బాహువుల్లో బంధించి అన్నాడు. "ఇది నీ స్వేచ్ఛకి బంధం కాదు సుమా". తన కౌగిలిలో కిమిడిపోయిన ఆమె, "నా మీద జాలిపడి ...", అంటూంటే పెదవులతో మూసేశాడు.


ఆ మాఘ మాసంలోనే మూడు ముళ్ళు వేసి, యూనివర్శిటీకి దగ్గరలో దొరికిన యీ ఇంటికి తీసికొచ్చాడు. అయితే పెళ్ళికి ముందే ఆమెని ట్రీట్ చేసిన డాక్టరుని కలిశాడని, తరువాత తన ప్రాణ స్నేహితులు, డాక్టర్లు అయిన శర్మని, అతని భార్యని కనిసల్టు చేశాడని ఆమెకి చెప్పనవసరం రాలేదు. డాక్టర్ శర్మ గవర్నమెంటు హాస్పిటల్లో సైకియాట్రిస్టు... గైనకాలజిస్టయిన మిసెస శర్మ పేరుతో నర్సింగ్ హోం నడుపుతున్నది. వాళ్ళిద్దరూ తన నిర్ణయాన్ని మెచ్చుకుంటూ ఏవేవో చెప్పారు. ప్రతి చిన్న జబ్బుని సైకలాజికల్ బేసిస్ మీద ట్రీట్ చేస్తున్న యీ రోజుల్లో కూడా మన వాళ్ళు సైకో ఎనలటికల్ ట్రీట్‌మెంట్స్‌ని అర్థం చేసుకోలేక పోతున్నారని, పై దేశాల్లో దగ్గుకి, జలుబుకి ఫీజీ

కవితకి కార్టూన్:



నువ్వు ఉత్తర ధ్రువంలో విరిసిన అరోరా బొరియాలిస్‌వి!
నేను దక్షిణ ధ్రువ తీరాన నిలిచిన పెలికన్ పక్షిని !!
— తిలక్

కవితకి కార్టూన్ :



నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు!
నా యిచ్ఛయే గాక నాకేటి వెఱపు?

— కృష్ణశాస్త్రి

షియన్ దగ్గిర కెళ్ళినట్లే సైకియాట్రిస్టుని కన్సల్టు చేస్తారని, అనుపమ లాంటి వాళ్ళు తెలిసి కూడా అనవసరంగా బాధపడి మరి కొంత డిప్రెసెస్ అవుతున్నారని ...

శర్మ అంటున్నాడు, చెయ్యినందించిన వాడివి చేయూత సరిగ్గా యివ్వాలి సుమా, ప్రశాంత్. ఆమె చాల సెన్సిటివ్ అని తెలుసును కనుక జాగ్రత్తగా చూసుకోవాలి. విష్‌యూ ఆల్ ద బెస్టు ... అన్నట్టు మా నర్సింగ్‌హోంకి వచ్చే అవసరం తొందరగా రావాలని విష్ చెయ్యమన్నావా లేక ...," అన్న మాటలు నవ్వుల్లో కలిసి పోయాయి.

అనుపమ తను రావులాగ, మూర్ఖంగా ప్రవర్తిస్తాడనెందు కనుకుంది? మూడున్నరేళ్ళ సాంగత్యం తరువాత కూడా తనామెనెంత ప్రేమిస్తున్నాడో ఆమెకి తెలియదా? శర్మ వాళ్ళ నర్సింగ్ హోంలోకి, వాళ్ళు ఫేమిలీ ఫ్రెండ్స్ కాబట్టి తీసి కెళ్ళాడు. కాని సైకియాట్రిస్టుగా శర్మ సలహా తీసికోవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఎందుకనుకుంటాడు? ఆమెదింక మెంటల్ కేసని తను మరిచిపోయాడు! పక్కవాటాలోని రావు యంత హంగామా చేస్తాడని తన కేం తెలుసు? తన ఎదురుగానే పెళ్ళి, ఏడాది తిరక్కుండా పిల్లాడు .... కోర్టు కెక్కడం .... అన్యాయంగా ....

అనుపమ బాధతో మూలుగుతూంటే ఆలోచనల నుండి తేరుకొని, "ఏమైంది అనూ?" గాభరాగా అడిగేడు ఆమె కొంచెం బాధతో చుట్టుకు పోయేసరికి పరిస్థితి అర్థమైంది. దేవరీ నేచురల్‌గా అయితే ప్రమాదముందన్నారు గాని ... ఇంతగా ఎప్పుడూ నెర్వస్‌పడలేదు

o o o

"జూనియరేమంటున్నాడు?"

"నాన్నగారి కోసం ఎదురు చూసి చూసి పడుకున్నాడు".

"పడుకున్నాడన్నావు లేచి వుంటే", పడుకున్న వాడిని లేపి మరీ ఎత్తుకుని అనుపమ దగ్గిరగా వచ్చి అన్నాడు, "ఇంతకి వీడు వెయిట్ చేసేడా, వీడి అమ్మా?".

"ఇద్దరూ ..."

"అందుకే నేను ఆఘమేఘాల మీద వచ్చేను, డెలివరీ ....".

"అవును, అందుకే ఆఘమేఘాల మీద వచ్చేను, ఆరురన్నర కి", అతన్ననుకరిస్తూ అంది.

"అప్పుడే ఆరున్నరైందా? అయితే లేలే .... పోనీ పనిష్‌మెంట్‌గా ఒక కప్పు వేడి కాఫీ ..." అతని మాటలు పసివాడి ఏడుపులో కలిసిపోయాయి.

"ఆ టీ, కాఫీ లేవో మీరే చేసుకోండి. వాడిని ఊరుకోబెట్టుకొనే సరికి .... తీరి కూర్చొని లేపేశారు ...", బాబుని అందుకొంటూ అంది, "నేనొక విషయం చెప్పాలి".

"ఏమిటో?" అన్నాడు తల్లి ఒళ్ళోకెళ్ళగానే నోరు మూసిన బాబు బుగ్గగిల్లి ఏడిపిస్తూ.

"మళ్ళీ ఏడిపిస్తున్నారు ... ఈ సారి మీ మీద వదిలేస్తే...."

"నువ్వేదో చెబ్దామనుకున్నావు", ఆమె మాటలు విననట్లు బాబు బుగ్గలతో ఆడుకుంటూ అన్నాడు.

"ఎయిత్ వండర్ ... పక్కింటి రావు గారు, భార్య కాంప్రమైజు చేసికొని మళ్ళీ కలిసి వుండటానికి నిశ్చయించుకున్నారట. మధ్యాహ్నం ఆవిడనూ, పిల్లాడినీ తీసికొచ్చేడు. ఇంక మీరు వీడినందుకుంటే కాఫీ తెస్తాడు".

"థేంక్ గాడ్ ... కాఫీ చేసే డ్యూటీ తప్పింది", స్వగతం కావాలనే గట్టిగా అని, కొంచెమాగి మళ్ళీ అన్నాడు, "నేనూ ఒక విషయం చెప్పాలను కున్నాను ... మనం యిల్లు మార్చేస్తున్నాము".

"ఎందుకూ?"

"ఎందుకా—," మనస్సులో అనుకున్నాడు. "పక్కింటి రావుగార్ల మొదటి కాంప్రమైజు నా తల ప్రాణం తోకకి తెచ్చింది. నిన్నూ, బాబునీ కాపాడు కుందుకి నేను పడ్డపాట్లు భగవంతుడికే ఎరుక. డాక్టర్ల సలహామీద పది హేను రోజులు నిన్ను కనిపెట్టుకు కూర్చోడం, తరువాత రెండు రోజులు నువ్వు చావు బతుకుల మధ్య ఊగిసలాడుతూంటే శర్మదగ్గిర కూర్చుని నేను పడ్డ యమ యాతన... గేటు దగ్గిర రావు ఎదురు పడి చెప్పగానే, యివన్నీ జ్ఞాపకమొచ్చి నేనీ నిర్ణయం...," మాట్లాడకుండా ఆమె వేపు చూసాడు.

"అయితే రావుని మీరప్పుడే కలిసారన్న మాట...," అంది నవ్వుతూ.

"అవును," తలూపి ఫినిషినిపించకుండా అన్నాడు, "ఈ అనుపమాదేవిగారు ట్యూబ్ లైటేనా అయితే బాగుండేది, భగవంతుడా, ఈమె నిలాంటి స్పార్క్‌లింగ్ లైటుగా ఎందుకుతయారు చేశావు? అవలిస్తే పేగులు లెక్క."

"ఏమంటున్నారు?"

"ఏం లేదు... ఈ యింటి దీపం...." అంటూ బాబుని ఒక చేత్తో ఎత్తుకొని రెండో చెయ్యి ఆమె చుట్టూ వేసాడు.

"ట్యూబ్ లైటు కాదని... నేను మంద మతిని కాలేదని బాధ పడుతున్నారా?"

ఇద్దరూ నవ్వుతూంటే మధ్య నలిగిపోతున్న బాబు ఏడుస్తానిక్క రాగం మరొక సారందుకొన్నాడు.

✻

జ్యోతి కొత్త చిరునామా

"జ్యోతి" కార్యాలయం ఇప్పుడు హైదరాబాద్‌లో పని చేయడం ప్రారంభించింది, జ్యోతితో అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలూ కింది చిరునామాతో జరుపవలసిందిగ కోరుతున్నాము,

జ్యోతి

సచిత్ర మాస పత్రిక

1-8-4/1/1, చిక్కడపల్లి

హైదరాబాద్—500020

ముఖ్య గమనిక : ఏజంట్లు డ్రాఫ్టులు, మనీయార్డర్లు కూడా ఈ కొత్త చిరునామాకే పంపాలి.

బెంగ

మినీకథ

పడాల రాములు

"ఈ దెబ్బతో సుబ్బారావు పని అయిపోతుంది" రావు అన్నాడు స్నేహితులతో.

"అయినా ఇలా లాస్ట్ మినిట్ దాకా సుబ్బారావు ఎందుకు ఊరుకున్నట్టు?" శర్మ సందేహం వెలిబుచ్చాడు.

"సుబ్బారావుకి అసలు బుద్ధి లేదురా! మరీ దేశంమీద పడి అలా అప్పులు చేసేయడమే! ముందుచూపు ఉండక్కర్లే!" మూర్తి మందలింపుగా అన్నాడు.

"ఏమోలే! ఎవరు చెప్పొచ్చారు. ఈ పాటికి ఏదో ప్లాన్ వేసే ఉంటాడు"—రెడ్డి అన్నాడు.

వీళ్ళందరూ సుబ్బారావు స్నేహితులే! సుబ్బారావుకి ఊరినిండా అప్పులున్నాయని తెలుసు.

అయితే అప్పులు అంత అర్జంటుగా తీర్చే అవసరం ఏమొచ్చిందా అని అడగొచ్చు. కరెక్ట్ – ఆ అవసరం నెత్తిమీదికొచ్చి కూర్చుంది.

సుబ్బారావు నెత్తిమీద ప్రస్తుతం అప్పుల రాక్షసి ఉంది. ఆ రాక్షసి బారినుంచి అతన్ని ఎలా తప్పించాలో అర్థం కావడంలేదు స్నేహితులకి!

సుబ్బారావుకి కాబూలీవాడు నోటీసిచ్చాడు. తన మూడు వేల అప్పు మూడ్రోజుల్లో తీర్చమని. లేకపోతే ఇల్లు తాకట్టు పెట్టుకుంటానని. ఇల్లు తాకట్టు పెడితే, వాడు భార్యాపిల్లల్తో రోడ్డుమీద ఉండాల్సిందే!

పరిస్థితి ఇలా వుండగా రెండ్రోజుల్నించీ సుబ్బారావు కనబడటంలేదు. స్నేహితులు కంగారు పడిపోసాగారు పాపం! సుబ్బారావు అప్పుకోసం ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో! ఎన్ని తిప్పలు పడుతున్నాడో! తిండీ తిప్పలు సరిగా ఉంటున్నాయో లేదో! ఇంక నిద్ర మాత్రం ఎలా పడుతుంది?—అని ఆందోళన పడుతున్నారు.

ఇంతలో సుబ్బారావు సడెన్‌గా సైకిలేసుకుని వాళ్ళ ముందు వాలాడు.

"ఏం గురువులూ! ఎలా ఉన్నారు?" అన్నాడు హుషారుగా ఈలవేస్తూ.

మిత్రబృందం విస్తుబోయింది.

వాడి మొహంలో ఏ కోశానా బాధ అనేది కన్పట్టం లేదు. వాడేదో నిద్రాహారాలు మానేసి, నీరసంగా ఉంటాడనుకున్నవాళ్ళు వాడంత హుషారుగా ఉండటం చూసి ఆశ్చర్యపోయారు.

"ఏం గురూ! సరిగా నిద్ర పోతున్నావా?" అడిగాడు శర్మ.

"బ్రహ్మాండంగా!"

"అన్నం తింటున్నావా?"—రావు.

"శుబ్బరంగా!"

"అది కాదురా! నీకసలు నిద్ర ఎలా పడుతోందిరా?"

"ఏం?"

"అన్నమెలా సయిస్తోందిరా?"

"ఎందుకు సయించదూ?"

"అదేమిట్రా అలా అడుగుతునావు? కాబూలీవాడి అప్పు తీర్చాల్సింది రేపే కదరా!"

"అయితే?"

"ఇల్లు తాకట్టు పెట్టుకుంటానన్నాడుగా. ఏం చేస్తావు?"

"వోహ్! అదట్రా మీ బెంగ! కాబూలీవాడు నన్నేమీ చేయలేడు."

"ఎందుకని?"

"నన్నేదన్నా చేస్తే నష్టపోయేది వాడే! వాడి అప్పు తీరదు. అందుకని – ఏదైనా దిగులుంటే వాడికుండాలి. నాకెందుకు? నిద్రాహారాలు మానేసి ఇచ్చిన అప్పు ఎలా రాబట్టుకోవాలా అని ఆలోచించాల్సింది వాడు నాకేం! నిక్షేపంలా ఉన్నాను" అన్నాడు సుబ్బారావు శర్మ భుజం చరుస్తూ.

"హోరి! వీడి ధైర్యం తగలెయ్యా!" అని స్వీట్‌గా తిట్టుకున్నారు, స్నేహితులు సుబ్బారావుని.

రెండ్రోజుల తరువాత—

ఓ ఫైన్ మార్నింగ్ ఊరంతటా ఓ వార్త అగ్గిలా పాకింది.

"కాబూలీవాడు చచ్చిపోయాడు." ✻

ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

31 సీరియల్

నాగమ్మ ఇల్లు పెద్దదిగానే వుంది. అది ముందు ఒకయిల్లు వెనక ఒకయిల్లుగా వుంది. మధ్యలో నున్న వరండా యీ రెండు యిళ్ళనీ కలుపుతోంది. ముందు యింట్లో హాలులో బల్లల మీద వేరుశనగకాయ బస్తాలు వేసి వున్నాయి. పలుపులు, తాళ్ళు దానా బుట్టలు, నీళ్ళుతోడుకునే బకెట్ మొదలయినవివున్నాయి. వెనక వైపు వున్న యింట్లో వంట గది గాక వేరే రెండు గదులు వున్నాయి. ఒక గదిలో రెండు మంచాలు వున్నాయి. పిల్లలంతా క్రిందనే పడుకుంటారుట.

నాగమ్మని చూడగానే, పాలేరు పరుగెత్తుకువచ్చి నాగమ్మ చేతిలో సంచీ తీసుకున్నాడు.

"ఇదుగో ఆ మూటలో, కొత్త చాంతాడు, కొత్త పలుపూ వున్నాయి." అంది.

"ఎప్పుడు బైలుదేరావే!" నడుం వంగిన ఒక ముసలామె వచ్చింది.

"ఎప్పుడు బైలుదేరాను. రాత్రి ఎనిమిది గంటలకి! మనవూరి రైలు ఎప్పుడు వస్తుందేమిటి!" అంది నాగమ్మ విసుగ్గా.

నాగమ్మ యింట్లో అడుగు పెట్టూనే చెంగుదోపి పనిలోకి దిగింది.

"ఈ అమ్మాయి ఎవరే నాగూ!" కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని చూస్తూ అడిగింది రాజమ్మ.

మా బాబాయికూతురు బొంబాయిలోలేదూ? ఆయన కూతురు. సవతితల్లి చూడడం లేదని పారిపోయివచ్చింది. పెళ్ళికాలేదు. అందుకని, నాతో తీసుకు వచ్చాను. చదువు కొంది. పిల్లలకి చదువైనా చెబుతుంది. నాగమ్మ వణుకు పుణుకు లేకుండా అంది.

స్వప్న అక్కడ వరండాలో నిలబడి ఆ పరిసరాలు గమనిస్తోంది. దూరంగా జొన్న చేలు కన్పిస్తున్నాయి; వూరికి లైట్లున్నాయి. పిల్లలు బావి తగ్గర చేంతాడుతో నీళ్ళు తోడి స్నానాలు చేస్తున్నారు. నాగమ్మ కాఫీ కలిపి తీసుకువచ్చింది. 'చూడు. నీపేరు ఏమిటన్నావు-' అంది అలాగ.

"స్వప్న."

"అదేమో నబ్బా. నాకు ఆ పేరు నోరు తిరగదు. నిన్ను బుజ్జీ అని పిలుస్తాను. ఇదిగో, కాఫీ" నాకు అంత బాగా కలపడం రాదు. మా ఆయన ఎప్పుడూ తిట్టేవాడు. ఇప్పటికి యిది తాగి, తర్వాత నువ్వు వంటింట్లోకి వచ్చి కలుపుకో. ఇదుగో; ఒక మాట; పదిసార్లు చెప్పాలంటే నాకు విసుగు. ఈ యింట్లో మగాళ్ళెవరూ లేరు నువ్వు బిడియం లేకుండా మాతో కలిసిపోతే బాగుంటుంది. నాలుగు రోజులు చూస్తాను. నువ్వు యిలాగే, నిలబడ్డావా రైలెక్కిస్తాను." నాగమ్మ అలా అంటూనే దూరంగా చూసి "వారేయ్ సత్తిగా; ఎక్కడ రావువ్వు మూట విప్పకుండా ఎక్కడ చచ్చావురా" అంటూ అరిచింది.

స్వప్న కాఫీ తాగుతూ నాగమ్మనే చూస్తోంది. నాగమ్మ నెత్తిమీద, యీ యింటి భారం అంతా వుందని, వచ్చిన ఆ కొద్ది క్షణాల్లోనే స్వప్నకి అర్థమైంది.

నాగమ్మ అటుబైట పాడిపని, యిటు యింట్లో వంటపనీ అవలీలగా చేసేస్తుంది.

స్వప్నని గదిలోకి తీసు వచ్చి, పిల్లల పుస్తకాలు అన్నీ గూట్లోవి తీసి స్వప్న ముందు పడేసింది. అక్కడున్న లాంతరు తీసి బాగుచేస్తూ, "ఈ వూరికి లైట్లు పేరుకి మాత్రమే. ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు పోతాయో ఆ దేవుడు కూడా చెప్పలేడు. ఈ లాంతరు, కిరసనాయిలు, ఎప్పుడూ వుంచుకోవాల్సిందే. ఈ కిరసనాయిలు మాత్రం దొరుకుతోందేమిటి? దొంగ వెధవలు ఎక్కడలేని కరువు అంతా మా వూళ్ళోనే పుట్టించి, జనాల ప్రాణం తీసేస్తారు. మా అత్త వుందన్న మాటేగానీ, కాస్త కూడా సాయం లేదు. అన్నింటికి నేనే చావాలి, నా మొగుడు చావటం కాదుగానీ, నా ప్రాణం పోతోంది. ఆయనేమో హాయిగా పుటుక్కున చచ్చాడు; నేనేమో క్షణం క్షణం బాధలు పడలేక చస్తున్నాను." అంది.

నాగమ్మ చేయి ఒక్క నిముషం వూరుకోకుండా ఎంత పని చేస్తుందో, నోరు కూడా అంత తీవ్రంగా, ఒక్క క్షణం విశ్రాంతి లేకుండా మాట్లాడుతూనే వుంటుంది;

స్వప్న నాగమ్మ యింటికి వచ్చి వారంరోజులు అయింది; ఈ వారంరోజుల్లో


స్వప్న ఆ యింట్లో బాగానే అలవాటు అయిపోయింది. నాగమ్మ నోరు ఎంత పెద్దదయినా, భోజనం పెట్టడం మాత్రం చాలా బాగా పెడుతుంది. స్వప్న మొహమాటం పడుతుందనే అనుమానంతో, యింకా, యింకా తినమని బలవంతం చేసేది స్వప్న తినే అన్నం చూసి బుగ్గన చేయి పెట్టుకుని, అది భోజనమా? చూస్తే రెండు మెతుకులు. ఢోగిష్టి వాళ్ళు తిన్నట్టు తింటున్నావు. నీతో కలిసి కూర్చుని తినాలంటే నాకు సిగ్గేస్తోంది తినుతిను సిగ్గు పడమాకు. అంటు గద్దించేది.

స్వప్నకి పిల్లల్ని చదువుకి కూర్చో పెట్టడం ఏమంత కష్టం అనిపించలేదు. వాళ్ళకి చదువు కంటే, స్వప్న చెప్పే కథలు చాలా వుత్సాహంగా వుండేవి.

నాగమ్మ మంచి వ్యవహర్త, ఇంటికి వూరిలోని బాలరైతు కుటుంబ ఆడవాళ్ళు ఎవరో ఒకరు వస్తూనే వుంటారు. వాళ్ళ కష్ట నిష్ఠూరాలు ఓపికగా వింటుంది. ఎవరు వచ్చినా, ముందు యింట్లోకే పస్తారు లోపల భాగంలోకి ఎప్పుడు అడుగు పెట్టరు. అందువల్ల స్వప్నకి పిల్లలగది తన సొంతంలా అనిపించేది.

స్వప్న ఏదయినా పనిలో సాయం చేయబోతే, నాగమ్మ. ఏవమ్మోయ్! నిన్ను నాయింటికి తీసుకు వచ్చింది పని చేయించటానికి కాదు. నా పిల్లలకి రెండు అక్షరం ముక్కలు నేర్పటానికి. పనెందుకమ్మా తల్లీ! పని చేసుకోగలను. కావాలంటే పాలేరుతో చేయించుకో గలను. చదువు సంగతి మాకు రాదు. తోటకూర తరుగుతున్న నాగమ్మ క్షణం ఆగి, "బుజ్జమ్మా" నిజం చెప్పనా! నేను బస్తీ వెళ్ళినప్పుడల్లా, స్కూళ్ళకి వెళ్ళే పిల్లల్ని చూస్తుంటే ఏడుపు వస్తుండే. నా పిల్లలు ఎప్పటికైనా యిలా చదువుకుంటారా? వాళ్ళకి కుదురు వస్తుందా అనిపిస్తుంది, అదరూ బస్తీ వెళ్ళి కాపురం పెట్టమంటారు. నేను బస్తీపోతే యిక్కడ వ్యవసాయం, గొడ్డుగోద ఏమయిపోతాయి. నాకు తబ్బు ఎవరిస్తారు. మన పిల్లలకి చదువు చెప్పే వాళ్ళు ఎవరైనా దొరికితే బాగుండును అని పించేది. మగవాళ్ళంటే విసుగు. ఆడకూతురయితే, నాతో నాబిడ్డలా కలిసి పోతుంది. లోకంలో యింతమంది చదువుకున్న వాళ్ళు వున్నారు కదా, ఒక్క అమ్మాయికైనా నా బాధ అర్థం అయి నాకు సాయం చేస్తే బాగుండునుఅనుకునేదాన్ని! పేపర్లో వేయించ మన్నారు. ఏమిటో అదంతా నాకు తెలియని వ్యవహారం! దేవుడు నామనసులో కోరిక తెలిసి నట్లుగా, నిన్ను పంపించాడనుకో" అంది.

స్వప్న కళ్ళు చెమ్మగిల్లినాయి. భగవంతుడు నాగమ్మ అండ తనకి చూపించాడని అనుకుంటే, నాగమ్మ తనని అండగా, తన పిల్లల కోసం పంపించాడని అనుకుంటోంది. స్వప్నకి ఇది హాయిగా వుంది. తనకి ఆసరా యిచ్చిన నాగమ్మకి, తను సహాయ పడటం ఎంతో హాయిగా, తృప్తిగా అనిపిస్తోంది. సాయంత్రం వేళ, అరుగుమీద కూర్చోబెట్టి పిల్లలకి పాఠాలు వల్లె వేయిస్తున్న స్వప్నని నాగమ్మ



ఎంతో అభిమానంగా చూసేది.

రోజులు గడుస్తున్నాయి. నాగమ్మ యింట్లో స్వప్న అరమరికలు లేకుండా కలిసిపోయింది.

ఒక్కోసారి స్వప్న గదిలో ఒంటరిగా మంచం మీద కూర్చుని, కిటికీలో నుంచి శూన్యంలోకి చూస్తూ వుండేది. తన జీవితం ఏమిటో గానీ, ఎంత విపరీతంగా అయిపోయింది. చిన్నప్పుడు తండ్రి పోవడం, ఆ తర్వాత తల్లి, తను మోహన్ మూలంగా జైలుకి వెళ్ళాల్సి రావటం సుధీర్ పరిచయం. అతని ఆసరా, పెళ్ళి! అతనితో కాపురం. స్వప్నకి ఆ జీవితం తను అనుభవించిందేనా, లేక అదంతా కలా అనిపిస్తుంది. తను యిక్కడకు వచ్చి రెండు నెలలు అవుతోంది. సుధీర్ ఎలా వున్నాడు? తనని గురించి ఏమనుకుంటున్నాడు. చచ్చిపోయాననే అనుకుంటున్నాడేమో! అతనిని విడిచి ఎక్కడో దూరంగా బ్రతకగలనని, అతను అనుకోడు. తను నిజంగా చచ్చిపోయేదే. స్వప్న చేయి అప్రయత్నంగా పొట్టమీద ఆనింది. అక్కడ ప్రాణం పోసుకున్న శిశువు స్వప్నకి కొండంత శక్తిని, ఆకాశం అంత ఆశని కల్పిస్తోంది. ఏమిటి విచిత్రం! స్త్రీ మనస్తత్వమే అంతా! ఒక్క ఆరు నెలలు ఓపిక పడితే తనది అనే ప్రాణి తనకి తోడు దొరుకుతుంది.

స్వప్న నిట్టూర్చింది! వచ్చిన వారంరోజులకి తను వాంతి చేసుకోవడం నలతగా వుండడం నీరసంగా పడివుండడం చూసి నాగమ్మ అనుమానంగా అడి

గింది. "బుజ్జమ్మా: అడుగుతున్నానని వేరుగా అనుకోకు, నీ వాలకం చూస్తుంటే, నువ్వు ఒట్టిమనిషివి కాదని అనుమానంగా వుంది"

స్వప్న భయపడలేదు. అవునన్నట్టు తలవూపింది

"ఎట్టెట్టా : మరి ఆ పెద్దమనిషి ఏమయ్యాడు" అంది.

నేనే దూరంగా వచ్చేశాను అంది స్వప్న.

నాగమ్మ క్షణంసేపు తదేకంగా చూసి తల పంకించింది "అర్థం అయిందిలే. నమ్మించి మోసం చేశాడన్నమాట అంతేనా!" అంది. స్వప్న మాట్లాడలేదు, నాగమ్మ మగాళ్ళందరినీ కలిపి తిట్టింది. నాగమ్మ తర్వాత స్వప్నని ఏమీ అనలేదు స్వప్న మెడలో మంగళ సూత్రం వుంది. కాళ్ళకి నాజూకైన మట్టెలు వున్నాయి. స్వప్న వాంతిచేసుకోవడం చూసి రాజమ్మ కంగారు పడుతుంటే "అత్తా! నువ్వు నోరు మూసుకో! ఆ అమ్మాయి లక్షణంగా పెళ్ళి చేసుకుంది నమ్మించి వాడు మోసం చేశాడు ఏం చేస్తుంది. నా మొగుడిని దేవుడు పట్టుకు పోయాడు, నేనేం చేయగలిగాను! ఇదొక దురదృష్టం అయితే అదొక దురదృష్టం అంతే!" అంది.

"వూళ్లో వాళ్ళందరు ఏమంటారు!" అంది రాజమ్మ భయంగా.

"ఏమంటారు! ఏం! వాళ్ళు మొగుడు వదిలేసిన ఆడవాళ్ళని ఎప్పుడు చూడలేదేంటి! ఇదేం విచిత్రమా! బుజ్జమ్మ ఒక్కదాని ముఖాన్నే రాసివుందా! ఇదిగో నువ్వెక్కడన్నా యీ విషయం మాట్లాడినట్టు తెలిసిందా నాలిక పీకేస్తాను.

నాగమ్మ అన్నంత పని చేయగలదు అని రాజమ్మకి తెలుసు.

"నాకేంపని! నేనెందుకు చెబుతాను" అంది ఆ విధంగా, నాగమ్మలాంటి వ్యక్తి అండ దొరకటం వల్ల స్వప్నకి ఒకవిధంగా, యింకే యిబ్బంది లేకుండా పోయింది. నాగమ్మని చూస్తుంటే, సమర్థులైన వాళ్ళు మగవాళ్ళలోనేకాదు ఆడవాళ్ళలో కూడా వుంటారుసుమా అనిపిస్తుంది.

స్వప్నకి చీకటి అవుతోంది అంటే భయం వేసేది. పగలు ఏదో ఒక వ్యాపకంతో యిట్టే గడిచిపోయేది. రాత్రిళ్ళు మాత్రం అస్సలు కాలం కదిలేది కాదు. సుదీర్ఘమైన రాత్రిళ్ళుగా, ఎన్నటికీ తెల్లవారదేమో అన్నంత భారంగా అనిపించేది.

స్వప్నకి రాత్రివేళ మంచం మీద పడుకుంటే ఆ వాతావరణం, ఆ కొత్త చోట చాలా భయం వేసేది. సుధీర్ ఎక్కడ ! తనసలు అతన్ని వదిలేసి ఎందుకు వచ్చేసింది! యిక్కడ ఒంటరిగా ఎందుకు వుంది! అతని దగ్గరికి వెళ్ళి పోవాలి. తక్షణం వెళ్ళిపోవాలి.

స్వప్న మంచం మీద లేచి కూర్చునేది. ముఖం నిండా చెమటలు పోసేవి.

తను ఉదయం కాగానే లేచి వెళ్ళిపోతుంది! లేవగానే సుధీర్ కనిపించగానే మెడ చుట్టూ చేతులు పెనవేసి, అతని గుండెల్లో తల దాచేసుకుంటుంది. ఆ పరిష్వంగం ఎంత సుఖంగా వుంటుంది. అతని ఛాతీ మీద వున్న జుట్టు చెంపలకి తాకుతుంటే ఆ స్పర్శ ఎంత హాయిగా వుంటుంది. "పిచ్చి పిల్లా, ఎక్కడికి వెళ్ళావు! ఎందుకు వెళ్ళావు" అంటాడు.

స్వప్న లేచి వెళ్ళి బట్టలన్నీ పెట్టెలో సర్దుకుని వచ్చి కూర్చుంది, తనకేదో పిచ్చి పట్టి వుండాలి అందుకే అతన్ని వదిలేసి, చెప్పకుండా, దూరంగా వచ్చేసింది. ఈ కొత్త వాళ్ళ మధ్య తనసలు వుండటం ఏమిటి ! యిక్కడ తనకు రక్షణ ఏముంటుంది! ఒక్క సుధీర్ సమక్షంలో తప్ప తనకి ఎక్కడా రక్షణ వుందా! సుఖం వుందా! శాంతి ఉందా! వాళ్ళు వాళ్ళు ఏమనుకుంటే నాకేమిటి! మనిషికి కాస్త అయినా స్వార్థ చింతన ఉండాలి. అనుకోసాగింది. స్వప్నకి వెర్రెక్కినట్లుగా వుండేది

స్వప్న నాగమ్మని లేపింది. "ఏమిటి బుజ్జమ్మా" అంది బద్ధకంగా నాగమ్మ.

"నాగమ్మా! నేను వెళ్ళి పోతాను" అంది. ఈ మాట వినగానే నాగమ్మ గభాల్న లేచి కూర్చుంది ఆ కళ్ళలో నిద్ర బద్ధకం మాయమైంది

"వెళ్ళిపోతావా? ఎక్కడికి?"

"హైదరాబాద్. నేనిలా రావటం పొరపాటు."–నాగమ్మ మాట్లాడలేదు.

"నేనసలు రావటమే తప్పు" స్వప్న పెట్టె పట్టుకుని చెప్పులేసుకుని బైలుదేరింది.

నాగమ్మ గభాల్న లేచి వచ్చి చేయి పట్టుకుంది.

"ఇప్పుడు ఎక్కడికి వెళ్తావు పిల్లా! ఇంత రాత్రివేళ రైలెక్కడుంది నీకు?"

"రైలు వచ్చేవరకూ స్టేషన్‌లో కూర్చుంటాను."

"మంచి పనే చేస్తావు! నిన్నిక్కడెవరూ బలవంతంగా అట్టిపెట్టరు గాని, తెల్లారిన తర్వాత వెళ్ళు" అంది కోపంగా.

స్వప్న వెళ్తుంటే బలవంతంగా పెట్టె లాక్కుని, తీసుకువచ్చి దించింది. వీధి తలుపు తాళం వేసి, తాళం చెవి బొడ్డులో దాచుకుంది.

"వెళుతుందిట! వెళ్తుంది. అర్ధరాత్రి వేళ నిన్నెవరయినా ఏదయినా చేస్తే, మళ్ళీ నేను యీ వూరిలో తలెత్తుకోవాలా లేదా!"

"నేను వెళ్తాను."

"నోరు మూసుకో! ఈ నాగమ్మ సంగతి నీకు తెలియదు. తిక్క రేగిందంటే నాలుగు వుతుకుతాను!" అంది.

తర్వాత నాగమ్మ నిద్రపోయింది.


స్వప్న అలాగే కూర్చుంది. తెల్లవారు ఝాము అయింది. స్వప్న అలాగే కూర్చుంది. కోళ్ళు కూస్తున్న చప్పుడు, ఎరువు బళ్ళు పొలం వెడుతున్న చప్పుడు, పిట్టల శబ్దం వినిపిస్తోంది. వెనక్కి వాలి గోడకి తల ఆనించుకుని కూర్చున్న స్వప్నకి కళ్ళు మూతలు పడినాయి. సుధీర్ గుండెలకి తల ఆనించి కళ్ళు మూసుకున్నట్టే వుంది. పది నిముషాల్లో గాఢ నిద్రలోకి జారిపోయింది.

ఛళ్లున తెల్లవారింది. జాము పొద్దెక్కింది. నాగమ్మ వచ్చి స్వప్నని చడామడా బాదివేసింది "ఇదిగో బుజ్జమ్మా! ఏంటి యింకా నిద్రపోతున్నావు. రైలువచ్చే వేళ అయింది! పోతానన్నావుగా! లే! పో!"

స్వప్న కళ్లు తెరిచింది. ఎదురుగా నాగమ్మ నిలబడి వుంది. నాగమ్మ ముఖం చాలా చిరాగ్గా వుంది 'త్వరగా లే!' అంటూ కసిరింది. స్వప్న లేవలేదు.

"చిటికలో బైలుదేరక పోయావంటే, రైలెళ్ళిపోతుంది." నాగమ్మ యాభై రూపాయల నోటు తీసి స్వప్న మీద గిరాటు కొట్టింది. "చార్జీలకి తీసుకుపో— నువ్వేదో నాకు దేవుడు పంపగా వచ్చావని, నా పిల్లలకి చదువు అబ్బుతుందని మురిసిపోయాను" నాగమ్మ ఏడుపు గొంతుతో అంటూ వెళ్ళిపోయింది.

స్వప్న లేచి కూర్చుంది! రాత్రి తను చేసిన హఠం, పడిన బాధ గుర్తుకు వచ్చింది సుధీర్ దగ్గరికి వెళ్ళటమా! తన కంఠంలో ప్రాణం వుండగా, ఆ పని జరగదు, తిరిగి వెళ్ళటా కేహ తను వచ్చింది? మళ్ళీ అతని కాళ్ళకి బంధం అవటమా? కహూ తన ల్లి



కాదు! తన పట్ల అతను చూపిస్తున్న ప్రేమ అతని జీవితానికి శాపం కాకూడదు! తన వునికి తెలియక పోతే అతను తప్పక విమలని పెళ్ళాడుతాడు.

స్వప్న లేచింది. పెరటిలోకి వచ్చి ముఖం కడుక్కుంది. లోపలికి వచ్చి కాఫీ కలుపుకు తాగింది.

"రైలు వెళ్ళిపోతుందంటే బైలుదేరవేం" ముగ్గు చేస్తున్న నాగమ్మ కసిరింది.

"నేను వెళ్ళటం లేదు! అంది స్వప్న.

"వెళ్ళటంలేదు! ఎందుకని!" అంది. స్వప్న మాట్లాడలేదు. "నిన్నే" నాగమ్మ అరిచింది.

"మరి రాత్రి ఎందుకు అంత గొడవ చేశావు!" నిలవేసింది.

"ఏదో బాధ పట్టలేక అనేశాను; అక్కా! నువ్వు–నువ్వు ఏమీ అనుకోకు! అస్పష్టంగా అంది. స్వప్న కాఫీ గ్లాసు తీసుకొని తన గదిలోకి వచ్చేసింది. వెళ్తున్న స్వప్నని చూసి నాగమ్మ తల పంకించింది. స్వప్న వుంటుంది అనేసరికి నాగమ్మ కోపం మాయలా కరిగి పోయింది.

భోజనం పెట్టేప్పుడు అడిగింది. "రాత్రి నన్ను ఖంగారు పెట్టేశావుకదా అంత వెర్రిగా చేసావేమిటి! నువ్వు వుంటానని అప్పుడు అనుకోలేదు."

"అదోక పిచ్చిలా వస్తుంది. అలాటప్పుడు నువ్వు కోపం తెచ్చుకుని నన్ను వదలకు అక్కా!" అంది స్వప్న.

నాగమ్మ తలపూపింది. "యింకేం–చెప్పావుగా నువ్వు! యిక నేనెందుకు భయపడ్తాను!" అంది స్వప్న కాస్త ఖాళీగా కూర్చుంటే చాలు–పుట్టబోయే శిశువు గురించి ఆలోచనలు వచ్చేవి! ఆ ఆలోచనలు పూలతెప్పలా ఎంత హాయిగా వుండేవి!

(సశేషం)

పిలుపాటి ఉమామహేశ్వరమ్



ఆకలి అంచున

గుడిసెముందు గుంజ కానుకు నిలబడి రోడ్డు వంకే దీక్షగా చూస్తోంది నాగమణి.

మూడ్రోజుల్నించీ ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో, ముల్లోతూ మోకాల్లోతూ మునిగిపోయిన నేల అప్పుడప్పుడే నీళ్ళు జార్తుంటబట్టి అక్కడక్కడా కొద్ది కొద్దిగా బైట పడ్తోంది.

గుంటల్లో నిలచిన నీళ్ళలో కాలుజారి పడకుండా అందరూ ఆ కొద్ది నేలమీకే నడుస్తూండబట్టి అడుసులా తయారౌతోంది ఆకాస్తంత మేరా.

ఉదయం పది గంటల వేళ.

మూడ్రోజుల్నించీ మూసి పెట్టిన మబ్బు మీద కోపంతో చరచరా పైకొచ్చేస్తున్నాడు సూర్యుడు.

చిర చిర్లాడుతూ, చిట చిట్లాడుతూ చికాకు కలిగిస్తూ సూదుల్లా పొడుస్తూ - మబ్బు విడిచిన ఎండ మొగుడు విడిచిన ముండా అన్న సామెతను నిజం చేస్తూ, పట్టప గ్గాల్లేకుండా పేట్రేగి పోతోంది హఠాత్తుగా వచ్చిన ఎండ.

ముసురు మూలాన్న మూడ్రోజుల్నించీ బేరాల్లేవు.

అంతకు ముందు రోజు పొందుగాడొచ్చి వున్న డబ్బులన్నీ పడేస్కు పోవడం మూలాన యీ మూడ్రోజులూ పస్తులుండాల్సొచ్చింది. ఎన్నడూ అలవాటు లేని పరిస్థితేమో ప్రాణాలు పోతున్నట్టుగా వుంది.

వొక్కటంటే ఒక్క గిరాకీ తగల కుండా మూడ్రోజులు గడవడం యిదే మొదటి సారి. అంచేత ఆకలికి తట్టుకోలేక, నీరసానికి నిల్దొక్కుకోలేక సొమ్మసిల్లి పోతోంది ప్రాణం. దానికి తోడు యీ ముసురు మూలాన విపరీతమైన రొంప పట్టి కొద్ది జ్వరం వచ్చినట్టుగా కూడా వుంది.

మూడ్రోజుల పస్తులు.

దాని మీద అనారోగ్యం.

చెప్పనలవి కాకుండా వుంది నాగమణి దేహ పరిస్థితి.

ఇవేళ కొద్ది తెరిపివ్వడంతో ఆ నీరసం మీదే తయారై నిలబడింది, ఒక్క బేరమైనా తగిలి నాలుగు డబ్బులు చేతిలో పడకపోతే గడిచే మార్గంలేదు కాబట్టి.

కానీ —

అలా ఎదురు చూడడంలోనే నిముషాలు దొర్లిపోతున్నాయి గానీ యింత వరకూ ఒక్క గిరాకీ కూడా తగల్లేదు.

మూడ్రోజుల ముసురు అనంతరం తెల్లవారి తెరిపివ్వగానే పొద్దున్నే బజారు ఆడదాని మీదికి మనసెవడికి పోతుంది — అని మనసు హెచ్చరిస్తున్నా గత్యంతరం లేక వృత్తి ధర్మం కొద్దీ కడుపు కోసం తెల్లవారునే తయారై వీధిలో నిలబడింది వచ్చే పోయే వారి వంక ఆశగా చూస్తూ.

ఎవరి మానాన వారు తలొంచుకు పోతూ దైనందిన కార్యక్రమాల్లో సతమత మౌతున్నారు గానీ గజాని కొకటిగా పరుచుకున్న ఆ పాకల వంక వాటి ముందు నిలబడ్డ నాగమణి లాంటి వాళ్ళ వంక ఎవరూ చూడ్డం లేదు.

క్షణాలు గడుస్తున్నకొద్దీ నిస్త్రాణ ఆవహిస్తోంది.

కడుపులో ఏదన్నా పడ్డేనేగాని నిటారుగా నిలబడ్డానికైనా ఓపిక రాదు అనిపిస్తోంది.

కానీ-చేతిలో కానీ లేకుండా కడుపులో ఏదైనా ఎలా పడ్తుంది.

ప్రక్కనే ఉన్న గురువులు కొట్టువంక చూసింది.

పొద్దున్నే తనతోపాటే లేచి, హోటల్ అన బడే గుడిసె తలుపులు తెరిచి, తడిసినకట్టెల్నీ, బొగ్గుల్నీ, మూడ్రోజుల్నించీ బిజినెస్సును పడుకోబెట్టిన "ముండావాన"ని శాపనార్థాలు పెడుతూ నిప్పు రాజేసి ప్రారంభించిన "బిజినెస్సు" ఇప్పుడు మూడు కప్పులూ ఆరు టీలూగా ఉంది.


అప్పటికే పళ్ళేల్లో అమర్చబడి ఉన్న బజ్జీలూ, పకోడీలూ వగైరాలు నోరూరించినా నిగ్రహించుకుంది నాగమణి.

గురువులు మహా నిక్కచ్చి మనిషి.

ఎవరికీ చనువివ్వడు.

అరువంతకన్నా ఇవ్వడు.

"బాకీ పెట్టడమంటూ మొదలెడ్తే తినేస్తారు. పైగా వోసారొచ్చి పో రా దా అంటారు వెకిలిగా. బాకీ చెల్లగొట్టుకోడంకోసం వోసారి పడుకుంటే చాలని తెలస్తే లైనుకట్టి వర్సగా



పడుకునే ముండలమధ్య వ్యాపారం చెయ్యడం అల్లాటప్పా కాదు జాగ్రత్తగా ఉండాలి" అన్నది అతని ఫిలాసఫీ.

అందుకే ఒంటరిగాడైనా, ముందూ వెనకా ఎవ్వరూ లేకపోయినా ఎవర్నీ దగ్గరికి చేరనివ్వడు. మరీ ఎవరికేనా ఎప్పుడేనా బేరాలు తగలక చేతిలో డబ్బుల్లేక అల్లాడుతుంటే నియమానికి విరుద్ధంగా పోయి కన్సెషనిస్తున్నట్టుగా ఒక భోజనం, ఒక టిఫినూ మాత్రం అప్పిస్తాడు.

అటువంటి గురువులు దగ్గర విధిలేక ఒక రోజు పస్తుతర్వాత మొన్న ఒక భోజనమూ, టిఫినూ తీసుకుంది అరువుగా. ఆ పరువై పోయింది. ఇక అరిచి గీపెట్టినా ఏమీ ఇవ్వడు. పైగా నిన్న తనుకూడా దుకాణం పెట్టడానికి వీల్లేకపోయింది.

"అందుకే అప్పుకోసం ఎవరన్నా వస్తే నాకే గతిలేదు. ఇక మీకూ కూడాను. పొండి పొండి" అని కసురుకుంటున్నాడు పొద్దున్నుంచీ ఆ మంగళహారతులన్నీ వింటూ మళ్ళీ ప్రత్యేకంగా తనుకూడా నోరు ఖాళీ చేసుకోడం ఇష్టంలేక బేరాలకోసం ఎదురు చూస్తూ నిల్చుంది నాగమణి.

"అర్జెంటుగా కనీసం ఒక్క బేరమైనా తగిల్తే గురువుగాడి అప్పు తీర్చేసి ఏదో కొంత తిని కడుపుమంట చల్లార్చుకోవచ్చు." ఒకటికి పదిసార్లు అనుకుంటున్నా ఎవరూ తగలట్లేదు.

సమయం గడుస్తూన్నకొద్దీ రోజూ వుండే ట్రాఫిక్కుని చూస్తూనే విసుగెత్తిపోతోంది.

అవే బళ్ళు.

అవే సైకిళ్ళు.

అవే రిక్షాలు.

అవే పాత మొహాలు.

కొందరు పలకరింపుగా నవ్వి పోతున్నారు

స్కూలు టైమైనట్టుగా ఉంది.

బిలబిల్లాడుతూ బడికెళ్ళే పిల్లలు ఉత్సాహంగా కేరింతలు కొట్టుకుంటూ రోడ్డుమీద

నిల్చిన సీళ్ళని చిందగొట్టుకుంటూ పోతున్నారు హుషారుగా.

రోజూ కనబడే సీనే అది నాగమణికి.

పనంతా పూర్తిచేసుకుని బేరాలకోసం తను బయట నిలబడే వేళ, ఆ పిల్లలు స్కూలు కెళ్ళే వేళ.

వాళ్ళని చూడగానే నాగమణికి తన చిన్నతనం గుర్తుకొస్తుంది. గురి తప్పని బాణంలా అది వెంటనే ఆమె మనసులో గుచ్చుకుని ఎన్నో జ్ఞాపకాల గాయల్ని రేపగా తన అప్పటి బ్రతుకునూ ఇప్పటి బ్రతుకునూ పోల్చి చూసుకుని దుఃఖం పొర్లుకు రాగా మనసులోనే కుళ్ళిపోతుంది.

నాగమణి పుట్టడం వేశ్యాకుటుంబంలోనే పుట్టింది.

వాళ్ళ ఇల్లుకూడా ఆ వాడలోనే వుండేది. అందులో చాలామంది కులవృత్తిలోనే వున్నా, వృత్తి మానేసి పెళ్ళిళ్ళు చేసుకుని స్థిరపడి గౌరవంగా కాపరాలు సాగించుకుంటున్న కుటుంబాల్లో నాగమణివాళ్ళదికూడా వొకటి.

నాగమణి తండ్రి ఒక ఆఫీసులో ప్యూన్‌గా పన్జేసేవాడు.

నాగమణి, అంతకుముందో పిల్లాడూ—అంతే వాళ్ళ కుటుంబం చాలా సాఫీగా సజావుగా సాగిపోయేది వాళ్ళ సంసారం.

నాగమణి చిన్నతనంనుంచీ మహా చురుకైనది

అన్నయ్య అల్లరి పిల్లడిగా తిరిగినా తనుమాత్రం ఎంతో శ్రద్ధగా చదూకుని మంచి మార్కులు తెచ్చుకునేది.

ఎనిమిదో తరగతిలో తను స్కూల్ ఫస్ట్ వచ్చినపుడు ఏనివర్సరీలో తనని అందరూ మెచ్చుకోడం ఒకటే ఆమె జీవితంలోని మహత్తరమైన సంఘటన.

ఇప్పటికీ తనదగ్గరున్న ట్రంకు పెట్టెలో ఆ ప్రైజులూ, ఆనాటి పుస్తకాలూ ఇంకా భద్రంగా వున్నాయి.

మనసు బాగలేనప్పుడు ఓసారి చూసుకుంటే ఆరోజులన్నీ గుర్తొచ్చి కొంత ఉపశమనం కల్గడానికి తప్ప అవెందుకూ పనికిరావిప్పుడు

స్కూలు వార్షికోత్సవం రోజున తను తెచ్చిన ప్రైజులూ, సర్టిఫికేట్లూ చూసి తండ్రి ఎంత మురిసిపోయేదో ఆమె కింకా జ్ఞాపకముంది.

గర్వంగా తనని చూస్తూ "నా తల్లిని డాక్టర్ చేస్తాను" అనడమూ గుర్తుంది.

తన ఈడు ఆడ పిల్లలందరూ అప్పటికే "వృత్తి" లోకి దిగిపోయి జీవచ్ఛవాల్లా బ్రతుకుతూంటే తను మాత్రం స్కూలు కెళ్ళి రావటం ఎంతో గర్వంగా వుండేది.

తోటి కుర్రాళ్ళు పోకిరీగా "ఐదిస్తాం, పదిస్తాం" అంటూ వెంటబడి ఏడిపించినా అన్ని అవమానాల్ని దిగమింగుకుని బంగారు భవిష్యత్తు కోసం కలలు కంటూ కష్టపడి చదూకునేది.


అందుకే తనకి మంచి మార్కులొచ్చేవి.

వాడకట్టులోని వాళ్ళు మాత్రం "బంగారం లాంటి పిల్లని చదువుల్తో పెట్టి అనవసరంగా పాడుచేస్తోంది మనదగ్గరుంటే ఈపాటికి ఎంత సంపాయించే వాళ్ళమో" అనుకునే వాళ్ళు.

ఎవరేమనుకున్నా, ఎలా అనుకున్నా తను మాత్రం జీవితంలో ఏదో సాధిద్దామన్న తపనతో వుండేది.

తండ్రి అన్నట్టుగానే తను డాక్టరై పోయినట్టూ, పేదవ రోగాలన్నీ తగ్గించుకొచ్చే వాళ్ళకి బుద్ధి చెప్పి మంచి మార్గానికి తిప్పేస్తున్నట్టూ, వాళ్ళందరూ పశ్చాత్తాపపడి బుద్ధిగా బతుకుతూ సన్మార్గులైపోయి తనను మెచ్చుకుంటున్నట్టూ ఎన్నో కలలు .... ఎన్నో ఆశలు ... ఆశయాలు ...

ఆ మరుసటి సంవత్సరం నాగమణి తొమ్మిదో తరగతిలో వుండగా ఆ కలలన్నీ కూలిపోయేయి తండ్రి హఠాన్మరణం మూలాన.



పిల్లలిద్దరూ చిన్న వయసులో వుండగానే మొగుడు పోయేసరికి నిరాధారమైన సంసారాన్ని ఎలా ఈదవాలో దిక్కుతోచని స్థితిలో అమ్మలక్కల సలహాపై భుక్తి కోసం, వొదిలేసిన కులవృత్తిని మళ్ళీ చేపట్టక తప్పలేదు నాగమణి తల్లికి.

మొగుడు పోయేసరికి చేయి దాటిపోయిన కొడుకుని పట్టడం మరీ కష్టమై పోయిందామెకు.

మారాంతరం చూస్తుండగా మళ్ళీ కులవృత్తిలోకి దిగిన తల్లిని చూసేసరికి మతిపోయింది నాగమణికి. ఆ తర్వాత తన భవిష్యత్తు నూహించుకుని తల్లడిల్లి పోయింది.

చివరికి ఆ రోజు రానే వచ్చింది.

ఎంత తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా, తన ప్రమేయం లేకుండానే తల్లీ మిగతా బంధువులంతా కలిసి బలవంతంగా చదువుని గంగలో కలిపేసి తనను మందలో కలిపేరు.

జీవితంలో ఎన్నో మెట్లెక్కి ఏవేవో సాధిద్దామనుకున్న ఆమెకు ఆవేళ్టినించీ ఆ మెట్లు జారుడు మెట్లుగా మారి అథః పాతాళానికి నెట్టడంలో సహాయపడ్డాయి.

కొద్దికాలం తర్వాత తల్లికూడా పోవడంతో నాగమణి బ్రతుకు పూర్తిగా బజారపాలైంది

ఉన్న ఒక్క తోబుట్టువు ఎందుకూ పనికి రాకుండా పోయేడు.

తల్లి పోయేక నలుగురాడపిల్లల్ని తెచ్చేడు ఓరోజు.

కొయ్యబారిపోయింది నాగమణి వాళ్ళని చూసి.

"ఎవర్రా పిల్లంతా" అనడిగితే "సీలాంటోళ్ళే....సీవొక్కదాని సంపాదనతో యిల్లు గడుస్తదేంటి" అన్నాడు.

పిచ్చెత్తిపోయింది నాగమణికి.

నోట మాట రాలేదు ఆ జవాబు విన్నాక.

బుర్ర గిర్రున తిరిగిపోయింది పరిస్థితులు మారుతున్న తీరును చూసి. ఉద్వేగమూ; ఉద్రేకమూ ఎంత తారస్థాయికి చేరుకున్నా

యంటే అసలేమీ మాట్లాడలేకపోయింది.

ఏమడిగీ లాభం లేదని, ఏమనీ ప్రయోజనం లేదనీ నిశ్చయించుకుని కోపాన్ని దిగమింగుకుంటూ అసహ్యాన్ని అణుచుకుంటూ ఒకేముక్క అంది చివరిమాటగా.

"నీ యిష్టం వచ్చినట్టు ఊరే.. నాకనవసరం. ఒక్క మేలు చేయి. ఎక్కడన్నా యింత తిండి పెట్టే ఉద్యోగం చూపించు చాలు. ఇవేళ్టినుంచీ ఈ నికృష్టపు బ్రతుక్కి స్వస్తి చెప్పదల్చుకున్నాను."

అంతే.

ఆవేళ్టినుండి ఎవర్నీ దగ్గరకు రానీలేదు.

ఉద్యోగం చూపెట్టేవరకూ ఊర్కోలేదు కదా.

ఆఖరికి ఉద్యోగం చూపించేడు సహోదరుడు.

"రోగిష్టి భార్యకు సేవజేయడం, పిల్లల ఆలనా పాలనా చూడడం తప్పితే మరేం చేయక్కర్లేదు, మధ్యాన్నం భార్యను హాస్పిటల్‌నుంచి తెచ్చేక, సాయంత్రం స్కూలునుండి పిల్లలొచ్చేక-ఈ ఉద్యోగ మెంతసుకవో నీకే బోధపడ్తుంది" అని ఉద్యోగం యిచ్చిన పెద్దమనిషి, పరిచయం చేసిన అన్న పక్కకు తప్పుకోగానే పశువులా మీదపడ్డాడు పళ్ళికిలిస్తూ,

"ఏమిటిది" అంటూ పెనుగులాడబోతే "ఏదిపేనువం.లిచ్చి కొన్నానే చిలకా" అంటూ నవ్వేడు వెకిలిగా.

జరిగిన మోసం అర్థం కాగా కుప్పకూలిపోయింది నాగమణి. అప్పుడలా పతనమైన నాగమణి అలా అలా చేతులు మారుతూ ప్రస్తుతానికి పాకల్లోకి చేరిం .

రిక్షా ఆగిన చప్పుడు విని ఉలిక్కిపడి చూసింది నాగమణి.

పక్క గుడిసెలో వుండే సావిత్రి - రిక్షా దిగుతోంది.

ఆమెది రిక్షాకి సరిపడే శరీరం.

నల్లగావుంటుందేమో-నడిచేతారు(దక్కర్లో) వుంటుంది కదుల్తూంటే

ఐతే నలుపులో ఒక నిగారింపుంది.

ఆ కళ్ళలో ఒక వింత మెరుపుంది.

తన స్థూలకాయాన్ని అనువుగా ఆకర్షణీయంగా షోకు చేసోకగల నేర్పుంది.

అందుకే ఆమె ఎప్పుడూ బిజీగావుంటుంది.

ఇది వరలో ఎక్కడెక్కడో పొదిపన్లు చేసుకుబతికేది.

ఇద్దరు మొగుళ్ళు తన నొదిలేస్తే మరో ముగ్గుర్ని తనే మార్చింది.

ఆఖరికి అలా, ఇలా కాదని డైరెక్టుగా వ్యాపారంలోకి దిగింది.

శారీరక సుఖం కోసం కోరి ఈ వృత్తిని వరించి చీకూచింతా లేకుండా హాయిగా గడగలిగే ఆమెను చూస్తే నాగమణికి ఆశ్చర్యం కలుగుతూంటుంది

నాగమణిని చూసి పలకరింపుగా నవ్వి 'నంజుకు తిన్నారు నాయాళ్లు' అంది మూడ్రోజుల్నించీ జరిగిన భాగోతాన్ని నాగమణి అడక్కుండానే వివరించేస్తూ

మూడ్రోజుల క్రితం ఎవరో ముగ్గురు కుర్రాళ్లొచ్చి "బుక్" చేసుకెళ్ళేరు. ఆమె అదృష్టం కొద్దీ ఒక నైటు కంట్రాక్టు, మనుషుమూలాన్న మూడు రోజులకి పెరిగింది

ఇదిగో యిప్పుడే రావడం.

ఆమె వాలకం చూస్తుంటే"దక్షిణ" బాగానే తగిల్నట్టు కనబడ్తోంది. ఓ రెండ్రూపాయిలు బదులడిగితేనో" అనుకుంది నాగమణిమనసు.

ఆహార వ్యవహారాల్లో సిక్కచ్చిగానూ నిర్మొగమాటం గానూ వుండే ఆమె మనస్తత్వాన్ని గుర్తుకు తెచ్చుకుని మిన్నకుండిపోయింది.

అప్పుడైతే విషయంలో గురువులెంతో సావిత్రి అంతే

మౌనంగా తల తిప్పి మళ్ళీ వీధికేసి చూడసాగింది నాగమణి.

గుడిసె తలుపు తీసి లోని కెళ్ళిన సావిత్రి రెండు నిముషాల్లో మళ్ళీ బయటకొచ్చి నిలబడింది.

గతుక్కుమంది నాగమణి సావిత్రినిచూసి.

పస్తుల మూలాన్న ప్రాణాలు పోతూ గిరాకీ తగలక ఛస్తూంటే యిదొక పోటీనా!

ఆమె పంచకళ్యాణిలా సింగారించుకొని పక్కనే నిలబడ్డే బక్కచిక్కి ఎండు చేపలా వున్న తన వంక ఎవరేనా చూస్తారా?

సావిత్రి నాగమణి వంక చూసి కులాసాగా నవ్వింది.

"ఎలా వున్నాయ్ బేరాలు ?"

నాగమణి సమాధానంగా ఓ జీవం లేని నవ్వు నవ్వింది.

మళ్ళా యిద్దరూ రోడ్డు మీదికి దృష్టి సారించేరు.

ఓ కుర్రాడు సైకిల్ మీద పోతూంటే ఆపి, "టైమెంతైంది బుల్లోడా" అనడిగింది సావిత్రి పైటజార్చి.

"పదకొండూ ఇరవై" అంటూ దూసుకు పోయేడా కుర్రాడు.

"ఇదిగో బుల్లోడా .... మాట" అంటూ అరిచింది సావిత్రి వెనుకనించి.

కుర్రాడాగలేదు. వెళ్ళిపోయేడు. ఆగిన పక్షంలో నెమ్మదిగా మాటల్లో పెట్టి లోపలికి లాగేదే.

"పాసింజర్లని" పట్టడంలో అదో ట్రిక్కు అటువంటి పన్లు నాగమణికి చేతకావు.

ఆ వీధి ఎలాంటిదో అందరికి తెల్సు.

ఎవరేనా తమంత తాముగా వచ్చినా, పరిచయ మున్న బ్రోకర్స్, రిక్షా వాళ్ళూ తెచ్చిన బేరాలూ నొప్పుకోవడం తప్ప ఇటువంటి వెకిలి వేషాలువెయ్యడం ఆమె తత్వానికే విరుద్ధం.

పది నిముషాలు గడిచేయి.

బేరాల్ని నమ్ముకుంటే బతుకు తెల్లారేట్టు కనిపించట్లేదు.

ఎవరో ఒకరు ఆదుకుంటే తప్ప పరిస్థితికి నిలదొక్కుకోవడం కష్టం.

సావిత్రిని అడుగుదామని నోరుతెరిచేంతలో సావిత్రి "ఆ!" అని నోరు వెళ్ళబెట్టి అంతలోనే ఆశ్చర్యంనుంచి తప్పుకుంది వడివడిగా గుడిసెకు తాళం పెట్టేసి.

ఆశ్చర్యంగా సావిత్రి చూసిన వేపు చూసిన నాగమణి కూడా వణికి పోయింది తాపీగా సైకిల్ మీద వస్తున్న పాండుని చూసి.

పాండు ఆ వాడకి రక్షకుడు. భక్షకుడు కూడాను.

ఖాళీగా సైడు కాలువ నానుకుని వున్న స్థలంలో క్రమంగా గుడిసెలు లేపి చిన్న రాజ్యం స్థాపించి యీ కుటీరపరిశ్రమని బ్రహ్మాండంగా నడుపుతున్నాడు.

సెంట్రల్ జైల్లోంచన్నా తప్పించుకో వొచ్చేమో గానీ ఒక సారి వాడి [illegible]పడ్డ వాళ్ళ తప్పించుకోవడం కల్ల.

రక్తమాంసాలు పూర్తిగా [illegible]కునిగానీ ఎవర్నీ వొదిలి పెట్టడు.

కాని ఒకటిమాత్రం నిజం.

వాడి రాజ్యంలో ఉంటే ఎవరికీ భయ పడక్కర్లేదు. ఎవర్నించీ ఏ దాడీ ఉండదు. కేసులూ జుల్మానాల మాట కల్లోకూడా తలవక్కర్లేదు.


అంచేత ఆవాడలో ఉండేవాళ్ళకి వాడే దేవుడు-వాడే రాక్షసుడు.

వాణ్ణి చూస్తూనే నాగమణి గుండెలు దడదడలాడేయి.

సాంత్రో జులక్రితం ఉన్నదంతా ఊడ్చుకు పోయేడు. "డబ్బాకీ మాపటికల్లా ఈక పోతే ఎముక లేరేస్తా" అని వార్నింగిచ్చి మరీ పోయేడు.

తుఫాన్మూలాన తనూ బయటికి కదల్లేక పోయేడు కాబోలు ఇప్పుడూడిపడ్డాడు.

బేరాల్లేవంటే నమ్మడు.



గుడిసెలోపల ప్రతి అంగుళం వెతుకుతాడు. గుడ్డలూడదీసి ఒళ్ళంతా తడుముతాడు స్వంత పెళ్ళామైనట్టు.

"సాంత్రైతే నెమ్మదిగా జారుకుందిగానీ తనెక్కడికి పోతుంది కాలు కదపలేని స్థితిలో ఉంటే."

తిరిగ్గా వొచ్చి ఆగి "తే" అన్నట్టు చేయి జాపేడు.

"లేవు" అంది నాగమణి బిగుసుకుపోయిన గొంతుతో.

"తెయ్యే బేగెల్లాల" అన్నాడు అక్కడికేదో నాగమణి తనతో సరసమాడ్తున్నట్టు.

"నిజం. ఈ ముసురుమూలాన్న ఒక్కటంటే ఒక్క బేరంకూడా తగల్లేదు. ఉన్న డబ్బంతా మొన్న నువ్వే ఊడ్చుకుపోయేవు అప్పట్నుంచీ పస్తులే నేను. పైగా జొరవొచ్చినట్టుగా ఉంది."

పాండు సైకిల్ దిగి స్టాండ్ వేసేడు.

"మరియాదగా యిస్తార్లే మీ లంజలూ" అంటూ నాగమణి జబ్బ పట్టుకుని లోనికి నెట్టుకుంటూ వెళ్ళి "తే! ఎక్కడ పెట్టావో తీయ్" అంటూ మంచంమీదికి తోసేడు.

పాండు తోసిన తోపుకి సగం ప్రాణం సాయినట్లయింది. "తీస్తావా లేదా" అంటూ ఝుచ్చిళ్ల పట్టుకు లాగేడు మీదికి వంగాడు. కు రాయి వాసన గుప్పుమంది.

నఅసలే నిస్త్రాణగా ఉందేమో కడుపులో దే విట్లయింది ఆ వాసనకి.

ఆ తర్వాతేం మాట్లాళ్ళేదు నాగమణి.

ఆసమయంలో ఇంకేం మాట్లాడినా ప్రయోజనం ఉండదు. ఊరికే గింజుకుని ప్రాణాల్ని మరింత హైరానా పెట్టుకోవడ మెందుకని వాడు మీదనుంచి లేచేవరకూ శవంలా అలానే పడుకునుండిపోయింది.

ఆతర్వాత వాడు పాకంతా తిరగతోడుతూంటే గుడ్లప్పగించి చూస్తుండిపోయింది.

ఎక్కడా ఏమీ కనబడకపోవడంతో గళ్ళ లుంగీ ఓసారి బిగించి కట్టుకుంటూ_

"రేత్రికొత్తా లంజా. తబ్బులిస్తం సైకపొయ్యేవో వుందే నీ పని. ఇల్లప్పగించేసి నియ్యోష్టంగా నా కొడకా అంటవేం బిజినెస్సను కుంటన్నావేమో-నీకు మజాగానే ఉంటది- ఆళ్ళనోళ్ళూ యీళ్ళనోళ్ళూ కట్టలేక నేన్నస్తన్నాను మద్దిన-" అని వార్నింగిచ్చి తిట్టుకుంటూ, తూలుకుంటూ వెళ్ళిపోయేడు.

పాండు వెళ్ళిన పావుగంటవరకూ అచేతనంగా అలాగే ఉండిపోయింది నాగమణి.

ఆ తర్వాత నెమ్మదిగా కాలూ చెయ్యీ కూడదీసుకు లేచింది. చీరె కట్టుకుని జుట్టు సరిజేసుకుంది. గొంతెండి నీరసంతో ఒళ్ళు తేలిపోతూండగా ఓ గ్లాసెసు మంచినీళ్లు తాగి ఒళ్లతిప్పుడు కొద్ది సర్దుకున్నాక మళ్ళీ బైట కొచ్చి నిలబడింది.

సావిత్రి ఇంకా ఐపులేదు.

పాండుకి రుడిసి ఎక్కడో నక్కింది. అదృష్టవంతురాలు. మూడ్రోజుల సంపాదనా వాడిపాల పడకండా తప్పించుకుంది.

రోడ్డువంకే దీక్షగా చూస్తున్న నాగమణికి దారేపోయే వాళ్ళే తప్పితే "పాసింజర్లు" కనుచూపుమేరలో ఎక్కడా తగలట్లేదు.

సూర్యుడు నడినెత్తికెక్కేడు.

కడుపులో ఆకలిలా పైన ఎండ మండిపోతోంది.

ప్రక్కన గురువులి కొట్లో వ్యాపారం జోరుగా సాగిపోతోంది. గాలి మోస్కొస్తూన్న తినుబండారాల వాసనలు ఆకలిబాధల్ని ఇంకా ఎగదోస్తున్నాయి.

పళ్లబిగువు నున్న ధైర్యం సన్నగిల్లుతోంది.

ఎప్పుడూ యీ పాటికి ఒకటి రెండుబేరాలు తగిలేవి. ఇవేళింకా బోణీ అయ్యే ఆశకూడా కనబట్టం లేదు. ఇలా ఐతే యీ ఆకలికీ, ఈ అనారోగ్యానికి యిక చచ్చి పోవడం ఖాయం అనుకుంది నాగమణి.

ఒక్క బేరం తగిత్తే బాగుణ్ను.... ఎవరన్నా కరుణించి ఒక్కసారి - ఎవరన్నా ... ఎవరన్నా....

అప్రయత్నంగా నాగమణి దృష్టిఎదురుగా వస్తున్న నడి వయస్కుడి మీద పడింది.

నాగమణి మనసులో ఏదో ఆశ రెపరెపలాడింది.

చుట్టు పక్కలెవరూ లేరు.

తలొంచు కెళ్ళి పోతున్నాడు.

ఒక సారి పిలిస్తే.

గుండె దడదళ్ళాంది.

నోరు తెరిచి పిలిచే అలవాటు లేదు తనకి.

పిలిస్తే ఏమనుకుంటాడో!

రానంటే!

ఛీ అంటే!


అననీ .... ఏమైనా అననీ .... అడగంది అమ్మైనా పెట్టదంటారు ... ప్రయత్న లోపం ఎందుకుండాలి ...

"ఏమండీ"

తన గొంతు తనకే వినబళ్ళేదు.

వినబడినట్టు లేదు. వెళ్ళిపోతున్నాడు.

"ఏమండీ"



కొద్దిగా గట్టిగా గొంతెత్తి పిల్చింది.

ఏదో ధ్యాసలో పోతూన్నవాడల్లా ఆగేడు.

"మిమ్మల్నే ఓ సారిలా వస్తారా"

వచ్చేడు.

"లోనికి రండి"

అనుసరించేడు.

లోపలి కెళ్ళాక స్తబ్దుగా నిలబడింది నాగమణి. ఏమని అడగడం ... ఎలా అడగదం ... నలభై పైనే వుంటాయి. ఆ మాత్రం గ్రహింపుందదా ...

ఆలోచిస్తోంది నాగమణి.

"ఏమిటమ్మా సంగతి?"

"అమ్మ!" ఉలిక్కిపడింది నాగమణి. వెన్నులోంచి జరజరా ఏదో పాకినట్లయి ఒళ్లొక్కసారిగా జలదరించింది. ఆముక్క విన్నాక మళ్ళీ నోరు పెగల్లేదు నాగమణికి. తనని అమ్మా అని పిలుస్తున్నాడు.

ఇంకా ఏముఖం పెట్టుకుని ఎలా అడుగుతుంది తను.

కానీ దేహపరిస్థితీ, మనఃపరిస్థితీ ముందుకు తోస్తున్నాయి....కడుపుకోసం... తప్పదు.... దానికోసమే చావలేక బ్రతికేది....నోరు

ప్పి ది.

"ఒక్కసారి ఉంటారేమోనని" నసిగింది.

ఈసారి విస్తుబోవడం ఆయన వంతైంది. ఓసారి నాలుగుపక్కలా కలయజూసి ఏదో అర్థమైనట్టు నవ్వి "నేనట్లాంటివాణ్ణి కాదమ్మా" అన్నాడు మృదువుగా.

అవమానంతో, సిగ్గుతో ఒళ్లు చచ్చిపోయింది నాగమణికి.

కొన్నిక్షణాల భయంకర మౌనం తర్వాత గొంతు పెకిల్చుకుంది.

"మీరట్లాంటివారని కాదు... మూడ్రోజుల్నించీ... పస్తుల్ని భరించలేక...." ఆతర్వాత మాట రాలేదు.

ఆయన ఓ నిముషంపాటు అలానే నిల్చుండిపోయి తేరుకున్నాక జేబులోంచి ఒక ఐదు రూపాయల నోటు తీసిస్తూ - "ఉంచమ్మా" అన్నాడు.

పూర్తిగా చచ్చిపోయింది నాగమణి.

"మీరు... మీరు..."

"ఫర్లేదమ్మా! నీ తండివంటివాణ్ణి. నాకీ ఊరు కొత్త. ఏదో కోర్టుపనిమీద వొచ్చేను. ఈ సందిటువంటిదని తెలిస్తే వొచ్చేవాణ్ణి కాదు. ఏదో ధ్యాసలోపడి పోతూన్నవాణ్ణి పిల్చేసరికి ఏమిటో అనుకునొచ్చేను. నువ్వేం బాధపడకు. నాకలాంటి అలవాట్లు లేవు... ఇదుంచుకో"

మొదటిరోజు గదిలోకి నెట్టబడ్డప్పుడుకూడా అంత అవమానపళ్ళేదు.

దౌర్జన్యాన్నే కాదు, సౌజన్యాన్ని భరించడంకూడా ఎంత కష్టమో తొలిసారి అర్థమైంది నాగమణికి. ఆయన జాలీ, వాత్సల్యమూ భరించరానివిగా వున్నాయి.

ఆయన కంటపడకండా కాళ్ళ కింది నేల పగిలి అధఃపాతాళానికి జారిపోతే ఎంత బాగుండు అనిపిస్తోంది.

"తీసుకోమ్మా"

"అమ్మ" మళ్ళీ అదే మాట.

తన నికృష్టపు బ్రతుకును నిలూనా దహించేసొక్కాలనిపిస్తోంది ఆ మాట వింటుంటే.

అదేక్షణాన రోజూ తన గుడిసె ముంగిటకొచ్చి అడుక్కునే ముసిల్ది మనస్సులో మెదిలింది.

అవును. ఒళ్ళమ్ముకుంటున్నా యింతా ఒకళ్ళకి పెట్టగల స్థితిలోనే వుంది తను. ఆ స్థాయి నుంచి తను దిగజారలేదు.

ప్రాణం పోయినా సరే.

వొణుకుతున్న కంఠంతో చేతులెత్తి ఆయనకు నమస్కరించి. "వెళ్ళండి బాబూ! వెళ్ళండి. ఈ పాపిష్టి దాన్ని క్షమించి వెళ్ళిపోండింక. మీ దయచాలు నాకు. మీడబ్బొద్దు. అది పుచ్చుకునే అర్హత నాకు లేదు. నేనింతవరకూ మానాన్నే అమ్ముకున్నాను. అభిమానాన్ని కాదు. మీ డబ్బు మీ దగ్గిరే వుంచుకుని కనీస దాన్నేనా నాకు మిగల్నివ్వండి. వెళ్ళండి బాబూ యీ రొచ్చు గుంటలోంచి త్వరగా వెళ్ళిపోండి" అన్నది రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని.

నాగమణిలో అంతకు మించి మరేమీ చలనం లేక పోయేసరికి ఒక నిముషం సేపు చూసి "వొస్తానమ్మా" అన్చెప్పి వెళ్ళి పోయేడాయన.

ఆడదై పుట్టి, కడుపు కోసం మానాన్ని అమ్ముకోడానికి సిద్ధపడ్డా, అభిమానం వొదులుకుని అమ్ముకునే స్థాయి నుండి అడుక్కునే స్థాయికి దిగజారి అవమానం పాలుకాలేని నాగమణి ఆయన వెళ్ళిపోగానే నిలబడ్డానికూడా ఓపిక లేక నేల మీద కూలబడి గుండె పగలేలా కరువు తీరేలా భోరుమనేడవసాగింది. ✱

రివెంజ్



కొనకంచి లక్ష్మీనరసింహారావు

ఆ పల్లెటూరు తారురోడ్డుకి పదిమైళ్ళ దూరంలో ఉం . పల్లెకు బాటసారుల్ని చరవేసే కాలిబాట మాత్రం ఏడుమైళ్లుండొచ్చు. ఆ కాలిబాట కిరుప్రక్కల నున్న చెట్లు దేశంలో ధరల్లా ఆకాశాన్ని చుంబిస్తుంటాయి. ఆ చెట్ల మధ్య ఎప్పుడో — ఔరంగజేబు

కాలంలో కట్టబడిన మహిమ ఎన్నికల్లో ధరా వత్తునైనా మిల్లుకోలేని అభ్యర్థిలా ఉంటుంది.

బీదోళ్ళ నోళ్ళు కొట్టి ధనవంతులై మిద్దె కట్టుకున్నట్లు, ఓ డొంక ఆ కాలిబాటను లెన్క్లోకి కలుపుకుని "దొరోరి డొంక" అని పిలువబడుతూ వుంటుంది. చట్టం అనే ముళ్ళకంచెలో నేరసులు తప్పించుకొనే దొడ్డిమార్గాలున్నట్లు, దొరోరి చేను చుట్టూ ఉన్న కంచెలో మనుషులు పట్టేట్లు కన్నాలు టాయి. ఆ కన్నాల గుండా దొరోరి మనుషులు లోపల ఉన్నట్లెతే కన్నా వెళ్ళి, సరిగ్గా తిరిగొస్తారనే నమ్మకమైతే లేదు. దొరోరి చేను కంచె కాట్టి ఎవ్వరూ దానిపై చెయ్యి వెయ్యలేకపోవటంతో మంచి నీళ్ళలో నాచులా పెరిగి, గుళ్ళో హారతి పళ్ళెంలో డబ్బు వెయ్యకపోతే అర్చకవాడు నెత్తిన గోపురంతో మొట్టినట్లు ఎత్తుగా ఉన్న జాస్తాల కలుపుకుంటూ "నేను దొరోరి కంచెను" అని ఆ ఊళ్ళో దొరోళ్ళ ఆధిక్యతను, ఆ గ్రామంలో ఉన్న తనలాంటివాళ్ళ ఆధిపత్యాన్ని చాటుతుంటుంది. "అతీయ ళ్ళకి చెలపోటీ" అని ఓ పోటీ పెడితే ఈ కంచెకు ఫస్టు ప్రైజ్ మాత్రం ఖాయం! దొరోరి అధికారం వేళ్ళూనుకొని పోయిన ఆ ఊళ్ళో ఓ సాయం కాలం....!

దొరోరి అధికారం పొలిమేరల దగ్గరనుంచి స్మశానం వరకు నగ్నంగా నర్తించే ఆ ఊళ్ళో ఓ సాయంకాలం...పశ్చిమాన అస్తమిసున్న సూర్యుడు కసాయివాని కత్తికి తల తెగి, నెత్తురు కక్కుతున్న మేక మొండెంలా వున్నాడు. కాలపురుషుడు సూర్యుని పాలిట కసాయివాడయ్యాడు. ఉరిశిక్ష పడే వానికి తలపై ముసుగేసినట్లు ఆకాశానికి నల్లని చీకట్లు ముసుగేసున్నాయి. సూర్యుణ్ణి పట్టుకొని చిదిపితే, సొన కారినట్లు ఆకాశమంతా వ్యాపించి ఎరుపు రంగు పారింది.

ఆ మసక చీకట్లో కీచకుని మందలా వున్న దొరోరి కంది చేలో రెండు ఆకారాలు పెనుగులాడుతున్నాయి.

"ఛీ!...దొంగ సచ్చినోడ! ఇంపిరా నన్ను బీట్ల గడ్డికోసుకోనుండి! ఒదులు సన్నాసులు! నీకు ఉణ్ణ పెడా.. ఒదులు!" అని దీనంగా ఏడుస్తుంది. ఓ ఆడకూతురు. గద్ద గోళ్ళలో చిక్కుకున్న కోడిపిల్ల అరిచే అరుపులా దీనంగా ఉందా ఏడుపు. బహుశా పులి నోట్లో పడ్డ మేక—కోలీసోళ్ళ చేతుల్లో పడ్డ నిస్సహాయుడు కూడా అలా ఏడవడు కాబోలు!...

"ఏహెయ్!... ఓ నిన్ను గొంతు!..." దొంతలో దున్నుకుంటున్న కలగాళ్ళ గొంతలు విని పెద్దిరెడ్డి ఆ అడ నోటి మీద బలంగా చెయ్యి నొక్కాడు.

"నాగిగా?....నువ్వు గొడ్లనింటికి తోలుకెళ్ళు—బువ్వ తినొచ్చి సెగ కడు లంక కాపలా బడుకో!... నేను దొరోరు సేత్తో చెప్పింతమటికి చెల ఉంటా సం!" అని జీతగాడు నాలుకకి చెప్పి దొంకలోంచి కింది. చేలోకి అడుగు వేసాడు పెద్దిరెడ్డిగారి పెద జీతగాడు ఓబులు.

నాలుగు కదిచెటు నిలువు ఇరికే ముసురు కలిసాయి పెద్దిరెడ్డిగారి చిటిపెట్టు లాటరీ! ఏడ్చిన ఆకాశం కన్నీటి బిందువుల్లా నక్షత్రాలు మెరుస్తాయి. చీకట్లో ఆ ఆడ ఆకారం ప్రతిఘటించలేక పెద్దిరెడ్డిగారి పెద్దరికానికి బలైపోయింది.

నాకు తెలుసు కూడమృగమైనా కడుపునిండా తిండిఉంటే ఏ జీవికి హాని చెయ్యదని. కాని మనిషికి కడుపునిండా తిండి వుంటే చాలు బుద్ధి ఏవేవో చీకటి హాల్లోకి తొంగిచూస్తుంది ఆ పొట్టు మదానికి కొన్ని పాపం డబ్బు మదం—అధికారం తోడైతే ఇంక. ఎన్నెన్నో అమాయక జీవులు ఈ మృగాల తుచ్ఛ వాంఛలకు బలైపోతాయి. మరికొన్ని ప్రాణులు నియంతమృగాల విలాస ప్రహసనాలకు మెట్లు అవుతాయి

డబ్బు మదపు పెద్దరికపు పాముకోట్లో పేదరికపు బడుగుకప్ప బలైపోయింది.

పెద్దిరెడ్డి లేచి బట్టలు దులుపుకుంటూ "భయపడకు....! నెమ్మదితో సెప్తను ఇటికాడ రెండు పూట్ల జొన్నకూడు తింటు ? మన ఇటికాడికొచ్చి రెండు బస్తాల జొన్నలు కొలిపో! ఆ..! ఓరిగా దొస్తున్నట్లు ఉండు తాదక గెప్పు..!" అన్నాడు.

"నన్ను నాయం సేసి ఒడ్లిత్తావు? ? నువ్వు నాకి సేసన్న ఒడ్లతో జే నీ చావబతి పెట్టకపోతే నా పేరు నాగమ్మే కాదు" అని అరుస్తూ లేచింది ఆ ఆడది.

"పిచ్చిముండ....! నువ్వేం చెయ్యగలవు ..? నన్ను నువ్వేం చెయ్యలేవు? చెప్పుకుంది తేల్చు కానీ కాదు చెయ్యలేవు....!" సిగరెట్ వెలిగించాడు.

ఓబులు పిల్లికల్లాపాముతెవులు. వాడికి సిగరెట్ వెలుగుటం దూరంనుంచి కనబడింది. లీలగా రెడ్డి గొంతు వినబడింది. అక్కడేదో చాటుగా గోతం జరిగిందని..... అయినా రెడ్డి నోట్లో సిగరెట్ కమురుగవాలా వెలగటం ఆయనగారి బాగోతానికి మంగళచిహ్నం అని తనకి తెలుసుకనుక గబగబా అటువేపు అడుగు వేశాడు.


నాలుగడుగుల్లో రెడ్డిగారిని చేరుకున్నాడు. ఆ ప్రదేశమంతా చెట్లు విరిగి, గడ్డి అంతా నలిగి జరిగిన అమానుషానికి సహజంగా శ్మశానంలా ఉంది "దొరగోరూ....? మీరీన ఉన్నరా...." మీకోసం నేను చేనతా గాలిస్తు టె!" అన్నాడు భుజాలమీది మల్లుగరను నేలకానించి వినయంగా అప్పుడికి ఆ ఆడ ఆకారం నాలుగు గజాల దూరం వెళ్ళి లేగపడుతలు కాళ్ళ తిప్పం పడడంతో దబ్బున కింద పడ్డది

"ఎవరది....?" ఓబులు కేక

"........"

రెడ్డి "మునుపుడిసే...! ఇప్పుడే పోతాంది. ఏం సూసుకుంటావా....?" అన్నాడు.

"మాకెందుకు దొర....! గొప్పింటోళ్ళు మీగ్గానమూ ఒతుకులిట్టా తెల్లారితే చాలు" ఓబులు మాటలు విని పెద్దిరెడ్డి గర్వంగా మీసాలు మెలివేశాడు.



దొర ముఖంమీద కదలాడిన అక్షంతాని భావాన్ని ఓబులు గమనించకుండా చీకటి మింగివేసింది. వెలుగులో దాన్ని గమనించినా అర్థం చేసుకోలేడు ఓబులు. ఇద్దరూ బావి గట్టువేపు కదిలారు.

పెద్దిరెడ్డి ఉస్సురంటూ భారంగా బావిగట్టు మీద కూర్చొని "ఏందిరా... ఓబిగా....! పెద్దల్లుడిగార్కి కడుపుల్నొప్పిలేస్తే ఆస్పిటల్ల ఏస్నినంట. పొద్దుగాల కబురొచ్చింది అమ్మాయి గారు ఒకటే ఏడుపట....! శెనగ మొత్తం చేల ఉంది. నాకేమో పోదమంటే తీరిక లేదాయె.. ! అన్నాడు చుక్కల వెల్తుర్లో విచారంగా మొఖం పెట్టి.

తన ఇంటి విషయాలు ఎవ్వరితో చెప్పని, తన ఇంటి విషయాల్లో ఎవరు జోక్యం కలిగించుకున్నా సహించవటువంటి పెద్దిరెడ్డి తనకు తానై ఇంటి విషయాలన్నీ ఓబులుకు చెప్పేటప్పటికి "తనంటే ఎంత పేమ... ఎంత ఇదిగా సూసుకుంటాడు? అనుకున్నాడు ఓబులు. వాడి మనసు హిమాలయాలంత ఎత్తుకు ఎదిగిపోయింది. దొరకోసం ఎంత త్యాగానికైనా, ఎంతటి కష్టమైన పనికైనా ఎనక్కు దిరగ్గూడదనుకున్నాడు. రెడ్డి తీసి గుండెను తీసి గోడకు పెట్టి మేకులు కొట్టమన్నా సిద్ధపడేట్లున్నాడు ఓబులు.

"మీరేమి అనుకోకుండా ఉటనంటె నే నొక్క మాట జెప్త ఇంటరా?" మెల్లగా అడిగాడు ఓబులు.

"ఏంటది....?"

మీకోసం మీ పెజ్జీతగాడు ప్రాణమడ్డేస్తడు పంటగురించి మీరెట్టి దిగులు పెట్టుకోమాకండి. మొత్తం ఇంటికి దోలించే బాధ్యత నాది. తవరు పటికి ఎల్లి అల్లుడుగోర్ని సూసి రండి....! అన్నాడు. వాడి మాటల్లో పట్టుదల ఉట్టిపడ్తున్నది.

"సర్లే...! రేపొద్దుగాల అల్లుడుగారికాడి కెళతా....! నడిజాం కావొచ్చింది! ఇంటికి పోదాం! నాగ్గాడు చేల బండుకుంటడు! నువ్వే మా ఇంట్ల పండుకో!" అని లేచాడు. రెడ్డి మాటల్లో భయం-పిరికితనం ప్రస్ఫుటమౌతోంది. అదంతా అల్లుడు జబ్బుతో ఉండటం వల్ల అనుకోసాగాడు ఓబులు.

చేలోంచి డొంకకెక్కారు ఇద్దరూ! దారి వెంట ఎప్పుడూ నియంత్రలో నడిచే రెడ్డి అడుగులు ఎందుకో తడబడసాగాయి. వాళ్ళిద్దరికి దారి మసకమసకగా కనబడుతూ....యవ్వనంలోనే మొగుడు చచ్చిన విధవలా ఉంది. ఆమె అందాన్ని సంస్కరించే ధైర్యం లేక చూపులతోనే ఆస్వాదించే క్రూరకారులా నక్షత్రాలు మెరవసాగాయి.

ఊళ్ళోకొచ్చారు. రెడ్డికి నాలుగు అడుగుల వెనగ్గా అంగరక్షకునిలా కుడిచేత్తో కర్రబట్టుకొని నడవసాగాడు ఓబులు

నాగులు ఎదురుగుండా పరిగెత్తుకుంటూ వచ్చి, వీళ్ళిద్దరినీ చూడగానే ఆగి వగరుస్తూ "దొరా...!" అన్నాడు.


"ఏమైంది...?" రెడ్డి-ఓబులు ఒకేసారి ఆత్రంగా అడిగారు.

ఓబులు పెళ్ళాం నాగమ్మ ఇంట్లో ఉరేసుక చచ్చింది. జనం ఇంటిముందు ఇరగబడి తలుపు కంతల్లకుంత సూత్తన్నరు. ఓబులొచ్చిందాక తలుపు తీయొద్దని సెప్పొచ్చిన!" అన్నాడు.

ఓబులుకు కళ్ళు తిరిగాయి. ఒచ్చే ఏడ్పు నాపుకుంటూ కర్ర ఆసరా తీసుకొని కూలబడ్డాడు.

దూరంగా శ్మశానంలో ఏదో నక్క అరిచింది. "జనమంతా ఏమనుకొంటున్నారు...?" ఆత్రంగా నాగుల్ని అడిగాడు పెద్దిరెడ్డి.

"పొద్దు గుంకిందాక మంచిగానే వున్న దానికి పొయ్యే కాలమే మొచ్చింది....? అయినా పిల్లల కోసమని ముత్యాలమ్మకాణ్ణించి, జానపాటి సైదులు వరకు మొక్కుకున్నా ఒక్క గొడ్డైనా లేడాయె! ఇసిగి యేసారి ఉరేసుకుందనుకుంటున్నారండి ...!



పెద్దిరెడ్డి మొఖం పెనుతుఫాను తర్వాత సముద్రంలా ప్రశాంతమైంది. కాని తన మొఖం మీద నర్తించే ఆందోళన ఛాయల్ని మాత్రం పూర్తిగా తొలగించలేక పోయాడు.

కూచోని కుళ్ళుతున్న ఓబుల్ని "పోయినోళ్ళ కోసం ఎడ్సతూకుంటే తిరిగొస్తారా ఏంది ... ? బాధపడ్త ఎందుగ్గూకుంటావు? అంతగాకపోతే ఎల్లుండి ఈపాటికి ఇంకో పెళ్ళి చేసుకుందువు గాని ... లే ... లే ...! అని వాడికి చెయ్యి ఆసరాయిచ్చి, లేపి నడిపించాడు.

పెళ్ళాం చావన్నా ఓబుల్ని ఆశ్చర్య పరచలేదుకాని, దొరచెయ్యి ఆసరా ఇచ్చి ద్వారెంట నడిపించటం ఆశ్చర్యపరిచింది కాని ఆ ఆశ్చర్యం ఎక్కువసేపు నిలవుండ లేదు.

ఇంటి ముందు పోగయిన జనం వీళ్ళను చూసి దారి యిచ్చారు. జరిగింది సహజమైన చావుకాదు కాబట్టి అంతా ఆసక్తిగా చూస్తున్నారు.

అక్కడ పోగయిన జనంలో నూటికి డెభై మంది ఎప్పుడో ఒకప్పుడు చద్దామనుకున్నవాళ్ళే ...! వాళ్ళ తాలూకు మనుషులిలా అర్ధాంతరపు చావు చచ్చినోళ్ళు లేకపోలేదు.... ఒక మనిషి ఆకలి వల్లనో, పరిస్థితులవల్లనో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ఎవరూ ఆ వ్యక్తిని పలకరించరు. కనీసం కన్నెత్తన్నా చూడరు. ఆ మనిషి పోయాక జనమంతా గుమిగూడతారు. సానుభూతి వాక్యాలు పలుకుతుంటారు. మనుషుల్లో మానవత్వం హరించుకపోతోందా ...?

నైతిక విలువలు దిగజారుతున్నాయా...?"

పోలీస్ పటేల్ కామయ్య ఓబులు పెద్దిరెడ్డి వద్దన్నా వినిపించుకోకుండా "ఇది అర్ధాంతరపు చావు. అందునా ఉరేసుక

వచ్చింది. నేను రిపోర్టియ్యకపోతే ఈళ్ళంతా తుప్పక్కయ్యారని నా పీకకు పట్టుకుంటది!" అని పోలీస్ రిపోర్టిచ్చా.

సమాజంలో పెరిగిన అవినీతికి సామాన్యుడు బలైనట్టు నీలి ఆకాశం అక్కడక్కడా మేఘాలకు బలైపోయింది. ఈ అస్వస్థ వ్యవస్థలో ఎండిపోయిన సస్యశ్యామల మైదానాల్లా అక్కడక్కడా నక్షత్రాలు మెరిసీ మెరవలేక మూల్గుతున్నాయి. కాలచక్రం ఆగిపోలేదు. కాలపురుషుడు ఉరితీయబడలేదు.

సగటు మనిషి జీవితం నరకప్రాయం కావటానికి, దేశంలో అవినీతి నగ్నంగా నృత్యం చెయ్యటానికి "మేమెంతమాత్రం బాధ్యులం కాము" అనే ప్రభుత్వాధికారుల్లా... జరిగిన అన్యాయానికి, అక్రమానికి నాకేం సంబంధం లేదన్నట్లు తూర్పు దిక్కున సూర్యుడుదయించాడు.

ఎనిమిది గంటలకు ఓబులు ఇంటి ముందు పోలీస్ జీపు వొచ్చి ఆగింది. జీపులోంచి హుందాగా ఎర్రటి బూట్ల కాలొకటి నేల ఆనింది. ఆయన కాలు నేల ఆనటమే తడవుగా నలుగురు కానిస్టేబుల్స్ గబగబ దిగి నిలబడ్డారు. జీపు దిగిన పోలీసు ఇన్స్పెక్టర్ హుందాగా మీసాలు సవరించుకుంటూ చుట్టూ కలయచూశాడు. ఆయన చేతిలో నల్లగా నిగనిగ మెరుస్తున్న నల్లని లాఠీ. 'ఈ అసమానత మామూలే అసలు జీవితమంటే కొన్ని సమస్యల పోరాటం ఆరాటం మాత్రమే! చివరికంతా శూన్యం ..! అంతా మిథ్య!' అనే వేదాంతిలా ఉంది. పోలీసులను చూడగానే, పోగైన జనమంతా బిక్కుబిక్కుమంటూ వెనక్కి తగ్గారు.

పోలీస్ పటేల్ రామయ్య "శవం ఇక్కడ ఉంది, పిన్నిగారు!" అంటూ ఇనస్పెక్టర్‌కి దారి చూపాడు.

ఇనస్పెక్టర్ మామూలుగా... ఒక్కసారి (పల్లటూరు బాబట్టేమో!) శవంవంక ఓ చూపు పారేసి, కానిస్టేబుల్స్‌ని శవాన్ని కిందకు దించమన్నాడు. శవం కళ్ళు బయటికొచ్చి, నాలుక బయటికి వచ్చి, చూడటానికి అసహ్యంగా భయంకరంగా ఉంది! కొన్ని రోజుల తరువాత తులసీ అనుభూతి పొందిన నాగన్న అలా అస్తవ్యస్తంగా వుండటం చూసేటప్పటికి పెద్దిరెడ్డి ముక్కు మూసుకున్నాడు. మృతమైన ఆ శవంతో లేబర్ లక్షణాలు చూసి పెదవి విరిచాడు, అవినీతిని చుట్టుముట్టున్నట్టు ఫీలై తెల్లబోయాడు. కాని తనలోని తొట్రుపాటును ఇతరులు గమనించకుండా జాగ్రత్తపడ్డాడు.

ఇన్స్పెక్టర్ ఓబుల్ని దగ్గరకు పిలిచి "చూడు ఓబిగా.! నీకు శత్రువులెవరైనా ఉన్నారా ..?" అడిగాడు. శత్రువులు అన్న పదం అర్థం కాక ఓబులు మొఖం క్వశ్చన్ మార్కులా తయారైంది.

"శత్రువులంటే .....?"

"అదేరా .! నీకు పగోళ్ళెవరైనా ఉన్నారా ?" అడిగాడు ఇన్స్పెక్టర్.

ఆ ఊరికి పగోళ్ళు ఎవరున్నారండీ .? వాడి పనేదో వాడు చూసుకుంటాడే కాని ఇంకోళ్ళ గొడవ పట్టించుకోడు. మొద్దుమొహం ! ఇన్స్పెక్టర్ అననే అన్నాడన్నట్లు ఓబులు ప్రశ్నకు దొరికే సమాధానమిచ్చాడు!


ఇది విని ఇన్స్పెక్టర్ "నేను కొంపకేసి అడిగింది నిన్ను కాదు ఓబుల్ని" అని దొరగారితో నవ్వుతూ అన్నాడు. "ఆ .. హూ .!" అన్నాడు దొర జీపులో కూర్చుంటూ.

"నీకు నీ పెళ్ళాంకేమైనా పోట్లాటలున్నాయా ?"

"లేవు .!" ఈ సారి ఓబులు సమాధానమిచ్చాడు.

"నీ పెళ్ళాంకి ఎవరైనా అలాంటి యిగవాళ్ళున్నారా ..."

"అవేంటా ..! మిండగాళ్ళెవరైనా..?" ఇన్స్పెక్టర్ పదానికి అర్థం చెప్పాడు దొర.



ఓబులుని పెళ్లాం చచ్చిందానికన్నా యీ ప్రశ్నే ఎక్కువ బాధపెట్టింది. నాకు తెలిసినంతమటుకలాంటి దేమీలేదు ...! సమాధానమిచ్చాడు.

"అయినా అటువంటివి నీకు తెలిసేట్టు జరగడానికిదేమన్నా ద్రౌపదా ..?" వీధి భాగవతుల ద్వారా పురాణికి పుచ్చుకున్న, ద్రౌపదికి ఐదుగురు భర్తలని తెలుసుకున్న కొద్దిపాటి పాండిత్యాన్ని వెల్లడిస్తూ కామయ్య పటేల్ నవ్వాడు.

"శవం కొంగులో యీ కాగితం ముడేసుంది సార్ . !" కానిస్టేబుల్ నలిగిన కాగితాన్నొకదాన్ని తీసుకొచ్చి ఇన్స్పెక్టర్ చేతిలో పెట్టాడు.

కాగితం మీద తాటికాయంత అక్షరాలతో గజిబిజిగా ఏదో రాసి వుంది. ఇన్స్పెక్టర్ మెల్లిగా ఆ కాగితంలోని అక్షరాలను అర్థం చేసుకుంటూ పైకే చదవసాగాడు.

వింటున్న ఓబులు మొఖంలో రంగులు మారుతున్నాయి. పెద్దిరెడ్డి మొఖం కళ తప్పింది. పటేల్ ఆశ్చర్యపోయాడు. ఇన్స్పెక్టర్ మొఖం కళకు తిరిగింది.

"అద తా అబద్ధం .! సందకాడొంచి అర్ధరేత్తిరి దాకా దొరగారు - నేను మాట్లాడుకుంటూ బావిగట్టుమీద కూకున్నాం!" అరిచాడు ఓబులు.

ఆశ్చర్యపోవటం యీ సారి ఇన్స్పెక్టర్ వంతైంది " నువ్వు చెప్పింది నిజమేనా—?"

"అవునండి! సందకాడొంచి దొరగారు ... నేనూ - ఒకాడే కూచోని మాట్లాడుకున్నాం !"

పెద్దిరెడ్డి చూపులు—ఇన్స్పెక్టర్ చూపులు కలుసుకున్నాయ. కానిస్టేబుల్స్ మొఖాలు వెలిగాయి.

దొర సిగరెట్ వెలిగించాడు —

శవం బూడిదైంది !!!

పోలీసోళ్ళ జేబులు భారంగా మూల్గాయి. సీసాలు తెగాయి, గ్లాసులు పగిలాయి. దొర ఇల్లు పటేలు ఇల్లు ఆ రాత్రంతా కోలాహలంగా

ఉన్నై!

జీపు జదిలింది.

ఓబులు గడిసె మీద దిష్టి తగలకుండా వుంచిన కుండ మాత్రం మెరిసింది ఆ చీకట్లో!

○ ○ ○

పెళ్ళాం చావుతో కన్నీటి ముగ్గలైన ఓబులు కళ్ళు ... జీవిత పోరాటంలో కన్నీటి పూలు అయ్యాయి.

దాదాపు జనమంతా యీ సంఘటన గురించి మర్చిపోయారు. ఓబులు మామూలుగానే పనికి వెళ్తున్నాడు. ఓబులుపై దొరకెక్కడ లేని నమ్మకం పెరిగింది. ఎంతో ఆదరంగా చూడసాగాడు.

వరి నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. రాత్రి తొమ్మిది గంటలు కావచ్చింది. దొరకు అన్నం తీసుకొని బయల్దేరాడు ఓబులు. జేబు తడుముకున్నాడు. పదిరోజుల క్రితం వాడు పట్నం వెళ్లినప్పుడు తెచ్చిన పొట్లాం గట్టిగా తగిలింది.

అమావాస్య రోజులు. చుట్టూ కారుచీకటి. కీచురాళ్ళు రొద పెడుతున్నాయి. ఎక్కడో గుడ్లగూబ వికృతంగా అరిచింది. కోసిన వరిపొలాల గట్ల కష్టంపడి నడుస్తున్న ఓబులు ఆగి చుట్టూ పరికించాడు- చీకటి.

కారియర్ విప్పి- పొట్లాం చించి అందులో ఉన్న మందంతా అన్నంలో కలిపి, కారియర్ బిగించి నడక సాగించాడు.

దొర అప్పటికి బాగా ఆకలిగొని ఉండటంతో గబగబా అన్నం తిని సిగరెట్ వెలిగించాడు. ఓబులు ఖాళీ కారియర్ తీసుకెళ్ళి శుభ్రంగా కడుక్కొని వొచ్చేటప్పటికి దొర కింద పడి కొట్టుకుంటున్నాడు. నోటి నుంచి దొబ్బలు దొబ్బలుగా నురుగు.

ఓబులు కారియర్‌ని పారేసి, ఓ తుమ్మ ముల్లు తీసుకొచ్చి దొర కాలి పిక్కకి కొద్దిగా రక్తమొచ్చేలా రెండుచోట్ల గీరాడు. పక్కనున్న పగ్గం తీసి గీరిన కాలుకు బిగుతుగా కట్టి, చుట్టూ పొలాల్లో ఉన్న జీతగాళ్ళని "దొరగోర్ని పాము కరిసింది...తొందరగా రండహో" అని కేకలేసాడు. వాళ్ళంతా పరుగెత్తుకొచ్చారు.

దొర కొట్టుకుంటూనే ఉన్నాడు!

అంతా దొరను మోసుకొచ్చి ఇంటిముందు వసారాలో పడుకోబెట్టారు. దొరసాని "ఏం జరిగింది?" ఏడుస్తూ అడిగింది. జీతగాళ్ళు ఓబులువంక చూశారు.

"దొరగారు నేన్దీసుకెళ్ళిన బువ్వ తిన్నారండి. దొరగారు తిన్నాక నేను క్యారేజి తీసుకెళ్ళి బాయిల కడుక్కొచ్చేటప్పటికి కింద వడి కొట్టుకుంటున్నారు, కొద్దిగ తెప్పరిల్లి, కాలుమడుపుకెళ్ళి పామును దొక్కేటప్పటికి పాము కరిసిందని కాలు సూపెట్టిండు గంతల్నె ఒంపొచ్చి మల్ల కిందపడి కొట్టుకుంటుంటె ఇసం ఎక్కకుంట కాలికి పగ్గం కట్టి ఈళ్ళని బిల్చి మోసుకొచ్చిన. అంతా లాంతర పెట్టి కాలివేపు చూసారు పాము కాటుకొట్టొచ్చినట్లు కనబడింది. ఊరు ఊరంతా దొర ఇంటి ముందు కొచ్చింది. ఇది తెలిసి కామయ్య పటేల్ పరుగెత్తుకుంటూ ఒచ్చాడు. ఒచ్చిన వెంటనే పక్కఊళ్ళో ఉన్న పాము మంత్రగాడి కోసం జీతగాళ్ళని తరిమాడు.


దొర పొర్లుతూనే వున్నాడు - నురగలు కక్కుతూనే వున్నాడు

పక్క ఊళ్ళో వున్న పేరు మోసిన పాము మంత్రగాడు రంగనాయకులుకు కబురందిన వెంటనే ఆఘమేఘాల మీద వచ్చాడు. పాము కరిచింది మామూలు మనిషికి కాదు. దొరగారు!

రంగనాయకులు వేప దుంపలు పట్టుకొని విషం విరుగుడికి మంత్రం మీద మంత్రం వేస్తున్నాడు.

దొర పొర్లుతూ .... నురగలు కక్కుతూనే వున్నాడు.

అందరి మొఖాల్లోనూ ఆత్రుత ... !



రంగనాయకులు మొఖం నిండా స్వేదం ...!

దొర నోటి వెంట రక్తం ...!!

"నా జీవితంలో యింత పెద్ద ఒాపు సూళ్ళేదు". రంగనాయకులు చివరి మంత్రం పెడ్తూ అన్నాడు.

మంత్రం పూర్తవకుండానే దొర నోరు తెరచినట్టే వుండిపోయింది. తూర్పున ... తెలతెల వారుతుండగా ఆ ఇంట్లో శోకాలు మొదలయ్యాయి.

మధ్యాహ్నం వరల్లా దొర బలగమంతా అంత్యక్రియలకు హాజరయ్యారు. పటేల్ ఆధ్వర్యంలో దొర శవం వల్లకాటికి జేరింది. పాడెను స్వయంగా ఒక పక్క మోశాడు ఓబులు.

చిన్న దినం - పెద్ద దినం అయిపోయింది ఆ పదిహేను రోజులు ఇంట్లో వారికి తలలో నాలికలా మెలిగాడు. అటువంటి జీతగాడు తమకు లేనందుకు విచారపడ్డారు ఒచ్చినాళ్లంతా కామయ్య పటేలుతో సహా!

కొత్త అందాలు సంతరించుకుంటున్న ఆ పల్లెటూరిపై ఉషోదయం నిండుగా కనిపించింది. ఆ ఉషోదయాన ఉదయార్కుని కెదురుగా మరో ప్రస్థానపు దూతలా నడవసాగాడు ఓబులు. ఓబులు కళ్ళు సూర్యుని ఎర్రని కిరణాలను ప్రతిఫలిస్తూ మాంసపు ముద్దల్లా మెరవసాగాయి.

అతని మనస్సులో ఆరోజు కందిచేలో జరిగిన సంఘటనతోపాటు- ఇనస్పెక్టర్ చదివిన ఉత్తరం గుర్తుకొచ్చింది. "సందేళ కంది చేల దొర నన్నన్యాయం సేసిండు. బలొంతంగ సెరిసిండు. పానమిచ్చే మావ నొదిలి ఎల్లిపోతున్న! నా మావ మొగోడైతే దొరను పూడ్చిపెట్టాలె! గదే నా కడపటి కోర్క!" ✻

సినేమా కత!

గుడిమెట్ల గోపాలకృష్ణ

మినీ కథ

ఒకేసారి మూడు సినిమాలు తీద్దామనుకున్న నిర్మాత శ్రీ సినిమావాళ్ళ గారికి అతనికి తెలిసిన డాక్టర్ తొమిద ఈక్వేషన్ కర్ర్ సినిమా తయారైన ప్లైనం కావల్సినవి కథా కమామీషూ:

ఒకే అందమైన చిన్న పాప: బీద. మిడిల్. హైక్లాసు మూడు రకాల బట్టలు. ఒకే మేకప్‌మేన్ పాపకి పైమూడు తరగతులను బట్టి హెయిర్‌స్టైల్స్ మారుతాయి

పాపకి తల్లి, తండ్రి: బీద, మిడిల్, హైక్లాసు బూట్లు సూట్లు, చెప్పులు. లైటు, కిలాలు కార్లు. సైకిళ్లు సెంటిమెంట్లు, వగైరా.

అందమైన హీరోయిన్: మూడు సినిమాలకు ఒకే మేకప్, ఒకే డ్రస్సు, అయితే ఒక సినిమాలో మేక, మరో సినిమాలో బొచ్చు కుక్క, మరో సినిమాలో పిల్లిహీరోయిన్ క్లోజ్ ఫ్రెండ్స్. సినిమాలో క్లోజ్ చేయిసాఫుండే ఎంతో మంచి ఫ్రెండ్‌గా తమ మేకల, కుక్కల పిల్లల ఫోటోలతో అప్లయి చేశారు.

హీరో: బీద, మిడిల్. హైక్లాసు ఇక్కడ నిర్మాత ఖర్చు తక్కువ కావాలని ఒకే టైపు మేకప్‌తో అన్ని సినిమాల్నీ లాగించేశాడు.

లొకేషన్స్: మూడు ముచ్చటైన ఆంధ్ర పల్లెటూళ్లు

మూడు కథలు:

హీరోయిన్‌కి కథతో సంబంధం:

1. పెళ్ళికాకుండా హీరోయిన్‌కి ప్రెగ్నెన్సీ
2. పెళ్ళయ్యాక ప్రెగ్నెన్సీ.
3. పెళ్ళికాదు. (పిల్లల్ని పెంచుకోవాలని వుంటుంది)

హీరో కథ:

1. ఉద్యోగం దొరకక వ్యాపారం చేస్తాడు యూనియన్ లీడరు. కష్టపడి పేరు సంపాదిస్తాడు. పై హీరోయిన్స్‌లో నచ్చిన హీరోయిన్ బట్టి కథ ట్విస్టు.
2. జనరల్ మేనేజరు: కార్లు, షికార్లు, గర్ల్ ఫ్రెండ్స్ (ఎక్స్ట్రా బోల్డింటిమేట్ అతి దౌలో వాయకుతారు) డ్యూయెట్లు. రెండవాళ్లు స్టెప్స్ తర్వాతి దేవదాసు... పై హీరోయిన్స్‌లో నచ్చిన హీరోయిన్ కథనుబట్టి హీరో కథలో "ట్విస్టు".
3. అందాలు అనుభవించి అనుభవాలు గడించి లైఫ్, ఫిలాసఫీ అన్నీ అయిపోయి జీవితాన్ని ఎంతో డీప్‌గా స్టడీ చేసి సంసారాన్ని మారమని ఎడ్వయిజ్ ఇచ్చేసి సినిమా అయిపోయిందో లేదో తెలీని సస్పెన్స్‌తో ముగింపు...ఏమిది లేక పది రీళ్ళు చాలు


పరా: పై హీరో, హీరోయిన్స్‌ల మేటింగ్ నిర్మాత ఇష్టం.

భాషలు: తెలుగు, తమిళ, కన్నడ భాషలొచ్చిన వాళ్ళే అందరూ కావటాన (అనుకున్న) మూడు సినిమాలు, తయారైనా తొమ్మిది రచయిత, డైరెక్టరు లేరు. మినిమమ్ బడ్జెట్ కాబట్టి రచయిత పుర్నా లేనట్లే ప్రకటించి నిర్మాత, రచయిత డైరెక్టరు ఒకడే అయిపోయేశా.

క్లబ్ డ్యాన్సరు: చమక్ చమక్ డాన్సరు ఒక్కర్తే $3 \times 3 \times 3 = 27$. సెక్స్ అడ్ స్లేంగ్ సాంగ్స్‌కి కాంటాక్టు తీసుకుంది

నిర్మాత ఎవరికీ చెప్పని నిజం: ఆంధ్ర దేశంలో వేలం వెర్రిగ సినిమాకోసం అన్ని వయసులవాళ్ళూ పిచ్చి కళ్ళతో ఎదురు చూస్తున్న తరుణంలో కొత్తవాళ్ళను ప్రోత్సహించినట్టు ఉంది, డబ్బు ఇవ్వక్కర్లేదని సినిమాలు తీసి తన బ్యాంకు బేలెన్సు ఇంప్రూవ్ చేసుకున్నాడు శ్రీ సినిమావాలా.

సినిమాకథ నీతి: ఒకేసారి ఇన్ని సినిమాలు తీసి రిలీజ్ చేస్తున్న శ్రీ సినిమావాళ్ళ లాంటివారి సినిమాలు చూసి ఒకేసారి మీ ఒళ్లు, పర్సు, గుల్ల చేసుకోవద్దు.



చేతవెన్నముద్ద

— వాకాటి

ఆలిచిప్పలు ఎన్నో వుంటాయి
అందులో కొన్నే ముత్యాలను కంటాయి.
పురుషులు కోట్ల కొలది వుంటారు
వారిలో పురుషోత్తములుగా కొందరే —
అవుతారు.

మానవజాతి, నడిచి వచ్చిన చరిత్ర దారులన్నిటిని చదివితే — ఆయా కాలాలలో - అప్పటి - అవసరాలనుబట్టి మహానుభావులు అవతరించి తమ కర్తవ్యం నిర్వర్తించి, తమ ముందు తరాలకు కొంతమేర దారి నిర్మించి, వెలుగు చూపించి అంతర్ధానం అవుతారేమో నన్పిస్తుంది.

ఈ యదార్థాన్నే - "ధర్మానికి ఆటంకం ఏర్పడినపుడల్లా నన్ను నేను సృజించుకుంటాను." అన్న గీత వాక్యంగా చెప్పి వుంటారని అర్థం చేసుకోవచ్చు.

ఆ విధంగా వివిధ యుగాలలో అవతార మెత్తిన పురుషోత్తములందరూ మనందరి లాగానే వుంటూనే మనకన్న భిన్నంగా వుంటారు. మనందరి మధ్య వర్తమానంలో మసలుతూనే భవిష్యత్తును స్పష్టంగా చూడగల్గుతారు: మనకు గందరగోళంగా అన్పించే పరిస్థితుల కారు మబ్బులను వారి ఆలోచనతో, దృష్టితో, మందలింపుతో, ఆదర్శంతో పటాపంచలు చేసి వెలుగు బాటలువేసి పెడతారా మేలి రకపు మేస్త్రీలు.

వారి జీవితాల చీకటి వెలుగులు వారి వ్యక్తిత్వంలోని ఇంద్రధనస్సులు. వారి మాటలు, చేతలు - పరిశీలిస్తే 'మనలాటి మానవ మాత్రులేనా వీరు?' అన్న ఆశ్చర్యం కల్గుతుంది.

o o o

అప్పట్లో అక్కడి న్యాయస్థానానికి భవంతి అంటూ ఏదీ లేదు. కర్రచెక్కలతో నిర్మించిన 'షెడ్' లాటిదే న్యాయస్థానం. అక్కడికి న్యాయమూర్తి, ఆయన వెనకాలే లాయర్లూ వాళ్లూ గుర్రాలమీద వచ్చేవారు.

ఒకరోజు దారిమధ్యలో ఒక చెట్టునీడను కాస్సేపు ఆగారు వాళ్ళు. 'అతడు' కనపడలేదు. "ఏడీ మనవాడు?" అని కలవరపడ్డారు.

అమెరికా రెండుముక్కలు కాకుండా కాపాడి, కోట్లాది నీగ్రో బానిసలకు విముక్తి కలిగించిన అబ్రహాం లింకన్

ఆ దారివెంబడి వస్తున్న ఒక దానయ్యకు "మనవాడి" ఆనవాళ్ళన్నీ చెప్పి-అడిగితే ఆ దానయ్య చెప్పాడు : "ఓ... ఆయనా? ఇందాక పెద్ద గాలి వీచినప్పుడు ఆ వేగానికి కొన్ని పక్షిపిల్లలు గూళ్ళలోంచి క్రింద పడ్డాయి. ఆ పక్షిపిల్లలన్నిటిని జాగ్రత్తగా సేకరించి, దువ్వి, ఏపిల్ల ఏగూటిదా అని చెట్టు, చెట్టూ ఎక్కి వాటిని గూళ్ళల్లోకి చేర్చే ప్రయత్నంలో వున్నాడు. ఈలోగా రాత్రి అయినా సరే, కోర్టు అయిపోయినా సరే, ఆ పనంతా పూర్తయితేగాని ఆయన కదిలి వచ్చేటట్లు లేడు!" అని వివరించాడు.

-ఆ పక్షికూనల రక్షకుడే ఒక కొత్త వూళ్లో దుకాణంలో పనికి కుదిరాడు. అతడి వినయం, విజ్ఞానం, ధైర్యం, సాహసం ఆ వూరివారందరినీ ఆకట్టుకున్నాయి. కాని ఈ కొత్తవాడింతలా జనుల మెప్పుదలకు పాత్రుడవడం గిట్టని ఆ వూరి ఆకతాయిలు కొంచ రతడికి 'తగిన శిక్ష' విధించాలనుకున్నారు. వారి నాయకుడయిన పెద్ద రౌడీతోసహా బయలుదేరి దుకాణం దగ్గరకు వెళ్ళారు.

"ఓయ్ హీరో! నిజంగా నువ్వు మగాడివే అయితే మా నాయకుడితో కుస్తీకి రావాలి. సిద్ధమేనా?" అని సవాలు చేశారు.


అతడు 'సరే' నన్నాడు.

కుస్తీలో తాను ఓడిపోతున్నానని తెలుసుకున్న జట్టు నాయకుడు ఒక అభ్యంతరమైన 'పట్టు'కోసం పెనుగులాడసాగాడు. వెంటనే 'అతడు' తన పట్టువదిలేసి, అమాంతం ఆ దుష్టుడి మెడ పట్టుకొని గాలిలోకి పైకెత్తి, బొమ్మలా ఇటూ అటూ ఊగించి క్రిందకు విసిరి వేశాడు. తమ నాయకుడు క్రిందపడడం చూచిన ఆ జట్టువారందరూ కలిసి 'అతడి' మీదికి లంఘించనుండగా వారి నాయకుడు లేచి నిలబడి వారిని వారించాడు: "ఆగండి, ఈ చుట్టుప్రక్కల్లో యింతకన్న గొప్పవాడు లేడు". అని 'అతడి'తో తన చేతులు కలిపాడు. ఆనాటినుండి వారిద్దరూ గాఢమిత్రులయ్యారు.

— ఆ విధంగా పక్షికూనలను రక్షించిన కుసుమ కోమలమైన ఆర్ద్రతా, అవసరం వచ్చినప్పుడు దుష్టుడిని తగిన విధంగా శిక్షించ గల వజ్ర సమానమైన కాఠిన్యతా మేళవించిన మహామనిషి పేరే అబ్రహాం లింకన్!

మన దేశానికి బానిసత్వం నుంచి విముక్తి ప్రసాదించిన మహాత్మాగాంధీ దేశం రెండు ముక్కలు కాకుండా ఆపలేకపోయాడు. కాని అమెరికా దేశం రెండు ముక్కలు కాకుండా చేసి, అక్కడి కోట్లాది నీగ్రో బానిసలకు స్వాతంత్ర్యం ప్రసాదించిన మహానుభావుడు అబ్రహాంలింకన్!

1809 ఫిబ్రవరి 12 న పేదరికంలో పుట్టిన అబ్రహాం తండ్రి నిరక్షరకుక్షి: తల్లి చదవ నేర్చినది. ఆమె చదివిన పుస్తకాలన్నీ తానూ చదివేవాడు. ఇతరుల నుండి బ్రతిమిలాడి, అరువుతెచ్చుకుని చదివేవాడు. పగలల్లా కట్టెలు కొట్టడంలోనో, పశువులు వేటాడ్డంలో తల్లికి సాయంలోనో గడిచి పోతుంది: అందుచేత రాత్రిళ్ల చదవవలసి వచ్చేది. కాని కొవ్వొత్తి కొనగల స్తోమత ఆ కుటుంబానికి లేదు. అందుచేత రాత్రి అందరూ పడుకున్నాక చలి మంటల కుంపటిలో మండే కర్రల వెలుతురులో చదువుకునే వాడు అబ్రహాంలింకన్!... మరి ఈనాడు దీపాలు, అందులో విద్యుద్దీపాలు, గది, ఆహారం, పుస్తకాలు - అన్ని సమకూర్చి పెడితే, పుస్తకాలక్కడ పారేసి, చిత్త మొచ్చినదల్లా అరిచి సాధించడానికి, బస్సులు తగల పెట్టడానికి "విద్యార్థులు" ('డిగ్రీయార్థులు' - అన్నది ఆదర్శ సమాసం కాకపోయినా నిజానికి దగ్గరవుతుందేమో!) రోడ్డుమీదకు వెళ్ళిపోవడానికి సిద్ధమవుతున్నారే ... ఎక్కడ వుంది వైరస్? మనిషి కష్టపడి సాధించడంలో వున్న 'థ్రిల్' సులభంగా దొరికే దానిలో లేనందునా? "సెక్యూరిటీ", "ప్రేమ" వంటి పేర్లతో, రిజర్వేషన్లు. డొనేషన్లు, గైడ్లు, ఓపెన్‌బుక్ సిస్టమ్ - వంటి వాటితో అన్నీ సులభాతి సులభంగా చేసెయ్యగా శ్రమపడడానికి, సాధించడానికి ఏమీలేక, ఉప్పొంగే యువశక్తికి వేరే దారి లేక ఇట్లా విరుచుకుపడి వృధా అవుతోందా? మనం నూటికి నూరు



పాళ్లు మేలు చేస్తున్నామనే అంటారా? ఏమో!

ఒకసారి అబ్రహాం లింకన్ "వాషింగ్‌టన్ చరిత్ర" అన్న పుస్తకాన్ని పొరుగింటాయన నుండి తెచ్చుకుని చదవసాగాడు. రాత్రిళ్ల చదవగానే ఆ పుస్తకాన్ని తలదిండుకింద దాచుకునేవాడు. ఒకనాటిరాత్రి పెద్దతుఫాను వర్షం వచ్చి కప్పులోంచి నీళ్ళు కారసాగాయి. పడకలతోసహా అన్నీ తడవగా ఆ పుస్తకం కూడా తడిసి కొంత పాడయింది. మరునాడు అబ్రహాం బాధపడుతూ ఆ పొరుగాయన వద్దకు వెళ్ళి పుస్తకం పాడుచేసినందుకు తానేమి పరిహారం చెల్లించాలి-అని అడిగాడు. "మూడు రోజులపాటు తన కళ్ళంలో ధాన్యం నూర్చమన్నాడు" ఆయన. అప్పుడు-"ఆ పని పుస్తకం ధరకు సరిపోతుందా లేక పాడయినందుకు నష్టపరిహారం మాత్రమేనా?" అని అడిగాడు అబ్రహాం. అందుకతడు నవ్వి-ఇంకో మూడు రోజులు అదనంగా పని చేస్తే ఆ పుస్తకం నీదవుతుంది-" అన్నాడు. ఈ వ్యవహార దక్షతే క్లిష్టదశలో వున్న జాతిని రక్షించడానికి మూలకారణం అయింది.

వ్యాపారస్తుల దగ్గర ఉద్యోగానికి కుదిరి, ఆ పనిమీద దేశమంతటా తిరుగుతుండగా అబ్రహాం లింకన్ వివిధ ప్రాంతాలలో వున్న అమానుషమైన బానిసత్వపు విధానాలను చూచి చలించిపోయాడు. న్యూ ఆర్లియన్స్ రాష్ట్రంలో ఆడ బానిసలను కొరడాలతో కొట్టడం చూచి అతడికి రోత, ఆగ్రహం కలిగాయి. 1832 లో రాజకీయాలలోకి ప్రవేశించాడు. శాసనసభ ఎన్నికల్లో మొదట ఓడినా, రెండేళ్ళ తర్వాత న్యాయసలేంతో గెలిచాడు. పోస్టుమాస్టరుగా, లాయరుగా తన జీవనం సాగిస్తూనే రాజకీయాలలో తన బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చాడు. 1847లో కాంగ్రెసులో సభ్యుడయ్యాడు. మేరీ టాడ్‌ను పెళ్లాడాడు.

ఆ సరికే దేశంలో బానిసత్వం వుండాలనే వాళ్లంతా ఐకమత్యంగా బలంగా ఒక పార్టీగా వున్నారు కాని ఆ అనాగరికమైన విధానం విస్తరించరాదని కోరే రాష్ట్రాలు ఎన్నివున్నా, ఆ ప్రజలంతా సరయిన నాయకత్వం లేక చెల్లాచెదరుగా వుండగా వారందరినీ ఏకోన్ముఖులుగా చేసి, రిపబ్లికన్ పార్టీని స్థాపించిన మూలపురుషుడు అబ్రహాం లింకన్.

1858 లో డెమొక్రటిక్ పార్టీ తరఫున సెనెట్‌కు తన పాత విరోధి డగ్లస్ నిలబడగా లింకన్ అతడిని ఓడించాడు. తన పార్టీతరఫున

1860 లో అధ్యక్ష పదవికి ఎవరు పోటీ చేయాలోనని నిర్ణయించడానికి సమావేశమయిన సభలో అబ్రహాం లింకన్ ప్రసంగం విన్న ఒకరు ఇలా వర్ణించారు.

"లింకన్ మాట్లాడడానికి లేచి నిలబడ్డాడు. వికారంగా పొడుగ్గా వున్న ఆకారం, నలిగిపోయి వదులుగా వున్న బట్టలు, చేతులు విదిలిస్తూ మొదలుపెట్టిన తీరు చూస్తే అబ్బే.... "ఇతడు లాభంలేదు" అనుకున్నాను. కాని అతడు అసలు విషయంలోకి ప్రవేశించేసరికి అతని మొహంలో ఒక దివ్యతేజం వెలుగసాగింది. అతడిలో అంతర్లీనమైన చైతన్యం మాటల రూపంలో వెలువడుతుంటే అతడి ఆకారం, బట్టలు అన్నీ మరిచిపోయాను. నేనూ ఆ వేలాదిమందితో పాటు అరిచాను, చప్పట్లు కొట్టాను, హర్షాతిశయంతో ఒళ్లు మరిచాను."

ఆ తర్వాత 1860 జూన్ 17 న అధ్యక్ష పదవికి రిపబ్లికన్ అభ్యర్థిగా లింకన్ ఎన్నికయ్యాడు. అతడు తన వూళ్ళో మిత్రులతో మాట్లాడుతుండగా ఈ శుభ వార్త వచ్చింది. వెంటనే మిత్రులతో కరచాలనం చేసి, లేచి నిల్చుని — "ఎనిమిదో నెంబరు వీధిలో వున్న ఒక ఇల్లాలికి యీ కబురు చెప్పాలి —" అని తన ఇంటికి వెళ్ళాడట! — మన మగవాళ్ళల్లో సగం మందికి టూర్ మీద వెళ్ళితే భార్యకో కార్డుముక్క రాయడానికి తీరిక వుండదు!

అతడు అధ్యక్షుడుగా ఎన్నికవగానే, బానిసత్వాన్ని సమర్థించే దక్షిణ రాష్ట్రాలు తాము దేశం నుండి విడిపోతున్నామని ప్రకటించి యుద్ధానికి దిగాయి. అయినా స్థైర్యం కోల్పోక అబ్రహాం లింకన్ — "క్షణికోద్రేకం మన బాంధవ్యం మీద బరువు మోపిందే కాని మనం శత్రువులం కాము —" అని స్పష్టంగా చెప్పాడు. చెప్పినా యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. అయినా అవతలి వారు మొదటి దెబ్బ తీసేదాక తాను రంగంలోకి దిగలేదు. యుద్ధం మొదలయ్యాక అనేక పరాజయాలు పొందినా —" ఈ అమెరికన్ యూనియన్ ఐక్యత కాపాడి తీరుతాను —" అని దీక్షా కంకణం ధరించి, తన వారందరికీ వెలుగు దీపమై నిలిచి అంతిమ విజయం సాధించాడు అబ్రహాం లింకన్.

1862 సెప్టెంబర్ 22 న అమెరికాలో వున్న బానిస లందరికీ స్వేచ్ఛ ప్రకటించడంతో అబ్రహాం లింకన్ కన్న కల నిజమైంది. 1865 ఏప్రిల్ 7 న శత్రు పక్షపు సైన్యాలు శరణు వేడడంతో అంతర్యుద్ధం ముగిసి అమెరికా ఒక్క దేశంగా నిల్చింది. అమెరికాకు రెండవ సారి అధ్యక్షుడిగా ఎన్నికయిన లింకన్ ఏప్రిలు 14 న తన గౌరవార్థం ఏర్పాటయిన ఒక నాటకానికి వెళ్లాడు. అక్కడ జాన్ విల్క్స్ బూత్ అన్న హంతకుడు పేల్చిన తుపాకిగుండ్లు మెదడులోకి దూసుకుపోగా తక్షణం కూలింది వటవృక్షం! అసాధారణ జీవితాలకు బహుశ అంతం కూడా అసాధారణంగా వుండాలన్న జగన్నాటక సూత్రం ఏదయినా వుంది కాబోలు!


తను కాపాడిన దేశం ఒడ్డుకు చేరగా, ఆ కాపాడిన నాయకుడు నేలకూలడాన్ని అమెరికన్ కవి వాల్ట్ విట్మన్ హృదయవిదారకంగా చిత్రించాడు.

"ఓ కేప్టెన్! నా కేప్టెన్!
తుపానులు దాటి ఓడ రేవును
సమీపించింది
అదుగో గంటలు మోగుతున్నాయి
ఒడ్డుమీద జనం ఆనందంలో
తేలియాడుతున్నారు
కాని ఓడ డెక్ మీద
నా కేప్టెన్ చల్లగా చచ్చిపడి వున్నాడు!
-లే కెప్టేన్! నిద్రలే!
నీకోసమే ఆ పాట
ఆ కేక, ఆ చప్పట్లు
అన్నీ నీకోసమే!
ఊహు!
నౌక రేవుకు
సురక్షితంగా చేరింది
అయినా
నా కేప్టన్ పలకడంలేదు!"

పదేళ్ల కఠిన శిక్ష తరువాత గదాధర్‌ని జైలు నించి విడుదల చెయ్యమని ఆర్డరు వచ్చిన ఆ రోజు అతనికి సుప్రభాతమో, కుప్రభాతమో చెప్పడం కష్టం. పైవాళ్ళయితే బహుశా" పాపం యిప్పటి వాడి కష్టాలు తీరాయి. పదేళ్ల జైలులో మగ్గి మగ్గి యిన్నాళ్ళకి వాడికి విముక్తి లభించింది. వాడికివాళ తప్పకుండా సుప్రభాతమే అయివుండాలి, వాడి సంతోషానికి పట్టపగ్గాలుండవు "అని అనుకుంటారు - కాని ఏది? ఎక్కడా గదాధర్ మొహంలో సంతోషపు ఛాయలు కనపడ్డంలేదే? వాడి మొహం శ్రావణ మేఘపు ఆకాశంలా విషాదంతో నిండి వుంది. జైలు మెయిన్ గేటు దాటగానే వాడి కళ్ళ నించి అశ్రువులు టపటపా జారిపోసాగాయి. అత్యంత ప్రియమైన వస్తువేదో వదిలి వెడ్తున్నట్టు, ఏదో-పోగొట్టుకున్నట్టు అనిపించసాగింది. ఒక రోజు, ఒక నెలా, ఒక సంవత్సరమూ - పదేళ్ళు యీజైలు ఆవరణలో గడిపాడు. వచ్చిన కొత్తలో 'ఎప్పుడు విడుదలయి మామూలు ప్రపంచంలోకి మళ్ళీ అడుగు పెడతానా అని ఆరాటంగా రోజులు లెక్కపెట్టుకునేవాడు. కాని కొన్ని రోజులు జైలులో వుండే సరికి ఆ ఆలోచనలు రూపు మార్చుకున్నాయి. ఇది ఒక వింత ప్రపంచం. దీన్లో నేనో మనిషిని, వీళ్ళంతా నా వాళ్ళు అన్న ఆలోచనలు క్రమంగా చోటు చేసుకున్నాయి. వచ్చిన కొద్ది రోజులకే మంచి ఖైదీ అన్న పేరు తెచ్చుకుని అందరి ఆదరణకి పాత్రుడయ్యాడు. అతని ప్రవర్తన చూసి అతనో హంతకుడు అంటే ఎవరూ నమ్మలేక పోయారు.

జైల్లో గదాధర్ మంచి ప్రవర్తన చూసి జైలు సూపరింటెండెంట్ వాడ్ని "కనవిక్ట్ వార్డర్"ని చేశాడు ఎనిమిదేళ్ళ క్రితం. ఆ పదవిలోకి వచ్చిన తరువాత వాడికి రాళ్ళు కొట్టడం బియ్యం దంచడం లాంటి కష్టమైన పనులు చేసే అవసరం లేక పోయింది. అప్పటి నించి మిగతా ఖైదీల మీద అజమాయిషీ చేసే వాడు. ఈ పదేళ్ళల్లో చిన్న, పెద్ద నేరాలు చేసి ఎందరో జైలుకి వచ్చారు. ఎంతో మంది విడుదల అయ్యారు. ఓ కొత్త ఖైదీ జైలుకి వచ్చినా, ఓ పాత ఖైదీవిడుదలఅయి బయటకి వెడుతున్నా వాడిమనసు ఓ క్షణం బైటకివెళ్ళడానికి ఊగిసలాడేది. కాని వెంటనే తన మనసులోని బలహీనతని లోపలికి నెట్టేసి మళ్ళీ పనిలో నిమగ్నుడయి పోయేవాడు - సాయంత్రం అయ్యేసరికి ఒకటి, రెండు అంటూ ఖైదీల్ని లెక్క పెట్టడం ఆరంభించేవాడు. చారల చొక్కా - ప్యాంటుతో, బుర్ర మీద నీలం టోపీతో జైలు ఆవరణలో బొంగరంలా అన్నింట్లో తనే అయి తిరిగే వాడు.


కనవిక్ట్ వార్డర్ పదవికి వచ్చినా గదాధర్ మిగతా ఖైదీల్ని స్వంత అన్నదమ్ముల మాదిరి



జైలుపక్షి

ఒరియా: అనంత ప్రసాద్ పండా

తెలుగు: డి. కామేశ్వరి; డి. శైలజ



చూసేవాడు. ఎవరిమీదా ఎప్పుడూ అధికారం కాని, జులుంకాని చెలాయించలేదు. ఎవరినీ చెయ్యెత్తివేవాడుకూడాకాదు. ఎవరైనా కొత్త ఖైదీ తనవాళ్లని ఎవరినో తల్చుకొని కుమిలిపోతూంటే వాడ్ని దగ్గిరకి తీసుకుని "ఏడవకు. అన్నాళ్లు అంతే ఎంతసేపు గడిచిపోతాయి, కళ్ళుమూసుకు తెరిచేలోగా గడుస్తాయి. మళ్ళీ మీవాళ్ళతో కల్సి సుఖంగా వుంటావులే, మళ్ళీ దొంగతనం అదీ చెయ్యకు' అంటూ సముదాయించేవాడు. అలా సముదాయిస్తున్నప్పుడు వాడి మనసు బాధతో మూలిగేది! తనకు ఎవరున్నారు?

తల్లి. తండ్రి చిన్నప్పుడే పోయినా, దేవతల్లాంటి అన్న, వదిన తనకి వుండేవారు కొన్నేళ్ళక్రిందట అప్పుడు చేపలు పట్టడం తనకి వృత్తిగా వుండేది. చేపలు పడుతూ కూర్చుంటే తనకిక వళ్లు పై తెలిసేదికాదు. కాని....తనకి అత్యంత ప్రియమైన చేపలుపట్టే గాలం తన దురదృష్టానికి దారితీస్తుందని ఎన్నడూ అనుకోలేదు. తన వూరి మధ్యలో పెద్ద చెరువు వుండేది. దానిచుట్టూ పెద్ద పెద్ద మర్రిచెట్లు, తాటిచెట్లు వుండేవి. మర్రిచెట్ల ఊడలు ఆచోటంతా ఆక్రమించుకుని ఆ చోటంతా చీకటిగా వుండేది. ఒక మూల కూర్చుంటే ఇంకోవైపు కన్పించేదికాదు. అలాంటిచోట ఏకాంతంగా కూర్చుని చేపలు పట్టేవాడు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం ఒక పొద


లాంటి జాగాలో కూర్చుని గేలాన్ని నీళ్ళలో వేసి చేప ఎప్పుడు తగులుకుంటుందా అని ఎదురుచూస్తూ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అపుడు హఠాత్తుగా అవతలివైపు ఏదో గలభా వినపడింది. చెట్ల సందునించి చూస్తే, ఆవూరి రామ్‌ప్రధాన్ కొడుకు గోకుల్ కమల అనే ఒక అమ్మునింటి పిల్లని చెరచడానికి ప్రయత్నిస్తున్నాడు. కమల అతడి బారినించి తప్పించుకోడానికి గింజుకుంటూ అరుస్తూంది. ఇది చూసి గదాధర్ రక్తం సలసలా కాగిపోయింది. యింకేమి ఆలోచించకుండా ఆ చేపలు పట్టే కర్రపట్టుకు పరుగెత్తి గోకుల్ బుర్రమీద శక్తికొద్దీ బాదాడు. సన్నగా, రివటలాగ వుండే గోకుల్ ఒక్కదెబ్బకే చావుకేక పెట్టి నేలకూలాడు. గాలానికున్న యినప కొక్కెం అతని మొహాన్ని చీల్చింది. రక్తం వరదలయింది. ఆ కేకలకు చుట్టుపక్కల పొలాల్లోవాళ్ళు పరిగెత్తి వచ్చారు. గోకుల్‌ని అంతా వచ్చి పదిమైళ్ళ దూరంలో వున్న ఆస్పత్రికి బండి మీద మోసుకెళ్లారు. రక్తం చాలా పోయి, డాక్టరు ఎంత ప్రయత్నించినా నాల్గు రోజుల కంటే బతక లేదు. రామ్ ప్రధాన్ గదాధర్ మీద హత్యా నేరానికి కేసు ఫైలు చేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గదాధర్‌ని దోషిగా నిరూపించడానికి పసందైన కథ అల్లాడు. దాని ప్రకారం, ఆ వూరి హరిరౌత్ రాయ్ కూతురు కమల నీటి కోసం చెరువుకి వెళ్ళినపుడు, అక్కడే వున్న గదాధర్ ఆ అమ్మాయిని మానభంగం చెయ్యడానికి ప్రయత్నించాడు. అప్పుడు అటు వెడుతున్నగోకుల్ ప్రధాన్ అడ్డుపడ్డాడు. అపుడు గదాధర్ గోకుల్ బుర్ర తన దగ్గిర వున్న కర్రతో బద్దలుకొట్టి చంపాడు. బోనులో స్థాణువులా నించుని తన మీద వేసిన అభియోగాన్ని మౌనంగా విన్నాడు గదాధర్. ఆఖరికి పోలీసులు, ఆ ప్రకారం కమల కూడా ఎప్పుడయితే ఆ కథనాన్ని సమర్థించిందో గదాధర్‌కి లోకం అంతా చీకటిగా కన్పించిది. చుట్టూ వున్న అందరిని ముక్కలు ముక్కలుగా నరకాలనిపించింది. కాని ఏమీ చెయ్యలేకపోయాడు. బాహ్య జ్ఞానం లోపించిన వాడిలా ఆలోచిస్తూ నిలబడ్డాడు. జడ్జీగారు అడిగిన ప్రశ్నకి నేను దోషిని కాను అన్నట్టు బుర్రవూపాడు తప్ప నోట్లోంచి మాటరాలేదు. ఆఖరికి నేరం రుజువు చేస్తూ జడ్జిగారు వాడికి పదేళ్ళ కఠిన శిక్ష విధించారు.

ఆ రోజు నించి గదాధర్‌కి యీ ప్రపంచం అంటేనే విరక్తి పుట్టింది. అందుకే జైలు నించి విడుదలయి మానవత్వం నశించిన యీ మనుషుల మధ్యకి, ఈ అబద్ధపు ప్రపంచంలోకి అడుగు పెట్టాలన్న తృష్ణపోయింది. కాని అపుడపుడు అతని అన్న, వదిన గుర్తు వచ్చి హృదయం ఆవేదనతో నిండి పోయేది. వాళ్ళని జన్మలో మళ్ళీ చూడగలనా అని విచారించే వాడు.

జైలుకి వెళ్ళిన ఐదేళ్ళ తరువాత గదాధర్ వూరి వాడొకడు దొంగతనం నేరం మీద జైలుకి వచ్చాడు. వాడి ద్వారా అతని అన్న, వదిన కలరా తగిలి చనిపోయినట్లు, ఆ తరువాత యిల్లు, వాకిలి ఓ వరదలో కొట్టుకు పోయినట్లు తెల్సింది. అప్పటి నించి గదాధర్ బయటి ప్రపంచంతో సంబంధం పూర్తిగా తెంపేసుకున్నాడు,

రాత్రిళ్ల పడుకున్నప్పుడు రకరకాల ఆలోచనలు వచ్చేవి. తన తప్పు ఏమిటి ? ఏ నేరానికి యింత పెద్ద శిక్షపడింది? చిన్నప్పుడు వినన అవేది మంచి పని చేస్తే భగవంతుడు సంతోషిస్తాడని, అసహాయురాలైన ఒక ఆడదాన్ని రక్షించడం మంచి పని కాదా ? తను కావాలని చంపలేదే ? ఒక స్త్రీని రక్షించడంకోసం చేశాడు. ఇది తన తప్పా- రకరకాల ప్రశ్నలు వేసుకునేవాడు. కాని దేనికీ సరయిన సమాధానం వచ్చేదికాదు. ఆఖరికి యిది నా తలరాత అనుకునేవాడు. అప్పుడప్పుడు వాడికి భగవంతుడి అస్తిత్వం మీదనే సందేహం వచ్చేది. కాని మరుక్షణమే తెంపతేసుకుని "లేదులేదు భగవంతుడున్నాడు, లేకపోతే జైలులో వున్నా యింత ఆనందంగా ఎలా గడపగలుగుతున్నాను అనుకునేవాడు. ఈ జైలులోనే నా మిగతా జీవితం గడిచిపోనీ, భగవంతుడా యింక నిన్నేం కోరను అని మనసులో ప్రార్థించేవాడు. కాని మనిషి అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే యింక లేనిదేముంది? తను ఎప్పుడయితే జైలుశిక్ష వద్దు అని విలపించాడో అప్పుడు జైలుశిక్ష పడింది. పరిస్థితులతో రాజీ పడిపోయి యింక బయటికి వెళ్ళకూడదు అనుకున్నాడో అప్పుడు విడుదల చేస్తూ ఆర్డర్లు వచ్చాయి. భగవంతుడి లీలలు ఎంత చిత్రంగా వుంటాయి!

గైడు అంటే దారి చూపించేవాడనేగా అర్థం!!



విడుదలయిన రోజున గదాధర్ ఏడుస్తూ మిగతా ఖైదీలదగ్గిర వీడ్కోలు తీసుకున్నాడు. ఖైదీలుకూడా అతన్ని విడవలేక ఏడ్చేశారు. జైలు సూపరింటెండెంటు యిది చూసి ఆశ్చర్యపోయాడు. మనిషి స్వేచ్ఛ కోరతాడు—విముక్తిలో వున్న ఆనందం యింతా అంతా కాదు. కాని గదాధర్ స్వేచ్ఛ కోరడంలేదు! వాడికి కావల్సింది జైలుబంధనం! ఆ జైలే వాడికి స్వర్గం. ఆ బంధనమే వాడికి ఆనందం!

జైలునించి వెడుతూండగా జైలు ఆఫీసరు అతడి చేతిలో మూడువందల రూపాయలు పెట్టాడు ఈ ఎనిమిదేళ్ళలో కన్‌విక్ట్ వార్డర్‌గా పనిచేసినందుకు వాడికి వచ్చిన పారితోషికం అది. ఆ డబ్బు తీసుకుని పదేళ్ళక్రితం వచ్చినపుడు కట్టుకున్న బట్టలు కట్టుకుని సూపరిం

టెండెంట్ సాహెబ్‌కి నమస్కారం చేసి కన్నీళ్లతో జైలు గేటు దాటాడు.

○ ○ ○

బయటికి వచ్చాక ఎక్కడికి వెళ్లడం అన్న మీమాంసలో పడ్డాడు గదాధర్. ఎవరున్నారు తనకి? ఆఖరికి తన వూరికి వెళ్లడానికి నిశ్చయించాడు. చీకటిపడేవేళకి వూరు చేరుకున్నాడు. వూరుపొలిమేరకి రాగానే ఆచెరువు కనపడింది మర్రిచెట్టు వూడలు అలాగే వున్నాయి. అవి చూడగానే ఎన్ని పగళ్ళు, సాయంత్రాలు అక్కడ గడిపాడో గుర్తురాసాగాయి. ఆ చీకటిలో మర్రిచెట్ల చాటు నుంచి గోకుల్ జీర్ణావశిష్టమైన శరీరం కన్పించి వికటాట్టహాసం చేసింది. భయంతో గదాధర్ శరీరం కంపించింది కాళ్లు గజగజలాడాయి. ప్రాణా లుగ్గపట్టి వూర్లోకి పరుగు లంకించాడు. యిల్లు చేరి చూసేసరికి వట్టి మొండి గోడలు కనిపించాయి. చుట్టూ పిచ్చి మొక్కలు లేచాయి. నెమ్మదిగా పెరటి వైపు నడిచాడు. అక్కడ పళ్ళతో నిండిన మామిడి చెట్టు కన్పించింది. అది తను స్వయంగా జైలుకి వెళ్ళే ముందు నాటాడు. ప్రేమతో దాన్ని చేత్తో తాకాడు. అక్కడి నిండి పొరుగున్న గోవింద మిశ్రా యింటికి వెళ్ళాడు. మిశ్రా ముసలాడు. పీధరుగు మీద కూర్చుని జపం చేస్తున్నాడు. గదాధర్‌ని చూసిఎవరూ? అన్నాడు కళ్ళకి చెయ్యడ్డు పెట్టి చూస్తూ. "ఎవరూ, జైలు కెళ్ళినగదాధరేనా మళ్ళీ ఎవరి కొంప కూల్చుతావు బాబూ, వెళ్లు వెళ్లు. లేకపోతే చౌకీదారుని పిలిపించి పోలీసులకి అప్ప చెప్పుతాను." అని నెట్టి భయంగా లోపలికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. గదాధర్ అక్కడ నించి దామోజెనా యింటి కెళ్లాడు. అక్కడ నించీ వెళ్ళగొట్టారు. మరి యిద్దరు, ముగ్గురుతెలిసిన వారి యిళ్ళలోకూడా అదే సత్కారం జరిగింది. జైలు నించి వచ్చిన వాడికిఅందులోహంతకుడికిఅంతకంటే సత్కారం ఏం జరుగుతుంది. అది గుర్తించాక యింక అక్కడ వుండడానికి మనసు వప్పక వూరు వదిలాడు. దారిలో ఓ దుకాణంలో కూర్చుని, పూరీలు, బూంది తిని టీ తాగాడు. ఇప్పుడు ఏం చెయ్యడం అన్న సమస్య తలెత్తింది. హాయిగా జైలులోనే నయం, రెండు పూటలా తిని, మజాగా గడిపాడు.

○ ○ ○

ఆ రోజు రాత్రి ఆ వూరి మకర్‌సాహు మహాజన్ యింట్లో దొంగ పడ్డాడు. సాహు గారి అరుపులు విని చుట్టు పక్కల యిళ్ళ వాళ్ళు లేచి వచ్చారు. చౌకీదారు లోపలికి పరుగెత్తి దొంగని పట్టేశాడు. చుట్టూ మూగిన అంతా "దొంగెవడో కాడు. మొన్న జైలు నించి విడుదలయిన గదాధర్‌ట అని తమలో తాము అనుకున్నారు. పోలీసులు వచ్చారు. దొంగతనం జరిగింది మహాజన్ (ముస్సబు) గారింట్లో కనక ఇన్స్‌పెక్టర్ స్వయంగా వచ్చాడు. అయిదు వేల రూపాయలు వున్న కాష్ బాక్స్ తెరుస్తుండగా పట్టుపడ్డాడని ఇన్‌స్పెక్టర్ ఛార్జిషీట్ చేశాడు. కొన్నాళ్ళకి కోర్టులో వాడి నేరం రుజువయి 457. 380 సెక్షన్ ప్రకారం జైలు శిక్ష విధించారు. తీర్పు విని గదాధర్ నిశ్చింతగా నిట్టూర్చాడు

○ ○ ○

కొన్ని రోజుల తర్వాత మామూలు జైలు నించి సెంట్రల్‌జైలుకి మార్చారుగదాధర్‌ని. గదాధర్ పూర్వ పరిచితమైన జైలు గేటు దగ్గిరకి రాగానే వాడి మొహం సంతోషంతో నిండింది. చేజారిన వస్తువు ఏదో మళ్ళీ చేజిక్కినంత సంబరంగా వుంది వాడికి. జైలు సూపరింటెండెంట్ గారికి నమస్కారం చేసి "అయ్యగారూ, తిరిగి వచ్చాను. నాకు ముందిచ్చిన పనినే యిప్పించండి" అని ప్రార్థించాడు చేతులు జోడించి.

జైలు గేటు తెరుచుకుంది. గదాధర్ మహదానందంగా లోపలికి వచ్చాడు. సాహెబ్ ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని చూస్తూ — "ఏ జైల్ బర్డ్ ఇన్‌డీడ్" అన్నాడు పైకే.

✳

షాక్ ట్రీట్‌మెంట్

పి.వి. కరుణాకరన్

హేవార్డ్స్ బాటిల్ ఓపెన్ చేసి, మూడు గ్లాసుల్లోనూ పోసాను. వెంకన్న సోడా కలిపాడు. శేషాద్రి చిప్స్ ప్లేట్లలో సర్దాడు.

ముగ్గురం గ్లాసులు ఎత్తాం.

"చీర్స్!" చేదు మందు వెచ్చగా గొంతు లోంచి వెళుతోంది. చిప్స్ నములుతూ కిటికీ దగ్గరకు వెళ్ళి, సిగరెట్ అంటించి బయటకు చూసాను.

జనవరి చలిగాలి తెరలు తెరలుగా వచ్చి వణుకు పుట్టిస్తోంది. రాత్రి తొమ్మిది గంటలకే రోడ్డు మీద జన సంచారం తగ్గిపోయింది. వీధి చివర కొంత మంది గోలగా అరుస్తూ ఘర్షణ పడుతున్నారు.

"మీ ఆవిడ ఊరికెళ్ళ బట్టి కదా మనకీ మహదవకాశం దొరికింది? పరోక్షంగా వున్నా ఆవిడకు నా కృతజ్ఞతలు!" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు వెంకన్న.

శేషాద్రి తల వూపాడు. "ఈ మధ్య చాలా రోజులయింది మందు పుచ్చుకుని .... నెలకో మూడు సార్లయినా పుచ్చుకుంటేనే గానీ మన ఆరోగ్యాలు బాగుండవు!" అన్నాడు.

"సందు చివర ఏదో గొడవ జరుగుతోంది. కొట్టుకుంటున్నారు ..." అన్నాను అటే చూస్తూ. "ఏదో చావనిద్దూ ... ఆ వెధవ గోల మనకెందుకు!" అన్నాడు శేషాద్రి.

సిగరెట్ విసిరేసి, కిటికీ తలుపులు మూసి వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

"అంటే ఏమిటి? వాళ్ళు ఎలా చచ్చినా మన కనవసరం అంటావా?"

"కాకపోతే మరి? వెళ్ళి ఆపుతావా? జాగ్రత్త ... మధ్యలోనే బుర్ర బద్దలు కాగలదు!" అని పెద్దగా నవ్వాడు శేషాద్రి.

నేను కొద్దిసేపు మౌనంగా వున్నాను.

"నేను ఒక తమాషా విషయం చెబుతాను. వినే ఓపికుందా?" నా గ్లాసులో మిగిలింది ఖాళీ చేసి అన్నాను.

"కథ చెబుతావా?" వెటకారంగా అన్నాడు శేషాద్రి.

వాడికి నేరాసే కథల మీద సదభిప్రాయం లేదు. వాటిల్లో కమ్యూనిజం వుందంటాడు వాడు!

"కథలాంటిదే .... అయితే నిజంగా జరిగింది. బలవంతం లేదు .... వినాలనుంటేనే.

"చెప్పు. కబుర్లు చెప్పుకోవటానికేగా ఇది ఏర్పాటు చేసింది" నా గ్లాసును నింపుతూ అన్నాడు వెంకన్న.

తాగిన మందు లోపల మంటలు చిమ్ముతోంది. అయినా అదో రకమైన హాయిగా వుంది. గ్లాసులోది కొద్దిగా సిప్ చేసి, సిగరెట్ వెలిగించి, మొదలు పెట్టాను ....

"ఇది జరిగింది పోయిన వేసవిలో అనుకుంటాను. నేను సరదాగా ఒక ట్రిప్పు కొట్టి వద్దామని మా అక్కయ్య వాళ్ళ ఊరు .... గుంటూరు వెళ్ళాను ...."

"ఏమిటి వేసవిలో గుంటూరు సర్దాగా వుంటుందా?"

నేను కోపంగా చూసాను శేషాద్రి వైపు.



"నువ్వు మధ్యలో అడ్డుపుల్లలు వేయకురా...." విసుక్కున్నాడు వెంకన్న.

నేను మళ్ళీ మొదలు పెట్టాను.

"వేసవి కాలం కదా .... రాత్రి పూట గుంటూరులో అందరూ బైటే పడుకుంటారు. సరైన అద్దె కొంపలు దొరక్కపోతే సగం నడి బజార్లోనే పడుకుంటారు. మా బావ వాళ్ల వుంటోంది అట్లాంటి అద్దె కొంపలోనే.

ఒక రోజు రాత్రి ....

భోజనం చేసి, మంచాలు బైట వేసుకుని, బావ, నేను కబుర్లలోకి దిగాం. సమయం పది అయివుంటుంది.

హఠాత్తుగా మా వీధి చివర ... ఓ పది మంది గుంపుగా వున్నారు ... వాళ్ళ మధ్య కొట్లాట మొదలయింది ఓ పది నిముషాల పాటు వాళ్లు బూతులు తిట్టుకున్నారు. మాకు మాటలయితే సరిగ్గా విన్పించటం లేదు కానీ, ఏదో డబ్బుల విషయమై తీవ్రంగా ఘర్షణ పడుతున్నారు. ఆ పైనే సారాకొట్టు వుంది. అక్కడ చిత్తుగా తాగి, గొడవ చేసుకుంటూ వెళతారు వెధవలు" అన్నాడు వాళ్ళనేచూస్తూ మా బావ.

చూస్తూండగానే తగాదా ముదిరింది.

అది కొట్లాటగా మారిపోయి, ఒకణ్ణి పట్టుకుని అందరూ బాదటం మొదలు పెట్టారు. అప్పటికే ఆ ప్రహసనం చుట్టు ప్రక్కల ఇళ్ళ వాళ్ళు గమనిస్తూనే వున్నారు. ఎవ్వరిళ్ళలోనూ ఫోనులేదో...లేక వున్నా పోలీసులకు ఫోన్ చేసేపమ్ము లేదో.... ఉన్నట్లుండి మా బావ లేచాడు ...."

"ఎక్కడకి .... వాళ్ళను ఆపటానికే?" ఆశ్చర్యంగా అన్నాడు శేషాద్రి.

ఆడే పోయిన సిగరెట్ అవతల పారేసి అన్నాను ... "ఛ ... పక్కబట్టలు సర్దేసాడు. మంచం తీసుకుని లోపలకు వచ్చేయమన్నాడు! నేను అటు చూసాను. అప్పటికే ఆ వీధిలో బయట మంచం వేసుకున్న వాళ్ళందరూ లోపలకు జారుకున్నారు.

అదే సమయంలో గుంపులో, అప్పటి దాకా తన్నులు తిన్న మనిషి వాళ్ళ నుంచి తప్పించుకొని, బాణంలా మా వైపు పరుగెత్తుకునిరావటం ప్రారంభించాడు. నాకూ దడ పుట్టింది.

నేను లోపలకు పరిగెత్తాను. మా బావ హడావిడిగా తలుపులు గడియవేసాడు.

ఈ సారి కేకలు మా ఇంటి దగ్గరగా విన్పించాయి నేను, బావ కిటికి దగ్గరకు పరిగెత్తాం ..."

"జస్టేమినిట్.... నువ్వు తాగటంలేదు...."

నా గ్లాసు మళ్ళీ నింపాడు వెంకన్న. గ్లాసు అందుకుని సగం ఒక్క గుక్కలో త్రాగాను. మళ్ళీ చెప్పటం ప్రారంభించాను....

"వాడి వెనక పరిగెత్తిన మనుషులు వాణ్ణి మా యింటి ముందు పట్టేసారు. మళ్ళీ గుభీ గుభీ మని గుద్దులు .... ఉన్నట్లుండి మా గుండెలు అదిరిపోయేట్లు చావు కేక విన్పించింది.

నా కాళ్ళు గజగజ వణికేయి. నేను మరి కొంచెం పరీక్షగా చూసాను. గుంపులోంచి ఒకడు కుప్పలా కూలిపోయాడు. బహుశా వాళ్ళ చేతుల్లో తన్నులు తిన్న వ్యక్తి అయుంటారు. మున్సిపాల్టీ దీపం మసక వెలుతురులో వాడు అస్పష్టంగా కన్పిస్తున్నాడు. ఛాతీలో చాకు మెరుస్తోంది ... వెల్లకిలా పడున్నాడు.

వాడి చుట్టూ చేరిన వాళ్ల క్షణం పాటు గుస గుసలాడారు. అంతే ... రాయివేస్తే చెదిరిన కాకుల్లా అటూ ఇటూ చెల్లాచెదురుగా పారిపోయారు.

చుట్టు ప్రక్కల అందరిళ్ళలో దీపాలు వెలుగుతున్నాయి. చాలా మంది కిటికీల దగ్గర్నే వున్నారు. చావుకేక విన్పించగానే కొంత మంది మాత్రం కిటికీలు మూశారు.

పడిపోయిన వాడు కుర్రాడిలాగున్నాడు. అయితే వాడు చావలేదు. పెద్దగా మూల్గుతున్నాడు. కొద్ది సేపటికి వాడు కళ్లు తెరిచాడు, ఆ వీధంతా భయంకర నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. వాడి ఉఛ్వాసనిశ్వాసలు మాకు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

హఠాత్తుగా వాడి కళ్ళు మా కిటికీ వైపు చూసాయి. కిటికీ దగ్గర బావ, నేను కన్పించాం. వాడు ఓరగా పాక్కుంటూ మా యింటి గుమ్మం వైపు రాసాగాడు.

"ఓసేయ్ ... కి టి కీ వేసెయ్ ...." భయంగా అరిచాడు మా బావ.

"అయ్యా ...." దీనంగా పిలిచాడు వాడు.

"నన్ను రక్షించండి .... నే ను బ్రతికే వున్నాను ... హాస్పిటల్‌కు పంపండి... లేవ లేక పోతున్నాను... దయచేసి పోలీసుల్ని పిల వ ం డి...." లే ని ఓపిక తెచ్చుకుని, అస్పష్టంగా అంటున్నాడు వాడు.

బావ నన్ను పక్కకు లాగి, కిటికీ రెక్కలు వేసేశాడు. మనిషి నిలువెల్లావణికి పోతున్నాడు.

నేను అక్కడే నిలుచున్నాను. వాడు పక్క ఇళ్ళ దగ్గరకు వెళ్లి అరవటం విన్పిస్తోంది. అయితే ఒక్కడు కూడా వాడి గోడు విన్పించుకున్నట్లు లేదు ..." చెప్పటం ఆపి, ఇద్దరి వంకా చూసాను నేను.

"బాగానే వుంది... మరీ దర్టీ ఫెలోస్ అయిపోయారు జనాలు!" అన్నాడు శేషాద్రి. నవ్వాడు వెంకన్న". తర్వాతేం జరిగిందో చెప్పు ..." నా గ్లాసులో మిగిలింది ఖాళీ చేసాను.

"మా బావను కూర్చోపెట్టి, నేను మళ్ళీ కిటికీ తలుపులు తీసాను. వాడు చాలా సేపటి నుంచీ అట్లా అరుస్తూనే వున్నాడు.

అయితే హఠాత్తుగా అరవటం ఆపేసాడు. లేచి నుంచున్నాడు. ఛాతీలోంచి చాకు లాగేసి, మడిచి ప్యాంటు జేబులో వేసుకున్నాడు. క్షణమాగి "రేయ్ నా కొడకల్లారా!" అంటూ గర్జించాడు.

"ఆఁ!" నోళ్ళు వెళ్ళబెట్టారు వింటున్న ఇద్దరూ.

"నోళ్లుమూసుకు వినండి. వాడు అప్పటి దాకా చేసింది యాక్షన్ చేసిన వాడి మిత్ర బృందం అంతా అక్కడి కొచ్చారు..."

"తమాషాగానే వుంది.... ఎందుకు చేశారుట యిదంతా?"

"వస్తున్నాను ... వాళ్ళందరూ కలిసి ఆ వీధి వాళ్ళను కొద్ది సేపు బూతులతో సత్కరించారు!

ఒక మనిషిని పది మంది కొట్టి, పొడిచి పారిపోయారు. నేను బ్రతికే వున్నాను ... నన్ను రక్షించండిరా అని అరిచి, మొత్తుకున్నా, ఒక్కడు కూడా బయటకు రాలేదు. మీరు అసలు మగాళ్ళేనా? పెళ్ళాం పక్కల్లో పడుకున్నప్పుడు తప్పితే మీకు మగతనం గుర్తుకు రాదా?

సమాజం కుళ్ళిపోయిందని చచ్చు కబుర్లు చెప్తారు ... సమాజంలో తోటి మనిషికి సాయం చేయటానికి ముందుకు రాని మీ కందరికీ కష్టాలొస్తే సమాజం సహాయం కావాలి....

అఖరుకు పోలీసు రిపోర్టివ్వటానికి కూడా భయమే .... పోలీసు గొడవల్లో ఎందుకు ఇరుక్కోవటమని ...

ఇలా చాలా సేపు ఆ వీధి వాళ్ళందర్నీ మాటలతో కుళ్ళ బొడిచారు. ఒక్కడూ కిమ్మన లేదు ..."

ఆయాసం తీర్చుకోవటానికి ఆగాను.

"బాగుంది ... వెళ్తూ వెళ్తూ వాళ్ళన్నదేమంటే తామేదో స్టూడెంట్స్ యూనియన్‌కు సంబంధించిన వాళ్ళమనీ, ఇప్పటికి యీ బహిరంగ ప్రదర్శన చాలా చోట్ల యిచ్చామనీ జనానికి యీ విధంగా షాక్ ట్రీట్‌మెంట్ యిస్తే ఏమన్నా ఫలితం వుంటుందేమోనని తమ ఆశ అనీ, ఎవర్నీ నొప్పించటం తమ అభిమతం కాదనీ, చెప్పి నిజమైన పౌరులుగా మెలగవలసిందిగా కోరి వెళ్లిపోయారు...."

కొద్దిసేపు మౌనం రాజ్యం చేసింది మా మధ్య. చివరకు వెంకన్న అన్నాడు ...." వాళ్ళు చేసిందంతా బాగానే వుంది .... కాని ఒకటి .... మనసులో ఆ వ్యక్తిని రక్షించాలనే కాంక్ష వున్నా ఎంత మంది వాణ్ణి రక్షించి, కోర్టుల చుట్టూ తిరగ్గలుగుతారు?"

నేను తలూపాను.

"నిజమే ... తన్నిన వాణ్ణి కాకుండా, తన్నులు తిన్న వాణ్ణి చూపించిన అర్భకులను దాదాపుగా తన్నినంత పని చేస్తారు మన అధికారులు. విదేశాలకూ, మనకూ తేడా అదే. కంటితో చూసిన సత్యాన్ని నిర్భయంగా బైటకు చెప్పలేని — చెప్పనీయని వ్యవస్థ మనది. మనం చేయగలిగింది ఏమీ లేదు .... ఇందులో ఇలా కుళ్ళి చావాల్సిందే ...."కసిగా అన్నాను. నెమ్మది నెమ్మదిగా నిషా తల కెక్కుతోంది. "ఎలా వుంది?" శేషాద్రిని అడిగాను.


"నీతో ఏకీభవిస్తున్నాను ..." అన్నాడు.

కొద్దిసేపాగి, శేషాద్రికి గుడ్‌నైట్ చెప్పి తడబడుతున్న అడుగులతో బయటకు కదిలాం వెంకన్నా, నేనూ. వీధి చివర యిప్పుడు గొడవలేదు. ✳

పదహారు పాదాల దీపం

దేవిప్రియ

నేను
దీపాన్నయితే, నాకు పదహారు పాదాలు
నాగరికత నరాల్లోకి
నడిచి వెళ్ళడానికి—
నేను
గీతాన్నయితే నాకు పదహారు పాదాలు
క్షుభిత హృదయ భారాన్ని
మోసుకు పోడానికి—
నేను
నదినైతే నాకు అసంఖ్యాకంగా అలల
పాదాలు
తీరం వైపు త్వరత్వరగా తరలి
పోడానికి —
నేను
మనిషినైతే—
సంవత్సరాలే నా పాదాలు,
అనాది అరణ్యాల మీదుగా
నెత్తురోడుస్తూ నడిచి వెళ్ళిన పాదాలు,
అంధకార గుహాంతర్భాగాల్లో
జంతు అస్థిపంజరాల మీద
నిలుచుని నిద్రపోయిన పాదాలు,
శిలాయుధాలతో
శిరసులు బద్దలు కొట్టుకున్న పాదాలు,
ప్రకృతి బీభత్సం ముందు
ప్రశ్న తెలియక మోకరిల్లిన పాదాలు,
తోడేళ్ళని తోలుకొచ్చి
తోలు వలిచి చుట్టుకున్న పాదాలు,
సముద్ర జలాలతో
సంగమించిన పాదాలు
ఆకాశాలని
వంగదీసిన పాదాలు,
పర్వతాలను శృంగదీసిన పాదాలు,
దండయాత్రలు చేసిన పాదాలు
దండియాత్రల్లో దండగైన పాదాలు
మాటాడని పాదాలు
వేటాడిన పాదాలు,—
నా పాదాలు యిప్పుడు
సామాజిక న్యాయ వాదాలు—
సంపూర్ణ మానవ చైతన్య నినాదాలు
నా పాదాలు—
నేను
గీత దీపాన్నయితే
నా ప్రతి పాదానికీ
పదహారు పాదాలు!



కళామతల్లి ఏడ్చింది

కోరుకొండ సత్యానంద్

అతనొక చిత్రకారుడు. పేరుప్రతిష్ఠలు లేని చేయితిరిగిన చిత్రకారుడు. అతని చిత్రాల్లో గోపాలకృష్ణుని మురళీగానం లేదు. గోపికల జలకాలు లేవు. నవనవలాడే ఒంపుసొంపుల్తో గువ్వలా ఒదిగిపోయి కూర్చున్న అర్ధనగ్న సుందరి లేదు. జాబిల్లి చల్లని వెన్నెలతో మత్తెక్కి, మైమరచి ప్రియునివైపు బరువైన కళ్ళతో ఓరచూపు చూసే యవ్వనాంగి లేదు. అలనాటి వైభవాన్ని, పౌరుషాన్ని, దర్పాను చాటి చెప్పే అమరశిల్పిచెక్కినచెక్కడాలులేవు.

కోరమీసాలతో, క్రోధపూరిత దృక్కులతో ఆరడగుల ఖాకీ రాజుల రూపాలు లేవు.

అతని చిత్రాల్లో వున్న వల్లా కనీసం పూటకు ఒక ముద్ద మెతుకులకు కూడా నోచుకోలేని అభాగ్య జీవుల ఆకలి చూపులు-తిండి లేక ఆకలి తీరక పోయినా ఒకరికొకరు తోడు వున్నందున రాత్రి పూట ఎవలో వదిగే ఆకలి మంటను కూడా ఆర్పివేసే కామజ్వాల ఫలితంగా పుట్టిన బిడ్డడు - శోకం అంటే పూలవనం అని అనుకొన్నట్లుగా నవ్వితే, ఆ నవ్వును చూసి మురిసిపోయి, ఆకలిని మరచిపోయే బీద తల్లులు - ఆకలితో ఏడ్చే పసిపిల్లలకు పాలు లేని రొమ్ము నందించి, ఆకలి కసితో ఆ పిల్లడు రక్తాలు కారేలా చీకినా, ఆ బాధకు సహించినా, ఆ బిడ్డడు ఆకలి తీరక ఏడుస్తుంటే ఆ బిడ్డ వంక అచేతనంగా చూస్తున్న మాతృమూర్తులు - అక్షర జ్ఞానం లేకపోయినా, లక్షణంగా ఉదయం లేచి పనికి పోయి చెమటలు జీవనదుల్లా ప్రవహించేలా కష్టించి పని చేసి, లెక్కల్లొచ్చిన గుమాస్తా యిచ్చిన తక్కువ డబ్బుల్తో డొక్కలు కన్పించే కడుపుల్తో ఇంటికి చేరి, ధనవంతులు కుక్కలకు కూడా అందకుండా పారబోసే గంజి నీళ్ళను పాయసంలా తృప్తిగా త్రాగుతున్న అభాగ్యులు ... ఇలా చెప్పకపోతే కొందరు పేరున్న పెద్ద రచయిత(త్రు)లు రాసే సూపర్ సైజు నవల తయారవుతుంది అతని చిత్రాల వర్ణన.

అతని పేరు సుందరం. పేరుకు తగ్గ అందం అతనికి లేదు. కానీ అతని మనసు వెన్నలాంటిది. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంది....స్పందించి కరుణరసాన్ని కురిపిస్తుంది. అతనికి యవ్వనం ఉంది. కోరికలున్నాయి. ఆ కోరికలను చల్లార్చే అందమైన భార్య ఉంది. ఆమె అందాన్ని చూస్తుంటే అతని మనసు చలించదు. అతని మనసు చలించేది శోకరసమయ చిత్రాల్ని చూసినపుడే!

అతనికి ఉద్యోగం ఉంది. సామాన్యమైన గుమాస్తా ఉద్యోగం. అతని జీతం వివిధరకాల బ్రష్‌లకూ, రంగులకే వస్తుంది.

అతని చేతికి బ్రష్ వస్తే దానికి ప్రాణం వస్తుంది. రకరకాల రంగుల్ని సమ స్ఫూర్తితో కలిపి, ఆ రంగులకే కన్నీళ్లొచ్చే చిత్రం గీస్తాడు.

వచ్చిన జీతం రంగుడబ్బాల పాలు చే నపుడు భార్య మనసు బాధతో మూలుగుతుం కానీ ఆ రంగుల్తో భర్త వేసిన చిత్రా చూస్తే ఆమె ఒళ్ళు జలదరిస్తుంది. ఆ చి ల్లోని మనుషుల్ని చూస్తుంటే ఆమెకు తెలియని బాధ జనిస్తుంది...ఆమెకు భర్త ఒ మహా తపస్విలా కన్పిస్తాడు.


అంతకుముందు చిత్రాలు వేయడం అనుకునేవాడు. దాన్ని అమ్మడం అంటే క బిడ్డను అమ్మినట్లే బాధపడేవాడు. ఒక క కారుడు తన కళను అమ్ముకుంటే కళామత "కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ" ఏ స్తుందేమో అని అనుకునేవాడు.

కానీ ఒకసారి జీతాలందిన మరునా రంగుడబ్బాలు కొని ఇంటికి తెచ్చాడు. తా ఇంటిదగ్గర పాలవాడు, నీళ్ళవాడు, కిరా కొట్టువాడు, మంగలి, చాకలి వంటి నిత్యా సర మనుష్యులు ఉన్నారు. రాగానే అంద ఒక్కుమ్మడిగా అడిగారు. తనచేతిలో చిల్లి తప్ప ఏమీలేదు. వాళ్ళన్న మాటలు శూలా గుచ్చుకున్నాయి. మనసంతా కకావికల పోయింది. కోపం ఉవ్వెత్తున లేచింది.

గదిలోకి వాయువేగంతో వెళ్ళాడు. అం అతను వెళ్లినవైపుకే ఆశ్చర్యంగా చూసా మరు నిమిషంలో తిరిగి బయటకు వచ్చా భార్య ఆశ్చర్యంగా చూసింది. ఆ మధ్య వ్రాసిన అయిదు క్రొత్త చిత్రాలు కొచ్చాడు. అందరూ వాటివంక చూసారు.

మీకివ్వాల్సిన బాకీకి నేను రాత్రింబ కష్టపడి వ్రాసిన ఈ చిత్రాల్ని తీసుక మీ బాకీ జమకట్టుకోండి అన్నాడు విసురుగా.

ఒకళ్ళముఖాలొకళ్ళు చూసుకున్నా అందరూ కలసి కాలే కడుపుల, రాలే బ కులు, విలువలేని మనుష్యులు ఉన్న ఆ చిత్రాల వంక చూసారు. ఆ తరువాత సుందరం వంక చూసారు.



తరువాత అందరూ నవ్వారు....ఒక్కుమ్మడిగా నవ్వారు....

నవ్వి అలసిపోయారు....

ఆ నవ్వుకు సుందరం మనసు అందమైన చిత్రంమీద పెయింట్ ఒలిగిపోయినట్లుగా తయారయ్యింది. బ్రతికి ఉన్న మనిషికి నిప్పంటించినట్లన్పించింది.

వాళ్ళింకా నవ్వుతూనే ఉన్నారు.

ఏదో అన్నారు...వికటంగా మరో నవ్వు నవ్వారు. ఆ నవ్వుతో అతని చిత్రాల వెల కన్పిస్తుంది.

అప్పులు వచ్చే నెలకు వాయిదా వేసి వెళ్ళిపోయారు.

వెలవెల బోయినట్లుగా ఉన్న ఆ చిత్రాల వంక అమాయకంగా చూసాడు. ఎందుకో అతని కళ్ళవెంట రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి.

ఆ కన్నీటి చుక్కలు విసురుగా అన్నాయి- "నువ్వు కష్టపడి రాసిన చిత్రాలు అమ్మడానికి కూడా ఉపయోగపడలేదు చూసావా?" అని.

అప్పుడు సుందరం గుండె మండినట్లయ్యింది.

o o o

అతని ఎదురుగా ఒక చిత్రం ఉంది.

ఆ చిత్రంలో—పొద్దస్తమానూ కండలు కరగించి చీకటి పడేవేళ డొక్కలు పైకివచ్చిన కడుపుతో, పెరిగిన గడ్డంతో చెదరిన జుత్తుతో వస్తున్న ఒక మానవాకారం, అతని జీవిత మోడును లతలా అల్లుకొని ఎండిపోతున్న అతని భార్య - ఒకవైపు భర్తపై ప్రేమానురాగాలు ఆతడి స్థితిని చూసి కన్నీటితో తడిసిపోగా, మరోవైపు ఈ పూట గంజినీళ్ళకు కాసులు తెసున్నాడో, లేదో అన్న సంశయంతో, గుడిసె ముందు కూర్చొని చూస్తుంది. ఆకలి రాక్షసిని చూసి దడుసుకొని, ఒకొళ్ళనొకళ్ళు బాధగా కౌగలించుకోగా, ఆ బాధను మరిపించే ఏదో మరో బాధ వాళ్ళను ఆవహించగా పుట్టిన బిడ్డడు ఆమె మోకాలికి ఆనుకొని, రోజూ రాత్రివేళ తనను ప్రక్కలో పడుకోబెట్టుకొని ముద్దులవర్షం కురిపించే మనిషి వసున్నాడన్న సంతోషంతో రెండు చేతులనూ తపాతపా కొట్టుకుంటూ కేరింతలు కొడుతున్నాడు.

ఆ చిత్రాన్ని చూసుకుంటూ ఏవో కలలు కంటున్నాడు సుందరం. అతని కలలు పండితే నెలబాకీలు తీరిపోతాయి. పెళ్ళై రెండు సంవ

త్సరాలైనా తను భార్యకు ఒక మంచి చీరైనా కొనలేదు. తన కలలు నిజమైతే తను కొనిచ్చిన చీరను భార్యకు గర్వంగా సమర్పించి చిరునవ్వు మిళితమైన ఆమె ముఖారవిందాన్ని చూసి తను ఆనందపడవచ్చు....

ఇలా ఎన్నో కలలు...

ఆ కలలు పండేరోజు రేపే రానున్నది.

ం ం ం

చిత్రకళా ప్రదర్శన ముగిసిపోయింది. సుందరంలో నిన్నటివరకూ చిగురించిన ఆశ సమసిపోయింది. అతని గుండె ఆవేదనతో బరువైపోయింది.

ఆ గది చీకటిగా ఉంది, కరెంటు లేక కాదు... ఆ ఇంటి మనుషుల మనసుల్లో కాంతి లేక.

ఆ చీకట్లో కూర్చొని సుందరం ఏడుస్తున్నాడు. చిత్రకళా ప్రదర్శనలో తన చిత్రం ఓ మూల, తన బతుకులాగే వెలిగీ వెలగని బల్బు వెలుగులో మసక మసకగా కన్పిస్తుంది. ఆ చిత్రం దగ్గరకు వెళ్ళి చూసిన వారు గానీ, బయట అభిప్రాయసేకరణ పుస్తకంలో తన చిత్రం గురించి ప్రస్తావించినవారు గానీ లేరు. అది తలచుకొని ఇన్నాళ్ళూ తను చేసిన కృషికి ఫలితం ఇదేనా? తనలో ఉన్న కళకు విలువ లేదా? అని వాపోతున్నాడు. కళ్ళు ఎర్రగా, అలసినట్లున్నాయి.

మరు నిముషంలో లైటు వెలిగింది. చటుక్కున తలెత్తి చూసాడు.

ఎదురుగా సౌజన్య, అదోలా చూసింది.

ఆ చూపును చూసి "నన్ను హేళన చేయడం లేదు గదా!" అనుకున్నాడు.

కానీ వెంటనే "లేదు ... నా సౌజన్య అలాంటిది కాదు...." అనుకున్నాడు.

ఆమె కళ్ళనే పరికించి చూస్తున్నాడు.

ఆమె దగ్గరకు వచ్చింది.

ఆమె చేతిలో మంచినీళ్ళ గ్లాసు....అందించింది.

అందుకొని గటగటా త్రాగాడు.

ఆమె అతని ప్రక్కగా కూర్చొంది.

"బాధ పడుతున్నారా?"

"ఆ ప్రశ్నకు అదోలా చూసాడామె వైపు. ఆ చూపులో ఏదో విరక్తి.

"లేదు....సిగ్గు పడుతున్నాను...."

"సిగ్గెందుకండీ? మీ చిత్రానికి ప్రైజు రాలేదనా?"

"ప్రైజు రాలేదని కాదు ... విలువ లేదని ..."

"విలువెందుకు లేదండీ? కళ అన్నది విలువ కట్టలేనిది. మీ చిత్రాలు యీ సమాజానికి ప్రతిబింబాలు. వాటికి ప్రైజులు రావు పేరున్న కళాకారులు ఏ గీత గీసినా అది ఎందరికో పెద్ద కళా ఖండంలా అన్పిస్తుంది. మీ చిత్రాలకు కూడా పేరు, గుర్తింపు వచ్చే రోజు వస్తుందండీ! ఒక సారి ఓటమి పొంది నప్పుడు పట్టుదల పెరగాలి గానీ, ఇలా బాధ పడకూడదు" అంది సౌజన్య.

ఆమె మాటలకు సుందరం అదోలా నవ్వుకున్నాడు.

అంతలో సౌజన్యకు ఏదో గుర్తుకొచ్చింది. అంతలోనే ఆమెలో ఆనందం పెల్లుబికింది. "రేపు మన పెళ్ళి రోజండీ! ... . మీకు గుర్తుందా?"

ఆ మాట విన్నంతలోనే సుందరంలో కూడా ఆనందం పొంగింది.

కానీ .... అంతలోనే జావకారి పోయాడు.


"పెళ్ళి రోజు .... రేపు పెళ్ళి రోజు ... ఈ విషయం సౌజన్య ఎంత ఆనందంగా చెప్పింది? కానీ .... తనెలా ఆనందించగలడు? పెళ్ళి రోజని మురిసిపోతున్న భార్యకు కనీసం ఓ చీరైనా కొనలేని పరిస్థితిలో, తన అసమర్థతకు సిగ్గుపడుతూ తనెలా ఆ రోజూ నూహించుకొని ఆనందించులడు?" తనలో తనే అనుకున్నాడు.

అంతలో ఎవరో తలుపు తట్టిన శబ్దం విన్పించింది.

సౌజన్య వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా చక్రపాణి. "రండి" అని వంట గదిలోకి వెళ్ళిపోయింది.

"సుందరం బాగున్నావా? సారీరా! సాయంత్రం నుండి వద్దామనుకుంటున్నాను....



కానీ ఎవరో ఒకరు అడ్డువస్తూనేవున్నారు..." అంటూ కూర్చున్నాడు.

"కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు సుందరం.

"థాంక్స్! సుందరం! నువ్వు రాసిన చిత్రమేదీ?"

"ఎందుకు? చూసి నవ్వడానికా?"

"ఛ! అలా ఎందుకనుకుంటావురా? చిత్ర ప్రదర్శనలో నీ చిత్రాన్ని చూసాను .... చిత్రం చాలా బాగుంది ... నీ కోసం వెయిట్ చేస్తే, ఎవరో వచ్చి నన్ను తీసుకు వెళ్ళి పోయారు ...."

"బిజీ చిత్రకారుడివి కదరా!"

"ఔరా! బిజీ చిత్రకారుడ్నే ... కానీ నీ చిత్రాల సాటి రావురా నా చిత్రాలు"

"ఎందుకురా! ఇన్‌ఫీరియర్ ముసుగు కప్పుకుంటావ్?"

"ఇన్‌ఫీరియారిటీ కాదురా! నేను చెప్పేది నిజం. న్యాయంగా చూస్తే నీ చిత్రానికే ప్రైజు రావాలి. కానీ .... నా కొచ్చింది .... కారణం నా చిత్రాల్ని చూసి కాదు. నా కున్న పేరును చూసి. నీ కెన్నో సార్లు చెప్పాను.... నా మాట విన్లేదు ...."

"వన్ మినిట్, వస్తానుండు ...." అని చెప్పి లోపల కెళ్లాడు.

చక్రపాణి పెద్ద పేరున్న చిత్ర కారుడు. ఈ రోజు జరిగిన చిత్రకళా ప్రదర్శనలో అతనికే మొదటి బహుమతి వచ్చింది.

ఎదురుగా కన్పిస్తున్న చిత్రాన్ని చూస్తూ వుండిపోయాడు చక్రపాణి.

ఆ చిత్రంలో కదలికలు, భావన అతడ్ని ఆశ్చర్యపరచాయి. అందులో దాగి వున్న భావం, ఏదో బాధ చక్రపాణిని కదిలించాయి.

సుందరం, చక్రపాణి ఇద్దరూ ఒకే చోట చిత్రకళను అభ్యసించారు. కానీ సుందరం మొదటి నుండి నిమ్న వర్గాల్లో వున్న బాధలు స్పష్టంగా గోచరింపజేసే చిత్రాల్నే వ్రాసేవాడు.

"ఊఁ చెప్పరా!" అని వచ్చి కూర్చున్నాడు సుందరం.

అతని ముఖంలో ఏదో బాధ, చికాకు కన్పించాయి చక్రపాణికి.

"ఏం చెప్ప మంటావురా! ఎప్పుడూ చెప్పేదే కదా! నువ్వు నీ ఒరవడినిమార్చుకో. చిత్రాల్లో ఎన్ని భావాలు ప్రకృతి సిద్ధంగా వున్నా, ఇప్పుడు వాటికి విలువ లేదురా

మన దేశంలో ధనవంతులున్నారు. ధనవంతులకు కావాల్సింది అర్ధనగ్న చిత్రాలు. ఇళ్ళల్లో అర్ధనగ్న చిత్రాల్ని తగిలించడం యిప్పుడో పెద్ద సాంప్రదాయం అయిపోయింది. అటు వంటి పెద్ద వాళ్ళను మెప్పించే నగ్న చిత్రాల్ని పెయింట్ చేస్తే డబ్బు వర్షంలా కురుస్తుంది, దాంతో పాటూ పేరు కూడా వస్తుంది...."

"డబ్బు కోసం అసభ్యంగా అలాంటి చిత్రాలు గీస్తామా ?"

"అసభ్యం ఎవరికిరా ? నీకు, నీ లాంటి చాలా కొద్ది మందికి. బొజ్జ పెరిగిన పెద్ద మనుషులు డొక్కలు కన్పించే మనుష్యుల చిత్రాల్ని వాళ్ళ అందమైన గదుల్లో అలంకరించుకోరు ! పేరొచ్చేదీ, డబ్బొచ్చేదీ వాళ్ళకు నచ్చే చిత్రాలతోనే ! పేరు, డబ్బు రాగానే నువ్వే గీత గీసినా గొప్పే ! సమాజంలోకి వెళ్ళకుండా, ఓ గదిలో కూర్చొని ఓ బీదవాడ్ని ఊహించి ఒక చిత్రం గీస్తే నీకు "అభ్యుదయ చిత్రకారుడు", నీ చిత్రాలకు "సమాజానికి దర్పణాలు" అన్న బిరుదులెన్నో వస్తాయి. ఆ తరువాత పత్రికల్లో కూడా చిత్రాలు వెయ్యొచ్చు.

పూర్వ మహారాజులు శిల్ప, చిత్ర కళాకారుల్ని పోషించి ఎన్నో చిత్రాల్ని వాళ్ళ అభిరుచికి తగ్గట్టుగా వేయించుకొనేవారు. ఆ రాజుల అభిరుచుల మేరకు ఎలాంటి చిత్రాలనైనా అప్పటి చిత్రకారులు వేసేవారు. అంతటి మహా కళాకారులు తమ కళను అమ్ముకున్నట్టే అనుకుంటే కళలు ఇంతగా ఎదిగేవి కావు. ఇప్పుడు అలా పోషించేవారు లేరు. దానికోసం మనం గుర్తింపు పొందడానికి ఎవరినో కొంతమందిని ఆశ్రయించి వాళ్ళ అభిరుచులకు తగ్గట్టుగా మనం చిత్రాల్ని వేయాలి.

నేనెలా పైకి రాగలిగానంటావ్? ఒక మోడల్ గరల్‌ని పిలిచి ఆమె ముఖాన వంద రూపాయలు పారేసి వివిధ కోణాల్లో అర్ధనగ్నంగా చిత్రాలు గీసి ధనవంతుల కళ్ళ ముందుంచితే వాళ్లు మనకు వేలు గుమ్మరిస్తారు... తెలుసా? ఈ కన్నీళ్ళ చిత్రాలు గీసి నీ జీతం డబ్బులు వృధాగా ఖర్చుచేసేకన్నా నా దారి నాచరించు. పైకి వస్తావ్! పైకి వచ్చాక ఈ రకం చిత్రాలు వెయ్యి ... మంచి పేరు వస్తుంది...." అన్నాడు.

సుందరం మౌనంగా అలా ఉండిపోయాడు.

"ఒరే సుందరం! నువ్వలా ఉంటే నేను చూడలేనురా! నా మాట విను. నేను పెద్ద పెద్ద వాళ్ళను పరిచయం చేస్తాను. నీకు కాస్త చేయూత నందిస్తే నువ్వు నా కంటే గొప్పవాడివై పోతావ్! మంచి చిత్రకారుడిగా, నగ్న చిత్రాల్ని గీయడం మొదట బాధన్పించినా, నువ్వు పైకొచ్చాక ఈ సమాజంలోని కుళ్లను వెలికి తీసి అందరికూ చూపించే అవకాశం వస్తుంది. అప్పుడు నీ చిత్రాలకు సరైన విలువుంటుంది.

సాన పట్టాకనే కత్తి జోరుగా తెగుతుంది...

మెరుగు ద్దిన తరువాతే బంగారు అందంగా ఉంటుంది....

ఈ రోజు నువ్వు ఓమూల తుప్పుపట్టిన కత్తిలా ఉంటే నీలో భావోద్వేగం. చేతి నైపుణ్యం అడవిని గాచిన వెన్నెల్లా ఉంటుంది. ఏ కళాకారుడికైనా ముందు గుర్తింపు ఉండాలి. గుర్తింపు లేనిదే ఎవ్వరూ పైకి రాలేరు" ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు చక్రపాణి.

అంతలో సౌజన్య రెండు గ్లాసుల్తో మంచి నీళ్ల తెచ్చింది.

చక్రపాణి అందుకొని తాగాడు.

"ఈ బీద స్నేహితుడు అంతకంటే ఈయ లేడురా!"

"నోర్మూయరా ! పెద్ద పెద్ద మాటలు మాట్లాడకు, అభిమానంతో ఇచ్చింది ఏదైనా ఒక్కటే!"

సుందరం చిన్నగా నవ్వాడు.

"వస్తా నా!" అని లేచాడు చక్రపాణి.

వెనకాలే గుమ్మం వరకూ వెళ్ళాడు సుందరం.

చక్రపాణి కారు డోర్ తెరచి "వస్తాన్రా నే చెప్పిందిమరచిపోకు....మళ్ళా నాకుఏదోటి



చెప్పాలి, నాకు ఫర్‌గా ఉంటావనే అనుకుంటున్నాను...." అని కారు స్టార్టు చేసాడు.

కారు వీధి మలుపు తిరిగే వరకూ అలాగే చూస్తూ వుండి పోయాడు సుందరం.

ఎంత పెద్ద పేరున్నా, ఎంత డబ్బున్నా స్నేహితునిగా, తోటి చిత్ర కారుడిగా గర్వం. దర్పం లేకుండా ఏ భావం లేకుండా తనాదరించిన పద్ధతుల్ని ధైర్యంగా చెప్తున్నాడంటే, చక్రపాణి చూస్తుంటే సుందరానికి వింతగా అన్పించింది.

కానీ ....

సుందరానికి పిచ్చిగా వుంది .... గదిలోకి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

"ఛీ ! వచ్చిన అంత మంచి స్నేహితునికీ, ...ష్మంతునికి ఎట్‌లీస్టు కాఫీయైనా ఈయలేకపోయాను ... తన జీవితం ఏమిటిలా మారింది. మానవుని కుండాల్సిన కనీసపు ...నందమైనా లేక పోయిందేం ? ఏంచేయాలి? ...నేం చేయాలి ?

సుందరం ఏదో ఆవేశం, ఆక్రోశం...... పిచ్చి, ఉద్రేకం ....

మరో వైపు నుండి ఆలోచిస్తే .... రేపు తన భాగస్వామితో తను కలిసిన మధురమైన మొదటి రోజు .... జీవితంలో మరో అందమైన మలుపు .... కానీ ఆ మలుపులో ఆమెకు ఎదురైనవి ఏమిటి ? నిరాశ, నిస్పృహ, ... తన అసమర్థత .... అవివేకం ! .... అంతే !

ఎదురుగా ఎన్నో చిత్రాలు ....రంగులు.... బ్రష్‌లూ ... కళ .... తను కష్టపడి నేర్చుకున్న కళ .... నేర్పున్న కళ .... విలువ లేని కళ ....

తను కళకు ఎన్ని మెరుగులు దిద్దుతున్నా, ఆ కళ తనకు మాత్రం వెలుగునీయడం లేదు ....

ఇలా ఎన్నో రకాల ఆలోచనా తరంగాలు సుందరాన్ని పూర్తిగా ముంచేసాయి.

○ ○ ○

మరునాడు సుందరం ఎక్కడికో హడావుడిగా బయలుదేరాడు ...

వెనుక ముందు లాలోచించలేదు ....

మంచి చెడ్డల్ని దృష్టిలో వుంచుకొన లేదు ....

సాయంత్రమయ్యే సరికి ఇంటికి వచ్చాడు.

ముఖం కాస్త అలసినా, ఆనందం ఆ అలసటను కప్పివేసింది.

చేతిలో ప్యాక్ సౌజన్య కిచ్చాడు.

ప్యాక్ విప్పి చూసింది.... పాల నురుగు లాంటి తెల్లని చీర ....

ఆ చీర వైపు ఆశ్చర్యంగా చూసింది ...

ఆమెలో కాంతికి సుందరం పొంగి పోయాడు.

"ఎక్కడిదండీ చీర ?" సౌజన్య ప్రశ్న !

"...అదేం ప్రశ్న సౌజన్యా! ఇదే కాదు, ...ఎన్నో మరెన్నైనా తెసాను...మగాడిగా, నీకు భర్తగా నేనెన్నైనా తేగలను ... ఐనా ఇంతటి ఆనంద సమయాన, మన తొలి సంగమపు గుర్తు రోజున ఇంకేమీ అడగకు" అని ఆనందంగా బాత్‌రూమ్ వైపు నడిచాడు.

సౌజన్యకేమీ అర్థం కాలేదు.

రాత్రి ఎనిమిది గంటలయ్యింది...

సుందరం కుర్చీలో కూర్చొని కిటికీలోంచి కన్పించే చంద్రునివైపు చూస్తున్నాడు.

ఈరోజు అతనిలో ఏదో మెదులుతూంది.

తనేదో మారిపోతున్నా డన్పిస్తుంది....

తను చేసింది తప్పేమో అన్పిస్తుంది....

కానీ ఆ మరుక్షణంలో తనే అనుకున్నాడు.

కాదు....తను చేసిందేం తప్పు కాదు.... ఒకొకప్పుడు నిలబడి నీళ్ల త్రాగితేనే మంచి దనుకున్నాడు....కానీ....త్రాగే నీళ్ళెవరివైనా, నిలబడికి స్థలం మాత్రం ఎవరిదో ఒకరి దయ్యేది! .... వాళ్ళు తమ స్థలంలో నిలబడ నీయనప్పుడూ ఎక్కడా నిలబడ లేదు ... పరుగెత్తుతూనే పాలు త్రాగాలి....

మంచో, చెడో తన అసమర్థత బహిర్గతం కాని విధంగా సమర్థించుకున్నాడు.

సుందరమే కాదు ... ఏ కళాకారుడైనా, ఎంత సమర్థుడైనా - ఓపిక లేనప్పుడు, రాజ మార్గం వెంట తను నడిస్తే ప్రాణం పోతుంద నుకున్నప్పుడు - తప్పకుండా అడ్డ దారి లోంచే గమ్యం చేరుకుంటాడు .... అలా .... ఎంతో మంది ఆ అడ్డు దార్లోంచే నడుస్తున్న ప్పుడు కొన్నాళ్ళకు, కొన్నేళ్ళకు ఆ దారే శుభ్రపడుతుంది ... అందంగా, సునాయా సంగా నడవ గలిగే దారి ఔతుంది ...

.... అప్పుడందరూ ఆ దారి వెంట నడవక మానరు ....

...ఇప్పుడుసుందరం అనుసరిస్తున్నదారి- అడ్డదారి - ఇప్పటికే అందంగా, సునాయా సంగా నడిచే దారయ్యింది ....

ముక్కు చూపమంటే తల చుట్టూ చేయి తిప్పి చూపించే వాళ్ళను 'వెర్రివాళ్ళ' అని మన పెద్దలే అన్నారు !

సుందరం వెర్రివాడు కాదు ....

సుందరం తెచ్చిన తెల్లని చీరలో పాలరాతి విగ్రహంలా వచ్చి నిలబడింది సౌజన్య.... ఆమె చేతిలో పాల గ్లాసు ....

నవ్వుతూ అందుకొని సగం త్రాగి సగం సౌజన్య కిచ్చాడు.

సౌజన్య ఆ పాలు త్రాగింది.

సౌజన్య భుజం మీద చేయివేసి మంచం వద్దకు నడిపించాడు.

ఇద్దరూ స్వీట్లు తిన్నారు. నవ్వుకున్నారు. కొంతసేపు నవ్వుల్లో కరిగిపోయి, ఆనం దపు సంద్రంలో కలిసిపోయారు.

"సౌజన్యా!" మెల్లగా పిలిచాడు సుంద రం.

"ఊఁ!" మత్తుగా కళ్లు విప్పి చూసింది సుందరం వైపు.

"నేను పెద్ద చిత్రకారుడిగా, ఎక్కడ చూసినా నేనే, ఎక్కడ విన్నా నేనే ఐపోతే నువ్వేమనుకుంటావ్?"

"ఏమనుకుంటాను? మావారంత సమర్థులు ఇంకెవరూ లేరనుకుంటాను..."

"ఐతే నేనిప్పుడు అసమర్థుణ్ణనా నీ ఉద్దే శం?"

"అయ్యో! నా ఉద్దేశం అది కాదండి..." గాభరాగా అంది సౌజన్య.

"పిచ్చి సౌజన్యా! అంత బెంబేలు పడిపోతా వేం? చాలా కరెక్ట్‌గా చెప్పావ్? ఏ స్త్రీ అయినా

తన భర్త పేరు మార్మ్రోగుతుంటే తన భర్తంత సమర్థుడు ఇంకెవరూ లేరని అనుకుం టుంది....ఆ భర్త సమర్థుడు కావడానికి తను చేయగలిగినదంతా ఆమె చేస్తుంది...ఔనా?"

"......." సౌజన్యకేమీ అర్థం కాలేదు.

ఆమె ముఖం చూసి సుందరం చిన్నగా నవ్వుకున్నాడు.

"సౌజన్యా! నేను మారిపోయాను...కొద్ది రోజుల్లో పెద్ద చిత్రకారుడిగా మారిపోతాను... అప్పుడు నువ్వు ప్రఖ్యాత చిత్రకారుడు సుంద రం శ్రీమతివి....అంటే....మిసెస్ సుందరా నివి...." అని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆ తరువాత "సౌజన్యా! నువ్వు నాకో సాయం చేయాలి...."

"ఏమిటండీ?"

"ఔను సౌజన్యా! నువ్వు నాకు ప్రేరణ కావాలి .... నీ నవ్వుకు నా కుంచె పులకిం చాలి .... నీ అందానికీ, నీ అవయవ సౌష్ఠా వానికి నా కుంచె పరుగులు తీయాలి.... రంగులన్నీ వాటంతటవే కలిసిపోయి ఓ రంగుల రంభలా తయారవ్వాలి ..."

"ఏమండీ! మీరేనా ఆ మాట లంటు న్నది ..."

"ఔను సౌజన్యా! నేనే! నీ సుంద రాన్నే! ఇన్నాళ్ళూ నా మనసును ఏదో మూసేసింది ... కానీ అది వట్టి పిచ్చిదని, అది నా జీవితానికే చిచ్చనీ, నా జీవితాన్ని మోడుగామారుస్తున్న విషపు పురుగనీఅప్పుడు తెలియలేను ... చూడు .... నీ వాలు చూపులో, సోగ కళ్ళల్లో, వంపు సొంపుల్తో నేనెలా ఎదిగిపోతానో! రా సౌజన్యా!" అని ఆమె పైటను పూర్తిగా ప్రక్కకు తొలి గించాడు.

ఆమె అందానికి ఓ బ్రష్ గభాల్న ఓ రంగులో మునిగి సర్రున కదిలింది.

అంతే!

పరిస్థితులకూ, సమాజ స్థితి గతులకూ, మానవ నైజాలకూ గురియై మరో మంచి కళాకారుడు దిగజారి పోతున్నాడని తెలిసి కళామతల్లి "చాటుక కంటినీరు చను కట్టు పయింబడ" భోరున ఏడ్చింది — ✱

విశ్వాంతరంగం

శైలకుమార్

నిండు గర్భిణి కడుపులావున్నాడు చంద్రుడు

ఆలోచనలు లేని మనసులా వుంది వెన్నెల. సాగగొట్టిన తీగెలాంటి సరుగుడుచెట్లు. అర్థం కానిస్త్రీ హృదయంలా సముద్రం.ఆవేశం తప్ప మరేమీ లేని అలలు.

అలల ఘోషను మరపించే మనసుతో ఇసుకలో వెల్లకిలా పడుకొని ఆలోచిస్తున్నాడు విశ్వం.

మాసిన పైజామా, కోరికల్లాగా పెరిగిన గడ్డం, ఎదురు చూపులతో లోతుకు పోయిన కళ్ళు, అస్థిపంజరాన్ని వెక్కిరించే శరీరం, ఇదీ అతని ఆకారపు అస్థిత్వం.

ఇందాక సగంతాగి దాచుకున్న సిగరెట్టును తీసి వెలిగించు కున్నాడు. పొగ వదులుతూ ఆలోచిస్తున్నాడు. అంత కంటే ఏమీ చెయ్యలేడు గనుక.

ఏమిటీ జీవితం? ఏమిటీ మనుషులు? మనుషులందర్నీ ఓ గదిలోకి తోసి డైనమైట్ పెట్టాలి. క్షణం క్షణం రాజీపడటానికి అలవాటు పడి, రాజు కోవటం మరచిన నిప్పులా వుంది ప్రపంచం. కదులు తున్న శవాల్లాంటి మనుషులు. అసలు మనిషికి ఏం కావాలి? ప్రేమా? శాంతా? సుఖాలా? లాలనా? కాదు ఇవేవీకాదు డబ్బు-అదుంటే అన్నీ వస్తాయి.

సిగరెట్ చేతిని కాల్చడంతో దూరంగావిసిరేశాడు దాన్ని ఒకప్పుడు...., కాలేజీలో చదువుతున్నప్పుడు ఎలా వుండేది తన జీవితం. అప్పుడు అందమైన బొచ్చుకుక్కలాగవుండేది, ఇప్పుడు గజ్జికుక్కలాగ వుంది. అప్పటికీ, ఇప్పటికీ మార్పేమీ లేదు. ఒక్కలాగే, కుక్కలాగే వుంది బ్రతుకు. అప్పుడూ ఇప్పుడూఏదో ఒకదానికి బానిస లాగే నడుస్తోంది.

కోపం వస్తోంది విశ్వానికి గతాన్ని తలచుకొని. పిడికిటి నిండా మట్టితీసుకుని సముద్రంలోకి విసిరేశాడు. ఎదుట పడ్డమనిషిని ఎముకలు విరిచెయ్యా లన్నంత కోపం.తనిలా మారడానికికారణం ఎవరు? ఎవరూకాదు. అందరూ. ఆలోచిస్తున్నాడు. లోలో చస్తున్నాడు.

ఎవరు తన తండ్రి? ఏమో తనకే తెలీదు. అసలీ లోకంలో ఎవ్వరికీ తండ్రెవరో తెలీదు తల్లి చెప్పిందాకా. తల్లి చెప్పలేదు. నిజం చెప్పాలంటే తన తండ్రి ఓ పచ్చకాగితం. కాగితం ఎన్నో పనులు చేస్తుందీ విశ్వంలో. మాంత్రికు లొకనాడు చిలకల్లో ప్రాణాలు దాచుకునే వారు, మనుషులీనాడు కాగితాల్లో దాచుకుంటున్నారు.

కలలా గడిచి పోయింది రెండేళ్ళ కాలేజీ బ్రతుకు. కలలో ఉలిక్కి పడి మేల్కొన్నట్లు జ్ఞాపకాల మెరుపులు తీరం చేరక ముందే విరిగి పోయిన అలలా ముగిసింది మూడో ఏడు. మిగిలింది బ్రాకెట్లో వేసుకో గలిగిన టియ్యే.

స్వప్నంలోకిస్వప్నంలా వచ్చింది"స్వప్న" ప్రేమకు భాష్యం ఆమె కళ్ళల్లో వెతుక్కుని. లాలిత్యానికి అర్థం ఆమె చీర కుచ్చిళ్ళపొత్తిళ్ళలో పాపాయిలా పడుకొని తెలుసుకుని, అనంతాన్ని ఆమెలో చూసి, ఆనందాన్ని ఆమెలో దాచి, జీవితం ఆమె గోరుకు వేసుకున్న ఎరుపు రంగుగా మార్చి, ప్రేమమైకంలో, స్వాప్నిక



లోకంలో, లతలా పెనవేసుకొని ఒక్క సంవత్సరం:

అయినా రమణ చెబితే తను విన్నాడా? ఆ రోజు రమణతో గుండెలోని గుసగుసలతో సహా అన్నీ చెబితే ఏమన్నాడు.

"ఒరే విశ్వం ఎందుకురా ఈ పిచ్చి,బుద్ధిగా చదువుకోక" "ఛ, ఇది పిచ్చి కాదురా. భావి జీవితానికి ఇప్పుడే వేసుకున్నముడి" "కవిత్వం మాట్లాడకు తంతాను. ఈ ప్రపంచంలో ప్రేమంటూ ఏదీలేదు. అంతా ఆకర్షణ, అటాచ్‌మెంట్" రమణ.

"అయితే మా ఇద్దరిదీ ప్రేమకాదంటావు?"

"ఔను, ఇద్దరి మధ్యా ఆకర్షణతో ఏర్పడిన అటాచ్‌మెంట్‌నే మీరు "ప్రేమ" అని పిలుస్తారు.అటాచ్‌మెంటు లేక పోతే ఏదీ వుండదు. చూడు నేను చస్తే నువ్వు ఏడుస్తావా? ఐమీన్ బాధపడతావా?" అడిగాడు రమణ.

"ఔను"

"అదే. పేపర్లో ఎవరో చనిపోయారని చదివావనుకో బాధ పడతావా" అడిగాడుమళ్ళీ రమణ

"లేదు"

"ఎందుకు"

"అదేమిట్రా, నువ్వంటే నా స్నేహితుడివి, కలిసి జీవిస్తున్నాం. అందుకు బాధపడతా. అంతేగానీ ఎవరో ముక్కూ, మొఖం తెలియని వ్యక్తిపోతే ఎందుకు పడతాను..."

నవ్వాడు రమణ. "చూశావా అదే మరి అటాచ్‌మెంట్. అంటే నీకూ నాకూ పరిచయం ఏర్పడి, ఒకర్నొకరు అర్థంచేసు కొని, స్నేహం పెరిగి, జీవితంలో కొంత కాలాన్ని కలిసి ఖర్చు పెడుతున్నాం అందుకే నా కోసం నువ్వు బాధపడతావు నా లోటు నీకు కనిపిస్తుంది కాబట్టి ఫీలౌతావు. కాల గమనంలో క్రమంగా మరచిపోతావు ఇదే నేను నీకు పరిచయం కాక ముందే ఏదైనా జరిగితే ఫీల్ అయ్యే వాడివి కాదు. దీన్నే అటాచ్‌మెంట్ అంటారు".

"ఒరేయ్ రమణా నీతో నేను వాదించలేను కానీ మేము ప్రేమించుకుంటున్నాం. కలిసి జీవించాలను కుంటున్నాం, అంతే"

"రేయ్ అదంతా నీ యిష్టం. కానీ చూడు "ఆమె లేకపోతే జీవించలేను, ఆమే నా సర్వస్వం అనుకుంటూ, ఒక వేళ ఆమె అందుబాటు లోంచి దాటిపోతే దేవదాసులా మాత్రం తయారు కావద్దు...

"అయినా నన్నొదిలి తను వెళ్ళదురా"

ఇదిగో యిలాంటి పిచ్చి నమ్మకాలే వద్దంటున్నాను. ఆశలెన్నో వుంచుకో, కాని అనుబంధాన్ని పెంచుకోకు. అనుబంధం బంధంగా మారకపోతే అనవసరంగా జీవితమంతా బాధ" అంటూ వెళ్ళిపోయాడు రమణ.

ఏమిటీ రమణ యిలా అంటున్నాడు. వాడు చెప్పిందాట్లో కొంత తర్కం వున్నా ఎలా అంగీకరించేది. మనసు నిండా ఆమె రూపమే వుండే. కనీసం ఊహల్లో కూడ మరచిపోలేక పోతున్నాడే, ఎలా ఆమె ప్రేమించలేదనుకోవటం? స్పందనగా. అణువణువులో పలుకుతున్న రాగంగా యింత బలీయంగా జీవితాన్ని అల్లుకుపోతే ... . అయినా ఆమె లేక జీవిత మెందుకు? దీన్ని ప్రేమ కాదని ఎట్లా అనుకోవటం. తన వల్ల కాదు. చనువై పోగానే స్వప్నను తీసుకొని అమ్మ దగ్గరికి వెళ్ళిపోవాలి. ఏమంటుందో అమ్మ ... అమ్మ ... అమ్మ ...

ం ం ం

పైకిలేచాడు విశ్వం. సిగరెట్ కోసంజేబులు వెతుకుతున్నాడు ఖాళీగా వున్నాయి. అటూ ఇటూ చూశాడు నిర్మానుష్యంగా, ఎడారిలా వుంది ఇసుక. పడుకొని ఆకాశంలోకి చూశాడు. ఎవడో పీల్చి వదలిన పొగలా తేలుతున్నాయి మేఘాలు.

"అమ్మ" అప్రయత్నంగా పలికాయి అతని పెదాలు ఎంత ప్రేమగా చూసింది అమ్మ తనని. ఇరవైయేళ్ళు వచ్చే వరకు ఆమె ఎలాజీవించిందో తెలియకుండా పెంచింది. తరువాత ఎలాగో తెలిసింది. అమ్మ ఉద్యోగం భూపతికి ఉంపుడు గత్తె. ఎంత అసహ్యం వేసింది. తనకు ఆ క్షణం అమ్మేకాకపోతే గొడ్డలితో నరికి చంపాలని పించింది.

సూటిగా చూడలేక పోతున్నాడు అమ్మని.


"ఇలాంటి డబ్బుతో నా నన్ను పెంచింది" కసిగా కోపంగాఅడిగాడు అమ్మని ఆమె ఏడుస్తుందని, ఏడుస్తూ ఏమేమో చెబుతుందని అనుకున్నాడు.

ఆమె అవేం చెయ్యలేదు. వేదాంతి లాగ ఒక చిన్న నవ్వు నవ్వి "డబ్బుకు అలాంటి, ఇలాంటి అనే తేడా లుండవురా-ఎలాంటి చోట వుంటే అలాంటి రూపంలో వుంటుంది"

"అమ్మా చేసిందానికి సిగ్గుపడక పైగా మాట్లాడుతున్నావా ఛీఛీ". "సిగ్గుపడాల్సి దినేను కాదు బాబూ, నాకు నిన్నిచ్చిన వాడు. నన్నీ స్థితికి తెచ్చిన వాడు"

ఆమె ముఖంలో శాంతం పోలేదు. విశ్వానికి కోపం తగ్గలేదు.

"బాబూ ఒక వయసులో వేసిన తప్పటడుగుకు, భ్రమకు నమ్మకమనే ముసుగు వేసుకుని మనిషిని నమ్మినందుకు, మనసుకావాలనుకున్న మనిషి మాట విన్నందుకు పవిత్రత శరీరానికి కాదు, ఆత్మకు అని అనుకున్నందుకు ఫలితం



నువ్వు"

"గౌరవం, పరువు, మర్యాద, తల్లి, తండ్రి, సంఘం, వీటన్నిటినీ జయించిన ఒకే ఒక్క మాట 'ప్రేమ' అన్నదానికి ఫలితం నువ్వు.

కడుపులో నీ అస్తిత్వానికి అంకురమే తప్ప ఆకారమే రాని స్థితిలోనే తన్ను మూద్దామనుకున్నాను. ఆ క్షణంలో నన్ను ఒడ్డుకు లాగింది భూపతి. నీకోసం బ్రతికాను, నిన్ను చంపే హక్కు నాకెక్కడిది అనే సినిమా డైలాగులు నేను చెప్పడం లేదు. ఆవేశం తగ్గాక నాకూ బ్రతకాలనే అన్పించింది.

చదువు లేనిదాన్ని, సంస్కారం ఎరుగనిదాన్ని, అందుకే అండగా నిలిచిన భూపతికి అన్నీ అర్పించాను. నాతోపాటుఆయనకొడుకు కాకపోయినా నీ బాధ్యతా తీసుకున్నాడు. అయితే అది ఆర్థిక రూపంగానే. ఆ మాత్రం చాలదూ? ఇది తప్పా? నేరమా?" జీరపోయింది ఆమె గొంతు, కళ్ళల్లో నీళ్ళు.

విశ్వానికి కళ్లు తిరుగుతున్నాయి. అమ్మ చెబుతున్న నిజాల్ని భరించలేక పోతున్నాడు.

మనిషి నిజాన్ని భరించలేడు. అబద్ధాన్ని అంగీకరించలేడు. నిజంలాంటి అబద్ధాలు, అబద్ధంలాంటి నిజాలు కావాలి వాడికి.

"విశ్వం సమాజాన్ని సరిగ్గా చూసి అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. ఇవేవీ ఆలోచించకుండా నీ రెండేళ్ల చదువూ పూర్తిచేసుకుని నీకంటూ ఓ జీవితం ఏర్పరుచుకో. నా గురించి ఆలోచించకు.

అమ్మదగ్గర నుంచి వచ్చేశాడు.

ఇదంతా స్వప్నకు చెప్పాలి. ఆమె దగ్గర ఏ రహస్యమూ దాచకూడదు. చెబితే ఎలా ప్రవర్తిస్తుందో

ఇసుకలో ఆమె ఒళ్లో పడుకుని అంతా చెప్పాడు విశ్వం.

అంతా విని అతని తలలో వేళ్లు పోనిచ్చి "బాధపడకు విశ్వం. ఇందులో నీ తప్పేముంది. నువ్వేం చేశావని. ఆ స్థితిలో ఆమె మాత్రం అంతకంటే ఏం చేస్తుంది. అయినా నిన్ను అపార్థం చేసుకుంటావని, వదులుకుంటానని ఎలా అనుకున్నావు. ధైర్యంగా వుండు" అన్నది.

ఆ ఒక్క నమ్మకం చాలు ప్రపంచాన్ని జయించడానికి. ఆ ఒక్క లాలన చాలు బాధను బరువులేకుండా అవతల పారేయడానికి. ఆ ఒక్క ఓదార్పు చాలు అంతా మరచిపోవడానికి. అంతా విన్న రమణ "అదృష్టవంతు

డివి, ఆమెను పోగొట్టుకోకు" అన్నాడు.

వందేళ్ల జీవితాలను అనుకోకుండా ఒక్కోసారి ఒక్కో క్షణాలు మార్చేస్తాయి. ఆ క్షణాల కుట్రకు జీవితం బలికావచ్చు, వెలిగేపోవచ్చు.

సుఖాల శరీరాలకు మామూలుగా వచ్చే గుండెపోటు వచ్చి పోయాడు భూపతి. తల్లి, ఆమెతోపాటు విశ్వమూ దిక్కులేనివాళ్లయ్యారు.

ఆర్థిక ఆదాయం లేనపుడు ఉన్నది అమ్ముకొని జీవించాలి. శిథిల శరీరం ఎవరూ కొనరు గనుక, ఇంట్లో వస్తువులు అమ్మసాగిందామె.

తను ఏమౌతానో అన్న దిగులుకన్నా, విశ్వం ఏమౌతాడో అన్న దిగులుతోనే కన్ను మూసిందామె.

దిక్కులేని విశ్వానికి దిక్కు దిక్కులే అయ్యాయి. అమ్మడానికి వున్నవన్నీ అమ్మేశాడు. చదువు ఆ పోయింది.

సానుభూతి తప్ప సహాయం ఏ మిత్రుడూ చెయ్యలేదు. రమణకు తెలివి వుంది, విశ్వాన్ని ఆదుకోవాలనే బాధ వుంది, కానీ డబ్బులేదు. ఈ దేశంలో తెలివి, బాధ తిండిపెట్టవు.

రమణతో వుంటూ, దొరికిన రోజు తింటూ తిరుగుతున్నాడు విశ్వం

○ ○ ○

ప్రబంధాల కాలానికి ముందునించీ వున్న పాత చంద్రుడే కొత్తగా వచ్చాడు. బీచిలో జన సంచారం ఎక్కువగా లేనిచోట స్వప్న ఒళ్లో విశ్వం. నిజానికి విశ్వమంతా స్వప్నం ఒడిలోనే వుంటుంది. ఎక్కడెలా వున్నా ఆమె ఒడిలో ఆతను చక్రవర్తి, ఆమె సామీప్యంలో అతడు చైతన్య దీప్తి.

"మనసంగతి మాయింట్లో తెలిసిపోయింది విశ్వం. నాకు చాలాగట్టిగా పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏం చేద్దాం?) "ఏదో విధంగా కొంత కాలం నెట్టుకురా స్వప్నా, ఈ లోపల ఏదైనా ఆలంబన దొరుకుతుంది. తరువాత ఇద్దరం కలిసే వుండవచ్చు"

"లాభం లేదు విశ్వం, ఇప్పుడు నేనేం చెప్పినా నమ్మరు పెళ్లి వాయిదా వేస్తున్న కారణం వాళ్లకు తెలిసి పోయింది. అందుకే ఇంకా తొందర చేస్తున్నారు, నువ్వు త్వరగా ఏదో ఒకటి చెయ్యాలి. లేదా...." బాధగా అంది స్వప్న.

"ఇన్నాళ్ల బంధమూ ఇంతేనా" విశ్వం.

"వాస్తవంలోకి వచ్చి ఆలోచించు విశ్వం. పరిస్థితులు మన చుట్టూ గోడలు కడుతున్నపుడు వాటిని ఛేదించుకు పోగల శక్తి మనకుంటేనే వెళ్లగలం, లేదా బందీలు కాక తప్పదు"

సిగరెట్టు వెలిగించుకున్నాడు విశ్వం.

"స్వప్నా ఇప్పుడే ఎక్కడికైనా వెళ్లిపోదాం, నాతో వస్తావా" దృఢంగా అడిగాడు విశ్వం.

"అంటే"

"మీ వాళ్లకు దూరంగా ఎక్కడికో మనమెవ్వరో తెలియని మనుషుల మధ్యలోకి వెళ్లిపోదాం"

"వెళ్లి ఏంచేద్దామని" బాధతో కూడిన వ్యంగ్యం ధ్వనించిందామె గొంతులో.

"కలిసి జీవిద్దామని"


"ఇంత తేలిగ్గా నువ్వు మాట్లాడతావనుకోలేదు విశ్వం. ఎక్కడికో వెళ్లి ఏంచేద్దామని? ఎలా జీవిద్దామని? ఇంత మంది తెలిసి వున్న ఇక్కడే ఏమీ చెయ్యలేని మనం, ఎవ్వరూ తెలియని ఎక్కడో ఎలా బ్రతకగలం. ప్రేమ మైకంలో పారిపోయినా తరువాత భయంకరాన్ని భరించక తప్పదు. రెండు రోజులు ప్రేమతో ఆకల్ని మరచి పోగల కాని. ఆ తరువాత ఇబ్బందులూ, ఆకలి పిడుగుల్లా నెత్తిన పడుతున్నపుడు ప్రేమ గుర్తుకు రాదు నీకళ్లల్లో నీకు కరుణ కనిపించదు. లోతుకు పోతున్న శూన్యమేదో కనిపిస్తుంది"

"అయితే ఏం చేద్దాం" ఆవేశంగా అన్నాడు.

"అది నీ చేతుల్లో వుంది. నీ పెద్దలు నన్ను మరో మనిషికి భార్యను చెయ్యకముందే ఏదో ఒక చిన్న ఉద్యోగం చూసుకో. ఆ క్షణమే నీ కోసం వచ్చేస్తా. లేదా ఆపై ఏం జరుగుతుందో."

రాత్రి అవుతోందని వెళ్ళిపోయింది స్వప్న. కొంతకాలంలోనే మరో మనిషి జీవితంలోకి వెళ్ళిపోయిందామె.

○○



లేచి కూర్చున్నాడు విశ్వం. విసుగ్గా ఉంది. గతాన్ని తలచుకుంటున్న కొద్దీ కసిగా వుంది. బట్టలన్నీ విడిచేసి అలల్లో కెళ్ళి తడుస్తూ కూర్చునాడు, మోసం చేసింది స్వప్న అనుకుంటూ.

"ఏం చేస్తుంది పాపం. ప్రతి స్త్రీలాగే తనూ భద్రత కోరుకుంది. అది నీ దగ్గర లభించదని తెలిసి వెళ్లిపోయింది. యాంత్రికత నుంచి విడివడి, కష్టాలతో కలబడి, మార్పు కోసం ముందు నిలిచేవాళ్ళు ఎప్పుడూ కొద్దిమందే వుంటారు అలాంటిది కాదు స్వప్న. అందుకే వెళ్లిపోయింది" అంది ఎక్కడో దాక్కున్న మనసు.

బిగ్గరగా సముద్రం ప్రతిధ్వనించేలా నవ్వాడు విశ్వం. మనసా నువ్వింకా నాలో బ్రతికున్నావా అని.

అలలు అతని శరీరంపై విరిగిపడు తున్నాయి. ఆలోచనలు అతని మస్తిష్కంలో మరిగిపోతున్నాయి. గానుగెద్దు కాలం తిరుగుతూనే వుంది. సముద్రం మొరుగుతూనే ఉంది.

తనిలా మారడానికి కారణం ఎవరు? ఎవరూ కాదు, అందరూ?

అమ్మ ఉంపుడుగత్తెగా మారడానికి కారణం... డబ్బు. తన చదువు ఆగటానికి కారణం.... డబ్బు. స్వప్న వదిలిపోవడానికి కారణం... డబ్బు.

ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతోంది. అదుంటే అన్నీ వుంటాయి.

భర్త చనిపోతే "ఈ పిల్లల్ని ఎలాపోషించాలి బాబూ" అని ఏడుస్తుంది భార్య. భర్త పోయాడనే బాధను మించి రేపటి ఆకలిపు దిగులుకనిపిస్తోందక్కడ. తండ్రి సంపాదిస్తున్న కాలంలో కొడుకుని గదమాయిస్తాడు, కొడుకు సంపాదిస్తున్న కాలంలో తండ్రిని డామినేట్ చేస్తోంది ఎక్కడా?


తలపట్టుకుని సముద్రంలోంచి బయటికి వచ్చాడు విశ్వం. ప్రపంచం మారాలి. తల్లిని గాలిలాగ, స్వచ్ఛమైన నీటిలాగ కమ్మని పాటలాగ ఎప్పుడు జీవిస్తాడు మనిషి? కులమతాల్ని మరచి, భయం అంటే ఏమిటో గుండెకు తెలీక డబ్బుకు దాసోహంకాక ఎప్పుడు జీవిస్తాడు మనిషి? కన్నీళ్లు కనబడని ప్రేమ పాలించేదెప్పుడు లోకాన్ని?

అన్నిటిపై అధికారంచెలాయిస్తున్న ఈ డబ్బును ఎవ్వరికీ లేకుండా చేస్తే? ఊహుం. అందరికీ అందుబాటులోకి తెస్తే.

ఔను, ఏదో చెయ్యాలి. తనలాగాఎవ్వరూ ఓడిపోకూడదు. ఏదో చెయ్యాలి. అందుకు కొంత హింసైనా భరించాలి. తప్పదు. దున్నితేనే భూమి పండుతుంది. కోస్తేనేపుండుమానుతుంది.

మనసు తెర స్వచ్ఛంగావుంది. బయలుదేరాడు విశ్వం. అనుకున్నది సాధించడానికి, సాధించాలనుకున్నదానికై సాహసించటానికి.

చీకటి పారదోలడానికి ఎర్రగాపైకొస్తున్న సూర్యుడి తూర్పు దిక్కుకి, కోయిల తీపిపాటలోకి, బందూకులు రాజ్యం చేస్తున్నా భయంలేని చోటికి, వేడీ వాడీ నిండిన గుండెలలోకి ...వెళుతున్నాడు విశ్వరూపం దాల్చి... విశ్వకోపంతోటి....విశ్వశోకంకూల్చ....విశ్వం. ✳



27 సీరియల్

పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు అంటారు. పాపం కొద్దీ టెలిఫోను అని కలుపుకోవచ్చు అనుకుంది జానకి ఆ మర్నాడు.

అలా అనుకోవటంలో ఆమెద తప్పేంలేదు.

తెల్లవారుఝామునే బుక్ చేస్తే వేగం వస్తుంది అన్న రాజేశ్వర్రావు మాట ప్రకారం, తెల్లవారు ఝామునే లేచి జగన్నాధానికి ట్రంకాల్ బుక్ చేసింది. ఎందుకేనా మంచిదని హాస్పటల్ నెంబరు, యింటి నెంబరు కూడా యిచ్చింది.

"హలో గుడ్‌మార్నింగ్ మేడమ్" అన్న ఆపరేటరు మేనర్సుకి ఆశ్చర్యపోయింది. మన టెలిఫోను వాళ్ళు బాగా యింప్రూవ్ అయేరే అని అభినందించింది కూడా.

అయితే ఆ అభినందనని వాళ్లు ఎక్కువ కాలం నిలబెట్టుకోలేక పోయేరు.

తెల్లవారింది ఫోను రాలేదు.

తొమ్మిదైంది. ఫోను రాలేదు.

ఓసారి ఎక్చేంజిని పిల్చి అడిగింది "మా పొజిషన్ ఏవిటని."

ఎక్చేంజి వాడు పొజిషన్ చెప్పలేదు. కాని ఎప్పుడు బుక్ చేసేరన్నాడు.

చెప్పింది జానకి.

"ఆర్డినరీవా ఎక్స్‌ప్రెస్సా?" చెప్పమన్నాడు.

ఎక్స్‌ప్రెస్సే నంది జానకి.

సరే. ట్రైచేస్తున్నాం. లైన్లు అంత బావున్నట్టులేవు. వస్తే మేమే పిలుస్తాం అన్నాడు.

మధ్యాహ్నం పన్నెండైంది.

ఎవ్వరూ పిలవలేదు.

మళ్ళీ పొజిషనేవిటని అడుగు దామని ట్రంక్ ఎంక్వయిరీన్ని పిల్చింది.

"సారీ మేడమ్ ఆ బోర్డు చాలా బిజీగా ఉంది. ఓ పది నిమిషాలు ఆగి రింగ్ చెయ్యండని సలహాయిచ్చేడు. పదినిమషాల తరవాత రాజేశ్వరరావు భోజనానికి వచ్చేడు. అతను జానకి కేసి ఓ సారి చూశాడు.

జానకి లేచి మొహం కడుక్కుని కాఫీ తాగింది. అంతే.

బాత్రూములో వుండగా ఫోను వస్తే అంచేత స్నానం చెయ్యలేదు. స్నానం చేయ్యలేదు. కాబట్టి తల దువ్వుకోలేదు. రాత్రంతా నిద్రపోయినట్టులేదు. మొహం అంతా పీక్కుపోయింది.

అప్పుడే జానకిని చూసిన ఎవరైనా "ఈవిడ ఇప్పుడిప్పుడే టైఫాయిడ్ నుంచి కోలు కుంటోంది కాబోలు" అనుకుంటారు.

ఆ పరిస్థితిలో జానకిని చూసిన రాజేశ్వరరావు జగన్నాథాన్ని మరోసారి తిట్టుకున్నాడు. తిట్టడం పూర్తి అయ్యేక తిన్నగా ఫోను దగ్గరికి వెళ్ళి ఫోనుతీసి ఎవర్నో పిల్చేడు. పిల్చి "ఎవరయ్యా ఆపరేటరు? సత్యవా? మూర్తి ఏవయ్యేడు? నైట్ డ్యూటీవా. సరే.... సరే... నేను డాక్టర్ రాజేశ్వర్రావుని. నమస్కారం... తెల్లవారుఝమున ఓ ట్రంక్‌కాల్ బుక్ చేశాం. అదెంతవరకు వచ్చిందో చెప్తావా... ఏవిటీ మెడ్రాస్‌నుంచి ట్రై చేస్తావా? మెడ్రాస్ నుంచి కాకపోతే మాస్కోనుంచి చేసుకో. పావుగంటలో మాత్రం వచ్చేటట్టు చూడు." అంటూ ఫోను పెట్టేసి "రండి. ఈలోగా భోజనం చేద్దాం" అన్నాడు.

"స్నానం..." నసిగింది జానకి.

పెళ్ళున నవ్వేడు అతను.

"మనం మడికట్టుకోవడం లేదుకాని రండి—స్నానానికి, అన్నానికి ఏం సంబంధంలేదు" అంటూ బలవంతంగా లాక్కెళ్ళేడు.

"ఆఖరికి ఫోనుక్కూడా రికమెండేషను కావాలి?" ఆశ్చర్యపోయింది జానకి అన్నం తింటూ.

"అనవసరంగా ఆశ్చర్యపోకండి. అదంతా నటన. నిజంగా "కాల్" వస్తే మీతోపాటు నేనూ ఆశ్చర్యపోతాను. నెంబరు నో రిప్లయి అన్నది వాళ్ళ స్టాక్ జవాబు...." అంటుండగా ఫోను రింగైంది.


నోట్లో పెట్టుకోబోయిన అన్నం మళ్ళీ కంచంలో పడేసి అంట చేత్తోనే పరిగెత్తింది జానకి. ఎండచేత్తో ఎత్తుకుంది.

"ఫలానా నెంబరేనా?" అడిగింది ఎక్చేంజ్.

ఔనంది జానకి.

"ఫలానా ఊరు ట్రంక్‌కాల్ బుక్ చేసేరా?"

చేసేనంది.



"ఆ నెంబరు ఫలానానేనా?"

జానకి ఓర్పు పోయింది.

"ఔను. కనెక్ట్ నివ్వండి" తొందరపెట్టింది.

కాని ఎక్చేంజ్ వాళ్ళకేం తొందరలేదు.

అంచేత తాపీగా "సారీ మేడమ్. ఆ నెంబరు నో రిప్లయి" అన్నాడు.

చేతిలో వున్న రిసీవరుని నీరసంగా రాజేశ్వరరావుకిస్తూ "నో రిప్లయిట" అంది.

రిసీవరు తీసుకున్న రాజేశ్వరరావు "నేను ముందే చెప్పలేదు" అన్నట్టు నవ్వి ఫోనులో "రెండో నెంబరు ట్రై చెయ్యవయ్యా. ఒకటి హాస్పటలు. రెండోది ఇల్లు. ఏదో ఒకటి పలకాలి" అన్నాడు.

"ట్రై చేసేం సర్. రెండూ నో రిప్లయి. కాన్సిల్ చేసేయమంటారా?"

"అది సరే. హాస్పటల్లో అంతా ఒక్కసారే చచ్చిపోయేరా ఏవిటి? నో రిప్లయి రావడానికి వీల్లేదు.

"మేమేం చేస్తాం సార్. మళ్ళీ మరోసారి ట్రై చెయ్యమంటారా?"

"ఒద్దులే కాన్సిల్ చెయ్యి."

కాన్సిలైపోయింది.

జానకి అంట చెయ్యి కడుక్కోకుండా అలాగే కూలబడిపోయింది కుర్చీలో.

అక్కడ పిల్లకెలా వుందో ఏవిటో? పోనీ జగన్నాథం ఓ ఉత్తరం రాయకూడదూ? రాయడు. ఎందుకు రాస్తాడూ? అక్కడికి ఆ బాధలన్నీ తనొక్కడే పడుతున్నట్టూ, ఆ బాధలకి కారణం తనే అయినట్టు. ఛీ! ఛీ!

మొగాళ్ళకి బుద్ధుంతదు.

మొగాళ్ళకి జ్ఞానం కూడా ఉంతదు.

ఇప్పుడేం చెయ్యడం? తెగించి వెళిపోతే ఇంత డబ్బు, శ్రమ వృథా. ఉందామంటే మన సొప్పడం లేదు.

జానకి మనస్సుని రాజేశ్వరరావు బాగానే చదవ గలిగేడు. అంచేత "చూడండి. ముందు లేచి భోజనం పూర్తి చెయ్యండి. బెంగపెట్టుకొని చెయ్యగలిగిందేమీ లేదు. రిప్లయి పెయిడ్ టెలిగ్రాం ఇద్దాం. తెల్లారేసరికి రిప్లయి వస్తుంది. లేవండి" అని ఓదార్చేడు.

అయినా జానకిక్కి అన్నం సహించలేదు.

చెయ్యి కడుక్కొని వచ్చి కూర్చుంది. మళ్ళీ పిల్ల గురించి ఆలోచించే లోపల వచ్చేడు అప్పన్న.

"తలుపులు అట్టుకొచ్చి ఏ జామైందండి. తవరుగోరు ఒస్తారేటోనని యీ పొద్దు దాకా కూకున్నాను. తవరో పాలి ఒస్తారేటి ?"

ఇష్టం లేకపోయినా బైల్దేరింది జానకి.

ఆ వేళ పెద్దపన్లేం లేక పోయినా ఓ యిద్దరు కూలీలు గదుల్లో పడిన సున్నం మరకలు కడుగుతున్నారు.

తలుపులు చూపించేడు అప్పన్న.

తెల్లబోయింది జానకి.

గొల్లుమన్నారు కూలీలు.

"ఏటి అప్పన్న మావాఁ. నువు సేసినవి తలుపులా ? పడవలా ?" అంది ఒకత్తె చేతులు తిప్పుకుంటూ.

"సేసిన పని సుబ్బరంగ్గుండాల. సేతగాపోతే ఒల్లకుండాల గాని ఏటీ ఎదవ పని ?" నిలదీసింది రెండోది.

జానకి ఏం మాట్లాడ లేదు.

ఆ కూలీలు అబద్ధం చెప్పలేదు. అని అచ్చు పడవల్లాగే వున్నాయి.

"మీ రొల్లకొండె. నాను సెప్పుకుంటాను. అమ్మగారూ ముంగల నాను సెప్పేది యినుకోండి. ఆనక నాది అబద్ధం అయితే తిట్టండి. ఆయేల యీడ నుంచి ఎల్లేనా? అంతే. మరింక నెగనేదు. పడవలా పడిపోనాను. జెబ్బు సేయిస్సి నాది. నా బెంగంతా నా జెబ్బు కోసం కాదు. అయ్యో. అమ్మగారికి మాటిచ్చినానే. ఎలారా బగమంతుడా అని ఒకటే యిదైపోనాను. ఆదుగో. ఆ టయములో బగమంతుడినాగే ఒచ్చి నాడండి మా బామ్మర్ది. కాని ఆడు మా గిరగాడండి. నాను సెయ్యనుగాక సెయ్యనన్నాడండి. కాని నాది మాటంటే మాటే. మరింక తిరుగులేదు. అంచేత ఆ బామ్మర్దిగాడ్ని బతిమిలాడి మరో అయిదు రూపాయలు ఎక్కువిచ్చి సేయిపిచ్చినాను. కానైతే నాకూ నచ్చనేదండి...."

"అదన్న మాట కత. ఏటా మా అప్పన్న మావఁ యిలాటి పన్జేసి నాడూ అనుకున్నాను. అయితే నువు కాదన్నమాట" అంది మొదటిది.

"అంతే అయ్యుంటాదండి. నేపోతే యీడు అలాటోడు కాడు" అంది రెండోది.

మొత్తానికి ఆ యిద్దరూ తలుపులు పడవలవడానికి కారణం అప్పన్న కాదని తేల్చేశారు.

జానకి ఏం మాట్లాడలేదు.

"తవరు గోరు ఒప్పుకుంటే మళ్ళీ అట్టుకెల్లి సేసుకొత్తాను. మరి....మేకులు అయీ కొత్తయి కొనాల. మరో యిరవై రూపాయలౌతాది." అన్నాడు అప్పన్న.

అసలే పొద్దుటి నుంచి ఫోను వ్యవహారంతో చికాగ్గావున్న జానకి యీ తలుపుల వ్యవహారంతో మరీ చికాకెత్తి పోయింది.

తలుపులూ లేవు. ఏం లేవు.

"ఫో" అంటే?

వాడికేం నష్టం?

అనొచ్చు.

కాని బాత్రూములుకి తలుపుల్లేకపోతే ఎవరు అద్దెకు వస్తారు?

మరింక లొంగక తప్పలేదు.

"సరే తీసికెళ్ళి జాగ్రత్తగా చేసుకురా. రేపు సాయంత్రం తేవాలి." అంది.

జానకి దగ్గర మరో ముప్పై రూపాయలూ, ఆ పడవలూ తీసుకొని వెళ్ళిపోయేడు అప్పన్న.


(సశేషం)

మనసు సంగతి

డా॥ జయా నాగరాజ్

ఆమె కళావంతుల కులంలో పుట్టింది. కళలు అభ్యసించింది...కాని తాడు బొంగరం లేని దానిలా, తెగినగాలి పటంలా జీవితాన్ని గడప డానికి వెగటు పుట్టింది. అందరు స్త్రీలలాగా వివాహం చేసుకుంటానన్నది! కులంలోని వారు తమ సాంప్రదాయం అదికాదని, దేవ దాసిగా వుండటమే తమ జీవిత పరమార్థమని చెప్పారు. వయస్సు వచ్చింది....కోరికలు పురి విప్పాయి.సత్యనారాయణ వ్రత పారాయణానికి ఒకసారి వెళ్ళి సత్యనారాయణుని మీద కీర్తనలు పాడుతూ పాడుతూ తూలి పడిపోయిందామె. ....ఆ దేవదేవుణ్ణి ఎలుగెత్తి పిలిచింది....అంతే ...పిలిచే పలికే మన దేవుళ్ళ దేవతలు "ఓ" అన్నారు ఆమె పిలుపుకు...పూజలో పాటలు పాడుతున్న ఆమెలో సత్యనారాయణ స్వామి ప్రవేశించి ఆమె "పద్మావతీదేవి" అని ప్రకటించి తాను శ్రీనివాసుడనని చెప్పుతున్నాడు. చిన్న రాగి విగ్రహం స్వామిది....ఆమెఒడిలో పడింది. ఆమెతో వుండి పోతానన్నాడు దేవుడు...అచిర కాలంలోనే వెంకటేశ్వరుని విగ్రహం ఆమె ఇంట్లో వెలసింది...ధూప దీపాలు ... పూజాపురస్కారాలు .... సుప్రభాతం, పవళింపు సేవ జనం...తీర్థప్రజలు...! పళ్ళు, కాయలు, పువ్వులు. దేనికి కొదవ లేక పోయింది. దీంతో ధనానికి కూడా లోటు లేదు. వడ్డీకాసులవాడే తనవాడైన నాడు డబ్బు కేమి కొదవ.? చిన్నయింటి నుంచి పెద్దయింటికి తరలాడు దేవుడు. స్వామివారి ఒడ్డూ పొడుగూ కూడా పెరిగింది. ఆమె దశ మారింది. ఎటువంటి వ్యాధినైనా ఆమె నివారణ చేయ సాగింది, పిల్లలు లేని వారికి పిల్లల నివ్వడం దగ్గరనుంచి! మానసిక వ్యాధులు కూడా యిట్టే నయమయ్యేవి.!! రోజులు గడిచాయి. తన సంపాదన పెరగడంతో, పూరూ

ఆమె కృష్ణుడితో అన్నీ అనుభవించింది



ఖైదు

నేనే ఆలోచిస్తూనే ఉంటా
ఒప్పున నా గుండె ఆగిపోతుంది
నా ఆలోచన కొట్టుకుంటూ ఉంటుంది
గుండెలా
గోడు గోడున
హోరు హోరున__
నా ఆలోచనకు
ఆత్మీయతా నిగళాలు తొడిగావు నువ్వు,
నేనేం పాపం చేశాననీ
నా శ్వాసనీ, వూపిరినీ
ఇలా శాసిస్తున్నావు?
నా మెదడుని ఖైదు చేసి
మర మేకులు కొడ్తున్నావు?

— సలీం


పేరూ లేని వాడంతా బీరకాయపీచు సంబంధాలు పెట్టుకొని చుట్టూమూగి ధనం దుర్వినియోగం చేయడమే కాక వ్యసనాలకు నిలయంగా మార్చారా దేవాలయాన్ని.

అ నా, అన్ని రోజులు మనవి కావు! తను చేస్తున్న యీ కార్యక్రమ మీద విసుగు పుట్టింది ... మనసు బెదిరించింది. (గిల్టీ ఫీలింగ్స్) తప్పు చేస్తున్నానే మోనని భయం కలిగింది దానితో ఆమెకు పిలిస్తే పలికే దేవుడు పలకడం మాని వేశాడు. కలలో కన బడి భక్తుల సమస్యలకు పరిష్కారాలు చెప్పడం మానుకున్నాడు ... అసలు ఆమెకు నిద్రే పట్టడం లేదు. (ఇన్‌సోమ్నియా)! మరి కలలెలా వస్తాయి ... ? దానికి ఆమె చాలా కృంగి పోయింది (డిప్రెషన్) గుండెలో బరువు ... అకారణంగా భయం ... తనను ఎవరో వెంబడిస్తున్నారని భ్రమ .... తన కార్యక్రమాలన్నింటినీ కని పెడుతున్నారనే నమ్మకం. దీనితో మానసిక రుగ్మతకు లోనయిందామె ఇన్‌కమ్ టాక్స్ అధికారులు ఇటివి సోదా చేసేసరికి ఆమె పూర్తిగా కృంగిపోయి .... బెదురు చూపులతో అటూ ఇటూ చూస్తూ మతిస్థిమితం లేనిదయింది. (పెరనోయిడ్ పేత్ ప్రెస్సిక్యూటరి డెల్యూషన్స్) అప్పటి వరకూ ఆమె కొంగు పట్టుకు తిరిగిన శ్రీనివాసుడు చెప్పా పెట్టకుండా ఛలో అన్నాడు. మరో పద్మావతిని వెతుక్కుంటూ ... ...

2

ఆమె రాధ. అలనాటి వెన్నెల రాత్రులలో యమునా నది తీరంలో.... బృందావనంలో కృష్ణుని కోసం విరహ వేదన పొంది కృష్ణుని మురళీ రవంలో లీనమైపోయిన రాధను మించి పోయింది రాధ. బృందావన రాధ సౌందర్యం మాటేమో కానీ ఈ రాధ మటుకు చక్కని చుక్క. తెల్లటి రంగు, ఎర్రని పెదవులు, ఒకసారి చూస్తే మరో సారి చూడాలనిపిస్తుంది.

రాధ పదిహేనో యేట తండ్రి చని పోయాడు. ఆస్తులున్నాయి. తల్లి. పిల్లలను పెంచటం... మామయ్యలు కొంత మోసం చేయడం జరిగింది. కొంత విరక్తిని జీవితంలో ఆ లేత వయసులోనే పెంచుకుంది. పదిహేడవ యేట ఆమెకు యిష్టంలేక పోయినా పెళ్ళి చేశారు. సురేష్ ఇంజనీరు. కొంత అనాకారేనని చెప్ప వచ్చు. నలుపు....కాని మంచి సాంప్రదాయమైన కుటుంబం. జీవితంలో పైకి రావడానికి కష్టపడాలని నమ్మే వాడు. దేవతలు. పూజలు, వ్రతాలు అతనికి నచ్చవు. వెన్నెల రాత్రుల్లో మైమరచి గడపమన్నా, ఆకాశాన్ని చూస్తూ తేలిపోయే మబ్బుల మీద భావ విహారం చేయడమన్నా అతనికి గిట్టదు. అస్తమానం పుస్తకాలు



ముందు వేసుకొని చదువుతూ, ఎన్నో డిగ్రీలు సంపాయించాడు. కాని భార్య రాధతో సవ్యమైన దాంపత్యం సాగించలేక పోయాడు. ఉద్యోగ రీత్యా కేంపులకి కూడా నెలల తరబడి తిరగవలసి వచ్చేది ...

పెద్దయిల్లు-నౌకర్లు చాకర్లూ వున్నా,రాధకు ఒంటరి తనం భరింపరాని దయ్యింది. ఆ సమయంలోనే రాధకు మదన గోపాలుడు సితగా మారాడు, ఆమెలో లీనమై సరాగా లాడటం, ఊహాలోకంలో విహరింప చేయడం (ఫాంటసీ) అప్పుడప్పుడు ప్రేమకి ఆమెలో ఒకతియ్యటి బాధను కలిగించటం మొదను పెట్టాడు కొంటె కృష్ణుడు. రాధ చాలా సార్లు తన భౌతికదేహాన్ని వదిలి కృష్ణునితో బృందావనానికీ, ఆకాశ విహారానికి వెళ్ళేది. కృష్ణుడు తనను పిలుస్తున్నాడని, ఆదేశించాడని కొన్ని చోట్లకు ఒంటరిగా బయలు దేరి వెళ్ళిపోయేది. రాధ తరచు సుషుప్తావస్థ (ట్రాన్స్‌స్టేట్) లోకి వెళ్ళేది. ఆ సమయాలలో ఆమె విహరించని ప్రదేశాలు లేవు. చూడని దృశ్యాలు లేవు.

ప్రతిరోజూ తనకు కావాలను కున్నప్పుడు ఆమె కృష్ణుని తన వద్దకు పిలుచుకోగలదు. ఒక్కొక్కప్పుడు శ్రీ కృష్ణుడు బాలకృష్ణుడై వచ్చి తన చను బాలే త్రాగాడు. మరోసారి యౌవన గోపాలుడై వచ్చి ఆమెను అనుభవించాడు. ఒక్కొసారి ఆమె గుండెలు పిండి పీడించేవాడు. ఈ సమయంలో ఆవిడకు విపరీతంగా గుండె నొప్పి వచ్చేది. దేశంలోని హృద్రోగ వైద్యులు ఏమీ కనిపెట్టలేక మానసిక వైద్య సహాయం కోరారు. అన్ని సంగతులూ చక్కగా మాటలాడగలదు. కాని కృష్ణుని మాట ఎత్తితే మాత్రం ఆయాసపడకుండా గంటల తరబడి తను పొందుతున్న అనుభూతిని (ఎక్స్‌పీరియన్స్) వర్ణిస్తుంది. నిజంగానే తాను శ్రీకృష్ణునితో ఆట పాటలు సాగిస్తూ అతని తోనే జీవితం గడుపుతున్నాననీ, ఈ జీవితం ముగియగానే భౌతిక దేహాన్ని వదిలి అందరూ చూస్తుంతగానే కృష్ణునిలో లీనమై పోతాననీ ఆమె నమ్మేది. దీనిని (మోనోసింప్టొమాటిక్ పెరోనిక్ హేల్యుసినేషన్స్ అండ్ డెల్యూషన్స్) లేని దానిని ఉన్నట్టు, జరగని, జరగలేని సంఘటనలు జరుగుతున్నాయని నమ్మే మానసిక రుగ్మత ఇది! ✱

తెలుగువారి ఒక తేజఃపుంజం

పొట్టి శ్రీరాములు

ఆంధ్రప్రదేశ్ అవతరణ రజతోత్సవాల సందర్భంగా ఆనాటి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని ఛాయామాత్రంగా మా పాఠకులకు గుర్తుచేసే ఉద్దేశంతో ప్రముఖ సామాజిక వ్యాఖ్యాత సి. ధర్మారావు గారి ఈ రచన ప్రచురిస్తున్నాము. —ఎడిటర్.

"ముక్కోటి ఆంధ్రుల అకుంఠిత దీక్ష
అజేయ సంకల్పం....
ఆంధ్ర రాష్ట్రం ఆగమనం
అసత్యం కాజాలని చారిత్రక వాగ్దానం...."

అని మహాకవి పాడాడు-నిజమే కావచ్చు. కాని నలభై ఏళ్ళుగా నెరవేరని వాగ్దానం అది. రాజాజీ ముఖ్యమంత్రిత్వంలో వున్న అప్పటి అవిభక్త మద్రాసు రాష్ట్రం నుంచి విడివడి, ఆధునిక భారత చరిత్రలో మొదటి భాషా పరి రాష్ట్రంగా 1953 అక్టోబరు ఒకటిన ఆంధ్ర రాష్ట్రం అవతరించింది.

ఆ విధంగా చారిత్రక వాగ్దానం నెరవేరింది. కానీ అటువంటి వాగ్దానం నిజం కావటానికి కూడ ఒక వ్యక్తి అవసరం అవుతాడు. అతను అసాధారణుడు అయి వుంటాడు. ఒక త్యాగం అవసరం అవుతుంది. అది నిరుప మానం అయి ఉంటుంది.

అట్లాంటి వ్యక్తి పొట్టి శ్రీరాములు. అప్పటి కింకా 'రిలే' నిరాహారదీక్షలు లేవు. సిసలైన నిరాహారదీక్షలు పట్టినవారు కూడ ఎంతోమంది వున్నారు. నిజానికి శ్రీరాములుగారు సబర్మతి ఆశ్రమంలో పదకొండు సంవత్సరాలు గాంధీజీ సాన్నిధ్యంలో శిక్షణ పొందిన సత్యాగ్రహ యోధుడు శ్రీరాములువంటి నిష్కామ కార్య తత్పరులు పదిమంది వుంటే స్వరాజ్యం ఒక్క రోజులో సాధించవచ్చని మహాత్ముడి మెప్పు పొందిన అకుంఠిత కార్యకర్త ఆయన. స్వరాజ్యం వచ్చాక కూడ గాంధీజీ నిర్యాణా నంతరం 1948 లో హరిజనోద్ధరణ కోసం ఏకధాటిగా 29 రోజులు కఠోర నిరశనవ్రతం సాగించి తన ఆశయాన్ని చాలవరకు సాధించు కున్న వీరుడాయన. ఆ బడుగు దేహంలో ఎక్కడో వుంది ఆ వజ్ర సంకల్పం!

అయితే కీర్తిశేషులు కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, బులుసు సాంబమూర్తి, కాశీనాధుని నాగేశ్వరరావు ప్రభృతుల ఆశీస్సులతో మద్రాసు మైలాపూరులో సాంబమూర్తి గారి ఇంట్లో ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19న పట్టిన ఉపవాసదీక్ష భిన్నమైనది ఆ దీక్షకు విరమ ణంటూ లేకపోయింది. అయిదు రోజులుకాదు, పదికాదు, ఇరవై ... ముప్ఫయి.... నలభై.... యాభై.... చివరికి యాభై ఎనిమిది రోజులు సాగింది ఆ ఆత్మాహుతి యజ్ఞం. ఆ డిసెంబరు పదిహేను నడిరాతిరి చలిగాలుల్లో ఆయన ప్రాణ వాయువులు కలిసిపోయాయి.

○ ○ ○

చలిరాత్రి చీకట్లలోనే వార్త మద్రాసు నగరమంతా పాకింది. మనస్వాడు చీకటి విచ్చుకుంటున్న ఘడియలకే లక్షలాది మద్రాసు ఆంధ్రులు మైలాపూరు వైపు నడిచారు. ఆ జనవాహినిలో ప్రతి తెలుగువాడూ స్వయంగా

సి. ధర్మారావు

తన ఇంట్లో ఏదో పోగొట్టుకున్నట్టు వ్యథ చెందాడు. ఆక్రోశం, ఆగ్రహం, అవమానం అతన్ని చుట్టుముట్టి వెర్రివాడిని చేశాయి. తక్షణం అతనికి తోచింది చేశాడు. మద్రాసు మహానగరమంతా హర్తాళ్ జరిగింది.

మద్రాసు నగరానికి వెలుపల ఉత్తరంగా కళింగంవరకు పరచుకుని వున్న ఆంధ్రదేశం వ్యథతో ఘూర్ణిల్లింది. మహర్షివంటి ప్రియ బాంధవుడి బలి దానానికి ఫలం కోరి, మంకుగా మొండిగా మూర్ఖంగా లేచి నిలబడ్డది. బళ్లారి నుంచి బరంపురంవరకూ, బందరునుంచి చాంధా వరకు రైళ్ళు ఆగిపోయాయి. వార్తాప్రసార సాధనాలు తెగిపోయాయి. మార్కెట్లు మూత పడ్డాయి. తెలుగు జీవితం నిలిచిపోయింది. యాభై ఎనిమిదిగంటలు తిరగకుండా ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణం ప్రధాని నెహ్రూ ప్రకటించారు.

° • °

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయం ప్రధాని నెహ్రూనో, కేంద్ర ప్రభుత్వమో మొండివైఖరి అవలంబించి తెగేదాకా లాగేరని అనుకుంటే పొరపాటవుతుంది. ఈ చరిత్ర క్లుప్తంగా అవలోకన చేద్దాం.

అసలు దేశంలో భాషాపరంగా రాష్ట్రాలను పునర్నిర్మించాలనే వాంఛకు బీజం పడింది— బ్రిటిషువాళ్ళు తమ ఎత్తులలో భాగంగా 1906 లో సమైక్య బెంగాల్ రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చీల్చినప్పుడు. దీనికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం మిన్నుముట్టగా విదేశీప్రభుత్వం తిరిగి 1912 లో బెంగాల్‌ను ఏకం చేసింది. అప్పటినుంచి స్వభాషాభిమానం జాతీయోద్యమంలో అంతర్వాహినిగా వుంది. అఖిల భారత కాంగ్రెసు 1918 లో భాష ప్రాతిపదికగా పునర్నిర్మాణం అయింది. మరో ఏడేళ్ళకు ప్రత్యేకంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. అప్పటి ఆంధ్ర ప్రముఖులు 1915 నుంచీ ఆంధ్ర మహాసభగా ఏర్పడి, ఆంధ్ర దేశంలోని ప్రతి ముఖ్య పట్టణంలోనూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర నిర్మాణావసరాన్ని చర్చిస్తూనే వున్నారు. ఈ కోర్కెను మొదట్లో కొందరు రాజాలు, జమీందార్లు వ్యతిరేకించారు. విద్యా విషయకంగా, ఆర్థికంగా కొంత ముందున్న కోస్తా జిల్లాలవారి ప్రాబల్యం ఎక్కువగా వుంటుందన్న అనుమానం రాయలసీమ ప్రజని తర్వాత చాలాకాలం వేధించింది. నెల్లూరుజిల్లా సరేసరి. మద్రాసు నగరంతో వారికి చాలా సన్నిహిత సంబంధాలున్నాయి.

1928 లో సైమను కమిషన్‌ను బహిష్కరించి పన్నుల నిరాకరణను జయప్రదం చేయటంలో ఆంధ్రదేశం అగ్రగామిగా నిలబడింది. అప్పుడే మన టంగుటూరి అపూర్వ సాహసం ప్రదర్శించి ఆంధ్రకేసరి అయ్యాడు. దీనికి కినుక వహించిన బ్రిటిషుప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమంటే ఎప్పుడూ శీతకన్నే వేసింది. అంతకుముందు భాషాపరంగా ఒరిస్సా, సింధు రాష్ట్రాలని కొత్తగా ఏర్పాటు చేసికూడ తెల్లప్రభుత్వం ఆంధ్రులవద్ద కొచ్చేసరికి పెడముఖం పెట్టింది. చివరకి ఎట్లా అయితేనేం, అన్ని ప్రాంతాలు ప్రజల్ని కూడగట్టుకుని, 1937 లో అఖిలభారత కాంగ్రెసు కమిటీచేత ప్రత్యేకాంధ్ర తీర్మానం నెగ్గించటంతో ఆంధ్ర నాయకులు కృతకృత్యులయ్యారు.

తర్వాత క్విట్‌ఇండియా ఉద్యమం తీవ్రతలో ఈ సమస్య వాయిదా పడింది. 1947 లో స్వతంత్రం వచ్చింది కాని బృహత్తరమైన కాందిశీక సమస్యను వెంట తెచ్చింది. తర్వాత గాంధీజీ హత్య. 1950 నాటికి మళ్ళీ ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం పుంజుకుంది. అయితే రెండు కొత్త సమస్యలు తలెత్తాయి, అప్పుడప్పుడే రాజకీయాధికారం రుచి మరుగుతున్న రాజకీయవేత్తల్లో కొత్త రాష్ట్రంలో తమ తమ ప్రాబల్యాన్ని విస్తరింప చేసుకోవాలనే తాపత్రయం పెరిగి కుమ్ములాటలు అధికమయ్యాయి. ప్రకాశం, సాంబమూర్తి, మొదలైన నాయకులు మద్రాసు నగరం చారిత్రకంగా ఆంధ్రులదే, అది కొత్త ఆంధ్రరాష్ట్రానికే చెందాలని పట్టు పట్టారు. ఈ వాదన ఇప్పటితరంవారికి వింతగా తోచవచ్చు. కాని యిప్పటికీ, 30 లక్షల జనాభావున్న మద్రాసు నగరంలో అయిదు లక్షలు తక్కువకాకుండా తెలుగువారున్నారు.

పశ్చాత్తాపము

పశ్చాత్తాపము అనగానేమి? జేబులు దొంగిలించే కుర్రవానిని పోలీసులు పట్టుకున్నారు. వాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. పట్టుబడ్డాను కదా అనే యేడ్పుగాని, అది పశ్చాత్తాపము వలన కలిగినది కాదు. పట్టుబడకపోతే చేస్తున్న పాపములోనే ఆనందిస్తారు. మరో వ్యక్తి నిర్దోషియైన భార్యను అనుమానించి ఆమెను రహస్యముగా హత మార్చాడు. అటు పిమ్మట సత్యము వెల్లడి అయ్యి ఆమె యొక్క నిర్దోషిత్వము నిరూపింపబడింది. చేసిన పాపానికి కృంగి, కృశించి విలపిస్తున్నాడు. ఏదో ఒక ప్రత్యేక పాపం గురించి ఏడ్వటం పశ్చాత్తాపము కాదు. క్రీస్తు ప్రభువును ముప్పై వెండి నాణెములకు అమ్మివేసిన యిస్కరియోతు యూదా ఉరి పోసుకునే మరణించాడు. నిరపరాధిని పట్టించి పాపం చేశానని భయం. దేవుని న్యాయ తీర్పును ఎదుర్కోవాలని కలత చెంది ఆత్మ హత్యకు పాల్పడడం పశ్చాత్తాపము కాదు. గుండె జబ్బు వచ్చిందని త్రాగుడు మానేయడం, ఊపిరితిత్తులకు కొరుకుడు పుండు వచ్చిందని సిగరెట్లు మానేయడం, సుఖ రోగాలు అంటు కొన్నాయని కేళీ గృహాలకు స్వస్తి చెప్పటం పశ్చాత్తాపము కాదు. ఉపవాసాలు, నోములు, పుణ్యస్నానాలు, వ్రతాలు, దానాలు, ధర్మాలు, సత్క్రియలు వీటిని ఒనర్చటం పశ్చాత్తాపము అనిపించుకోదు.

చెట్టంతా పురుగు పట్టితే ఒక కొమ్మను నరకుట వలన లాభం ఏమిటి? ఓడలో నాలుగు, అయిదు కన్నాలుపడితే ఒక కన్నం పూడ్చుట వలన జరిగేది ఏమిటి? దొంగలు చొరబడుటకు అయిదారు తలుపు లుండగా ఒక తలుపు బంధించినా ప్రయోజనం ఏమిటి? పశ్చాత్తాపము అనగా తెలిసిన ప్రతి పాపము నుండి తిరిగి పోయి క్రీస్తు ఆదేశించిన నీతి మార్గములో నడిచి పోవుటయే. కన్నీళ్ళు వచ్చినా, లేకున్నా, వేదనవున్నా, లేకున్నా, అనుభూతి కలిగినా, కలుగక పోయినా, "సంపూర్ణముగా హృదయములో పరివర్తన చెందుటయే పశ్చాత్తాము", దొంగతనం, వ్యభిచారం, అబద్ధము, కంటికి కనిపించే పాపాలు, స్వార్థం, అసూయ, అహంభావం, ఈర్ష్య, గర్వము, ఓర్పులేని తనము, కంటికి కనపడని పాపాలు. శిక్ష తప్పించుకోవాలని కాకుండా మన అంతర్యములోని నీచత్వము గుర్తించుటయే పశ్చాత్తాము.

పాపాన్ని దాచిపెట్ట కుండా, దాని కొరకు సాకులు చెప్పకుండా యింకొకరి నెత్తిమీద రుద్దాలని ప్రయత్నించకుండా, నల్లని కుంచెతో తన పాపాన్ని చిత్రించి దానిని అసహ్యించుకొని విడిచిపెట్టి పాప క్షమాపణ కొరకు కన్నీళ్ళు కార్చుటయే కాకుండా హృదయ పవిత్రత కొరకు పరితపించుటయే పశ్చాత్తాము.

పాపాము కొరకు యిట్టి పశ్చాత్తాము మీరు కలిగియున్నారా?

అంటే ఆరోవంతు అన్నమాట. అప్పటి కయితే జనాభాగాని, నగరంలో పెట్టుబడులు గాని దాదాపు సగం ఆంధ్రులదే, సినిమా పరిశ్రమ యింకా అక్కడినుంచి తరలిరాలేదుగదా. ("జ్యోతి"మాస పత్రిక కూడా ఈ మధ్యనే గదా మద్రాసు నుంచి హైదరాబాదు మకాం మార్చింది). ఏమైనా ఆనాటి ముఖ్యమంత్రి రాజాజీ, ఆంధ్ర రాజకీయ వేత్తలలోని అనైక మత్యాన్ని హ్రస్వ దృష్టిని బాగా వుపయోగించుకుని రాష్ట్ర నిర్మాణం ఆలస్యం కావటంలో నెగ్గాడు.

ం ం ం ం

నలభై ఏళ్లుగా ఆంధ్రజాతి కంటున్న ఈ సుందరస్వప్నం యిట్లా ఎప్పటి కప్పుడు నీరు కారి పోవటం చూసి రాష్ట్ర వాంఛతోనే కాని రాజకీయాలతో మమేకం లేని ఆంధ్ర ప్రముఖులు నిర్వేదం చెందారు. అప్పుడు నిగర్వీ నిశ్చల చితుడూ అయిన పొట్టి శ్రీరాములు రంగ ప్రవేశంచేసి తన వజ్రసంకల్పం ప్రకటించాడు. అందుచేత ఆయన నిశ్శబ్దంగా, నిశ్చలంగా యాభై ఎనిమిది రోజుల పాటు దీక్షంగా సాగించిన యజ్ఞంలో కాల్చివేసింది – కేంద్ర ప్రభుత్వ ఉదాసీనతనీ, వ్యతిరేకతనీ కాదు. ఆంధ్రనాయకుల స్వల్ప బుద్ధుల్ని, అల్ప ప్రేరణలల్ని క్రమక్రమంగా ప్రజ తమ హైన్యాన్ని అనుమానాల్ని వ్రేల్చివేసుకుని ఉజ్వల ఆశయప్రేరితులై ఒక్కతాటిమీద నడిచారు. ఫలశ్రుతి సాధించారు.

ఎవరీ పొట్టి శ్రీరాములు, ఎక్కడివాడు? 1901లో జన్మించిన ఈ పునీతుడి జన్మస్థలం నెల్లూరుజిల్లా జువ్వల దిన్నెపాలెం. ఇంజనీరింగు చదివి, బొంబాయి రైల్వేలో ఉద్యోగం చేశాడు. అతిక్లుప్తమైన సాంసారిక జీవితానంతరం భార్యా వియోగం. స్వతంత్ర భారతి పిలుపు ఊపిరి సలప నివ్వక, ఉద్యోగానికి రాజీనామాచేసి సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ సన్నిధికి చేరాడు.

ం ం ం ం

ఎంత ఉద్విగ్నంగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందంటే, కేంద్రప్రభుత్వం వెంటనే కదిలి ఫజులాలీ ఆధ్యక్షతన రాష్ట్ర పునర్నిర్మాణ సంఘాన్ని నియమించింది. దేశపటమే మారి 1956 నవంబరు ఒకటికి భాషా ప్రయుక్త రాష్ట్రామేర్పడటం, నిజాం రాష్ట్రంలోని తెలంగాణా జిల్లాలు ఆంధ్రతో కలిసి చిరకాలస్వప్న ఫలంగా ఆంధ్రప్రదేశ్ సువిశాల రాష్ట్రం ఏర్పడటం ఒకదానివెనక ఒకటి అనివార్యంగా జరిగి పోయాయి. అంతవరకూ, మహాకవిచెప్పినట్టు చారిత్రక వాగ్దానం సంపూర్ణ సఫలత చెందింది.

కాని అదే ప్రజాకవి హెచ్చరిస్తున్నాడు. "ఈ రాష్ట్రం, ఇదిగో ఇప్పుడే చెబుతున్నా, ఏదో కొందరి సదుపాయాని కేర్పడలేదు ఎవరో కొందరుద్యోగుల కనివేర్పడలేదు." ఎందరో జ్ఞాత, అజ్ఞాత వీరుల త్యాగాలతో ఏర్పడ్డ ఈ రాష్ట్రం ప్రతి ఒక్క తెలుగు వాడిదీ!


వచ్చే సంచికలో చదవండి

సీతా, ఓ సీతా!

దేవిప్రియ నవ్యధోరణి నాటిక!

బహుమతి రు. 100

శ్రీశ్రీ నిర్వహిస్తున్న పదబంధ ప్రహేళిక



ఆధారాలు డిసెంబరు '80

అడ్డం:

1. ఉగాదికి చిగురు
3. పడతుల పక్ష పాతి
5. 16 నక్సలిజానికి నాంది
6. అల్లసాని అగ్రహారం
8. ఆంధ్రదేశం అన్నం
9. బాలకృష్ణుడు
11. కనుక
13. శ్రుతి విభాగం
15. నాటకానికి తెర ఎత్తడం
16. చూడు 5 అడ్డం
17. ముగ్గురు కవుల ముద్దుబిడ్డ

19. ఆకర్షించి
22. నావి (బహువచనం)
23. జనానాలలో కనిపించేది
25. విజాతి
26 జంట
28. హైదరాబాదులో ఆఖరివాడు
30 తగ్గు
31. వికారంతో విస్తృతి

నిలువు :

1. తోకతెగిన ఋతువు
2. వెండిది సాధారణంగా రెండోది
3. వెన్నెల తిండి
4. చుట్టూ నీళ్ళు
5. అందే రంగులు పులుముతమా?
7. చప్పుడు వింటిని
8. వయో విశేషం
10. రాజమండ్రిలో ట్రాజెడీ
12 శ్రావణ మేఘం
14. కూడింది
15. నమస్కారం
17. కూచిపూడి కల్యాణం
18. రవి కవీంద్రుని 15 అడ్డం
20. అలంక్రియ
21. ప్రోగు
23 పిట్ట గడ్డ గూట
24. రాక్షసి
27. తెలుగు యతి
29. జాతం పువ్వు, వాహం మబ్బు.

నవంబర్ ప్రహేళిక సమాధానాలు

అడ్డం : 1. బాకా, 3. కత, 5. పెసలు, 6. విలాసం, 8. జారు, 9. వనిత, 11. పకో 13. వాగుర, 15. బాదర, 16. సహోద్యోగిని, 17. నదీన, 19. సరదా, 22. గని, 23. నాలుగు 25. సాలు, 26. కిరీటి, 28. రుమాలు, 30. తిక, 31. తుని.

నిలువు : 1. బాస, 2. కాలువ, 3. కవిత, 4. తలా, 5. పెరుగు, 7. సంపద 8. జావా, 10, నిరుద్యోగులు, 12. కోర, 14. రసన, 15. బానిస, 17. నగ, 18. దీనికి 20. రసాలు, 23 దాలు, 24. నాటిక, 24. గురుతు. 27. రీతి, 29. మాని.

నవంబర్ విజేతలు :

1. పి. వి. కృష్ణయ్య, వాల్తేరు, 2. ఎం. ఎల్. ఎన్. ఆచార్యులు, సింహాచలం, 3. ఎం. వేణు గోపాలశర్మ, ఖమ్మం, 4. కె. ఎ. సింగరాచార్యులు, హైదరాబాదు, 5. శ్రీమతి కె. ఉమాదేవి, వాల్తేరు, 6. పి. ప్రభాకర్, నగరం, 7. ఎం. వి. కృష్ణమాచార్యులు, సింహాచలం, 8. జె. మోహనరావు, నగరం.

నిబంధనలు గమనించండి :

పదబంధ ప్రహేళిక కొట్టివేశలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి నవంబర్ 30 వ తేదీ లోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూరిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపే వారు వారి పూర్తి చిరునామా ఎంట్రీ పైనే రాసి పంపాలి. ఆల్ కరెక్టు ఎంట్రీకి రు. 100/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడు తుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటి రాకపోతే బహుమతి సొమ్ము పై నెలబహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది: ఒక ఎంట్రీమీద ఇరువురి పేర్లు వుండకూడదు.

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-500 020

JYOTHI DECEMBER Rs.3.50 REGD.NO. M8669 - H/S 7

